అపరాధ పరిశోధన

వె.5·50 | డిసెంబర్ '83 |

Blank Page

సంపుటిః 37
సంచికః 5

ఫోన్ నెం:
64643

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 66 రూపాయలు.
హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

డిసెంబరు, 1983

Kattukolu Subba Reddy
Home Library, Vedagirala.

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
ఏ. వీ. మోహన్రావ్
ఆర్. ప్రభాకర్
బొమ్మిడి అచ్చారావు

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, । నెలానెల పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 10-00లకే వి.పి.ద్వారా పంపబడతాయి. ఇందుకు అయ్యే పోస్టుఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానె మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ,పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 10/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 120/-లు ముందుగా పంపవచ్చును. దీని వల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి.

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. రచయితలారా ఏకంకండి
—పొత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ
14. రాకాసి కీటకాలు
—పాపార్జున్ అండ్ ఎమ్. వి. వి. సత్యనారాయణ
39. ప్రేమదేవత—వసుంధర
59. వూబి—జి. ఉషా విఠల్
71. ఎరిగిన దొంగ—ఎం. డి. చైతన్య
79. కొండను త్రవ్వి కన్న ఎలుక—వాణిశ్రీ
95. నగ్నసుందరి ఫోటో—కాశీభట్ల భానుమూర్తి
112. శవాల దోపిడి—కె. వి. రమణ
134. ఆపదలో అబల—బి. రాజేశ్వరి
155. గోడలకు చెవులుంటాయ్—ప్రతాప రవిశంకర్
165. గుడ్డి దర్బారు (సీరియల్)—వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. తను తవ్విన గొయ్యి—వసుంధర
46. మృత్యుతరంగాలు—అజీజ్
97. ఈనాటి సావిత్రి—టెంపోరావ్
134. విషసర్పాలు (సీరియల్)—సికిందర్
151. కళ్యాణదుర్గం (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

ఇవిగాక — క్రైమ్‌లో తమాషాలు. ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, మరెన్నో ఆకర్షణలు!!

రచయితలారా ఏకంకండి!

పొత్తూరు రాజేంద్ర ప్రసాదవర్మ

నేను రచయితను.

చాలా మందిలా వ్యాపార రచయితను, కొద్దిమందిలా పత్రికా రచయితనూ, మరి కొంతమందిలా అభ్యుదయ రచయితనూ కాదు. నా మనస్సాక్షికి నచ్చినది రాసి పత్రికల నిర్ణయాల కోసం ఎదురు చూస్తుంటాను. నా రచనను ఒక పత్రిక నిరాకరిస్తే మరో పత్రికకు పంపుకుంటాను.

నాకు సుమారు వంద కథల అనుభవం వుంది. నేను కథలే కాకుండా వ్యాసాలు కూడా కొన్ని రాశాను.

నాకో స్నేహితుడు వున్నాడు. అతని పేరు వీర్రాజు. అతను ఒకటో రకం అభ్యుదయ రచయిత. అభ్యుదయ రచయిత అన్నా, సామాజిక స్పృహ వున్న రచయిత అన్నా ఈ కాలంలో ప్రతీ ఒక్కడూ చెప్పేది ఒక్కటే: తను ఆచరించని నీతులను ఇతరులకు చెప్పేవాడు.

మనం అలా అనుకోవటంలో తప్పులేదు. ఎందుకంటే ఈనాడు వున్న అభ్యుదయ రచయితలలో తొంభై శాతం అటువంటి వారే! దేశంలో ఎంతో దోపిడీ జరుగుతున్నదని వాపోతారు. ఒకళ్ళనొకడు దోచుకొనే సమాజం నశించాలని గొంతు చించుకొని ఘోష పెడతారు. నిజపరిస్థితికి వచ్చేసరికి ఆకలితో అలమటించేవాడికి పట్టెడన్నం, కనీసం ఐదు పైసలు ధర్మం చేయడానికైనా ఎంతో ఆలోచిస్తారు. తనెక్కిన రిక్షావాడితో పావలా ఎక్కువ ఇవ్వడానికి ఎంతో బేరమాడతారు. అందుకే నాకు అటువంటి రచయితలంటే చెప్పలేని అసహ్యం ...ఏవగింపు ...

నేను ఏ ఇజాలుకీ కట్టుబడకుండా నిజాలను చెప్పే రచయితను. ఎక్కడైనా ఏ అన్యాయం జరిగినా దానిని ఎత్తి చూపించి కథగా మలుస్తుంటాను.

వీర్రాజు ఒకరోజు నా దగ్గరకు వచ్చి ఓ పత్రికని చూపించి—"ఈ మధ్య సాహితీలోకంలోనికి దోపిడీ తిమిరాన్ని తరిమేయడానికి రాకెట్‌లా దూసుకు వచ్చిన పత్రిక" అంటూ అందించాడు.

దానిని అందుకొని నిశితంగా పరిశీలించాను. దాని ముఖచిత్రం బావుంది. ఎర్రరంగు అక్షరాలతో వుండి కడుపు కాలిపోయే అన్నార్తుల చిత్రం హృద్యంగా చిత్రించి వుంది.

లోపల పేజీలను త్రిప్పి చూశాను. సాధారణంగా నాకు అటువంటి పత్రికలు పడవు. అసలు వాటిపేపు కూడా నేను చూడను. నా స్నేహితుడూ, సహ రచయిత వీర్రాజు తెచ్చి ప్రత్యేకంగా ఇచ్చాడు గాబట్టి చదివాను.

ఆ పత్రిక చాలా తమాషాగా వుంది. అందులో రెండు కథలున్నాయి. మిగిలిన పేజీలు రకరకాల శీర్షికలతో నిండి వున్నాయి. అందులో 'నిత్య జీవితంలో దోపిడీ' అనే శీర్షిక నన్ను ఆకర్షించింది. ఆ శీర్షికలో దేశంలో ఎక్కడెక్కడ ఎలాంటి దోపిడీలు జరుగుతున్నాయో విపులంగా రాసి వున్నాయి. వ్యాపారంలో దోపిడీ....రాజకీయంలో దోపిడీ....విద్యాలయంలో దోపిడీ ఇలా వివిధ రకాలుగా విభజించి దోపడీ గురించి రాసి వుంది.

ప్రతీ దాంట్లోనూ సామాన్యుడు ఎంతలా ఇరుక్కుపోతున్నాడో అని ఎంతో ఆవేదనతోనూ. ఆవేశంతోనూ రాశాడు సంపాదకుడు. ఆ శీర్షిక నాకెంతో నచ్చింది. నేను దోపిడీని వ్యతిరేకిస్తాను. అందుకు ఆ సంపాదకుడ్ని మెచ్చుకోకుండా వుండలేకపోయాను. నిజంగా ప్రజలు గురి అవుతున్న దోపిడీ గురించి పత్రికా ముఖంగా అలా తెలియజేస్తే చక్కగా వుంటుందని అనిపించింది.

ఆ పత్రిక పేజీలు తక్కువగా వున్నాయి. అయినా దాని రేటు వ్యాపార మాసపత్రికల రేట్లు మాదిరిగానే వుంది. ఆ తక్కువ పేజీలలోనే రకరకాల వ్యాపార ప్రకటనలు, ప్రభుత్వ ప్రకటనలు ఉన్నాయి. దానికి సర్క్యులేషన్ కూడా ఎక్కువేనట. నాకు ఆ పత్రికని అంచనా వేసిన తర్వాత అది లాభాలలోనే నడుస్తుందని అనిపించింది. నా సహ రచయిత వీర్రాజు కూడా ఈ విషయంలో నాతో ఏకీభవించాడు.

నేను నిరుద్యోగిని. చాలాకాలంగా ప్రయత్నిస్తున్నా ఇంతవరకూ ఎక్కడా ఏ ఉద్యోగం కూడా లభించలేదు.

నేను కథలు ఓ మోస్తరుగా రాస్తాను గాబట్టి నెలకు ఎలా లేదన్నా రెండు అచ్చు అవుతాయి. కథలకి వచ్చే పారితోషికం నేను ఉద్యోగం కోసం పెట్టే అప్లికేషన్‌లకు, నాకు నచ్చిన పత్రికలు కొనడానికే సరిపోతుంది.

వీర్రాజు తెచ్చిన సాహిత్య పత్రిక దోపిడీలను బైట పెడుతున్నది గాబట్టి చక్కని పత్రిక అనిపించింది నాకు.

'ఆ పత్రికకు ఒక కథ పంపితే ఎలా వుంటుంది?' అనే ఆలోచన కలిగింది. వెంటనే ఓ చక్కని కథను తయారు చేశాను. రాసిన తర్వాత ఓసారి చదివాను....చక్కగా వున్నట్లుగానే అనిపించింది.

ఆ మర్నాడే ఆ కథని ఫెయిర్ చేసి ఆ పత్రికకి పంపించాను.

2

ఆ రోజు మార్కెట్‌లోనికి వెళ్ళి చూశాను బుక్‌స్టాల్ దగ్గర క్రొత్త పత్రికలు ఏమైనా వచ్చాయేమోనని. నాకు అదోరకమైన అలవాటు వుంది. ఏదైనా క్రొత్త పత్రికలు కనబడితే వెంటనే కొని చదివేస్తాను. దాని గెటప్, స్టాండర్డు గాని నచ్చినట్లయితే వెంటనే ఏదైనా ఓ కథ రాసి పంపుతాను కూడా.

కొట్లో వేలాడుతున్న ఒక పత్రికని చూసి ఆగిపోయాను నేను. ఎదురుగా ఆరోజు వీర్రాజు తెచ్చిన దోపిడీలను గురించి కూలంకషంగా రాసిన పత్రిక కనబడింది. క్రొత్త పత్రిక. ఆ నెలదే!

ఒకసారి ఆ పత్రిక నన్ను ఆకర్షించడం వలన పేజీలు త్రిప్పి చూశాను. ఆశ్చర్యం! అందులో నా కథ ప్రింటు

అయివుంది. నాకు తెలుపకుండానే ప్రింటు చేశారు వాళ్ళు.

వెంటనే ఆ పత్రికని కొని పట్టుకు వచ్చేశాను.

చాలా పత్రికలలో నా కథలు పడ్డాయి. ఒక పత్రికలో వరసగా కూడా ప్రచురింపబడ్డాయి. ఒక పత్రికలో రెండో సారి నా కథ పడినప్పుడు నేను అంత సంతోషించను. అంతవరకూ ప్రచురింపబడని పత్రికలో నా కథలు పడితే నేనెంతో సంతోషిస్తాను. ఆ కథ కూడా అటువంటి ఆనం దాన్నే కలిగించింది.

నాకు కథ పత్రికలో ప్రింటు అయిన దగ్గర నుండీ ఎదురుచూపు ఎక్కువైంది, పారితోషికం ఏమాత్రం పంపు తారోనని.

అందుకే ప్రతిరోజూ పత్రికా కార్యాలయం నుండి పోస్టు వచ్చిందేమోనని ఎదురు చూసేవాడిని. రెండు నెలలు అయినా ఇంతవరకూ కాంప్లిమెంటరీ కాపీ కూడా రాలేదు.

ఆరు నెలలు గడిచాయి. పారితోషికం గురించి ఎన్ని ఉత్తరాలు రాసినా కనీసం జవాబు కూడా లేదు. పారితోషికం అంతకన్నా లేదు.

నేను ఆ పత్రికచేత దోపిడీ చేయబడ్డాను.

దోపిడీలను గురించి, అన్యాయాలను గురించి ఎంతో చక్కగా నిత్యజీవితంలో దోపిడీ అని రాపి ప్రచారం చేస్తున్న ఆ పత్రికా సంపాదకుడు—నన్ను దోపిడీ చేశాడు. తాను సర్క్యులేషన్ పెంచుకొంటూ, లాభాలు గడిస్తూ కూడా కనీసం ఓ పాతిక రూపాయిలు అయినా పంపకుండా దోపిడీ చేశాడు.

తన పత్రికలో ఎంతో చక్కగా హృదయానికి హత్తు కున్నట్టు రాపి నిజ జీవితంలో దానికి వ్యతిరేకంగా చేశాడు.

అంతే! నేను రెచ్చిపోయాను.

ఏ పత్రికనైతే ఇష్టపడ్డానో—ఆ పత్రికని అసహ్యించుకున్నాను.

అంతే! నా ఆలోచన మారింది. నాలో తెలియని కసి బయలుదేరింది. అదే విషయాన్ని చక్కగా రాసి నా రచనలను ప్రచురించే మిగతా అనేక పత్రికలకు ఒక్కొక్క కాపీ పంపాను. అలా పంపడం ఓ గొప్ప విప్లవానికి నాంది పలుకుతుందని, నా జాతకాన్నే మారుస్తుందని ఆనాడు నాకు తెలియలేదు. కేవలం ఆవేశమే ఆ పనిని చేయించింది.

3

నా రచనల మీదా నా మీద అభిమానంవున్న చాలా పత్రికలు నేను పంపిన పత్రిక దోపిడీని ప్రముఖంగా ప్రచురించాయి. అది పత్రికా ప్రపంచంలోనే పెద్ద సంచలనం.

దేశంలో రచయిత లందరి దృష్టి దానిమీద పడింది. దోపిడీ పత్రికలో ఇంతకు ముందు రచనలు రాసి మోసపోయిన రచయితలందరూ నా నీడకు వచ్చారు. వారందరూ నేను రాసినదంతా నిజమేనని ఆయా పత్రికలకి ఉత్తరాలు రాశారు కూడా! అంతే. పత్రికా ప్రపంచం అంతా గుప్పు మంది.

కొంతమంది రచయితలు నన్ను ప్రత్యక్షంగా కల్సుకొని నేను చేసిన పని బావుందని మెచ్చుకొన్నారు.

అప్పుడే నాకో కొత్త ఆలోచన కలిగింది.

తెలుగు రచయితలని, దోపిడీకి గురి అవుతున్న వారిని కూడగట్టాలని.

అంతే! నాకు తెల్సిన రచయితలందరికీ ఉత్తరాలు రాశాను. పేపర్లలో ప్రకటించి తెలియజేశాను.

ప్రస్తుత పత్రికా లోకంలో చాలామంది రచయితలు దోపిడీకి గురి అవుతున్నవారే! కొన్ని పత్రికలు రచనలు

పంపి సంవత్సరాలు గడిచినా ఏ నిర్ణయాలు తెలియజేయవు. కొన్ని పత్రికలు రిటన్ పోస్టేజి పెట్టినా, రచనలను త్రిప్పి పంపవు. మరికొన్ని పత్రికలు ప్రచురించిన రచనలకు కాంప్లిమెంటరీ కాపీలు, పారితోషికాలు పంపవు.

నా విప్లవంలో పాలు పంచుకొన్న ప్రముఖ, వర్ధమాన, యువ రచయితలందరినీ ఏకం చేశాను. ఒక రచయితకూ మరో రచయితకూ ఎప్పుడూ సామ్యం కుదరదు. కానీ నేను నడపబోయే ఉద్యమం వలన అందరికీ లాభం వుంటుందని ఏకం అయినారు.

వారందరికీ నా భావాలు తెలియజేశాను.

రూపాయి వున్న వారపత్రిక ఏజంటుద్వారా అమ్మించ డానికి ఏజంటుకు పావలా కమీషన్ యిస్తున్నది. కాని రచయితలకు రూపాయి పత్రిలో పైసా వంతుగూడా పారి తోషికం యివ్వటం లేదు.

'రచన ప్రచురించటం, నిరాకరించటం పత్రిక ఇష్టం. కానీ నిర్ణయాలు తొందరగా చెప్పకపోవటం సహించలేం. దానిని రచయితలందరూ వ్యతిరేకించాలి. రచయితలకు కాంప్లిమెంటరీలు సక్రమంగా పంపడమే కాకుండా పారి తోషికాలు గూడా పెంచాలి. అందుకు రచయిత లందరూ ఏకం అయి పత్రికా ప్రపంచాన్ని మార్చివేయాలి'—నా ఈ వాదన చాలామంది రచయితలను ఆకర్షించింది.

అంతవరకూ రచయితలలో పత్రికల పట్ల ఓ భయం వుంది. రచయితలు పత్రికలతో తగువులు పెట్టుకోరు. రచయిత తాను రాసిన రచన, తన ఆలోచన పాఠకులతో పంచుకోవాలంటే పత్రికలే వారధి. అటువంటి వాటి మీద ఏమైనా రాస్తే మరి తన రచనలు వేసుకోవు అని భయం.

కాని నేను ముందుండి ఈ ఉద్యమానికి నాయకత్వం

వహించడం వలన తెరవెనక నుండి రచయితలు తమ పూర్తి మద్దతును అందిస్తున్నారు.

రచయితలందరూ ప్రతీసారీ కల్పుకోవడానికి వీలు కల గదు కాబట్టి అందరికీ వీలుగా వుండేటట్లు ఓ పత్రిక స్థాపిద్దాం అనుకొన్నాను. నేను చేసిన ఆ ప్రతిపాదనను రచయిత లందరూ ఆమోదించారు. ఎవరికి తోచిన సాయం వారు చేశారు.

4

మేం స్థాపించిన పత్రిక పేరు ప్రతిధ్వని.

పత్రిక వలన దేశంలో రచయితలను ఎంతమందినో కూడగట్టాగలిగాను. పత్రికలు, సంపాదకులు వ్యవహరి స్తున్న నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా మా పత్రిక పని చేస్తున్నది.

పత్రిక నిండా రకరకాల రచనలు వుండేవి.

పత్రిక విడుదల అయిన క్రొత్తలోనే ప్రముఖుల అంద రినీ ఆకర్షించింది. ప్రతీ రచయితా అందులో భాగ స్వామ్యాన్ని పంచుకొంటున్నారు. రచయితలు తెర వెనుక నుండి నాచేత ప్రచ్ఛన్న యుద్ధం చేయిస్తున్నారు.

వ్యాపార పత్రికలు అనుసరిస్తున్న విధానాలు, రచయిత లకు అసౌకర్యం కలిగిస్తున్న పద్ధతులు వివిధ రచయితలు, ముఖ్యంగా కొత్తవారు అటువంటి అనుభవాలను రాసేవారు. వాటన్నిటినీ ప్రచురించేవాడిని. దానితో పాఠకులలో కొంత సెన్సేషన్ క్రియేట్ అయ్యేది. అందువలన కూడా మరిం తగా పాపులర్ అయిపోయింది.

దేశంలో మారుమూల నున్న యువ. వర్ధమాన. ప్రముఖ రచయితలందరూ ఈ పత్రికకి మద్దతు నిస్తున్నారు కాబట్టి వారంతా చందాదారులై పోయారు. పత్రికకి గవర్నమెంట్

ప్రకటనలు గూడా అందుతున్నాయి.

యువ రచయితలను కూడగట్టాను. రచనలు ప్రచురింప బడకుండా ఎంతో మంది నిరుత్సాహపడుతున్నారు. రచన పంపుతూ పత్రికకి డొనేషన్ కట్టితే అంటే పత్రిక పురోభి వృద్ధికి తనకు తోచిన సహాయం చేస్తే వారి రచనలను ప్రచురించేవాడిని.

వారి రచనలను దిద్ది నా పత్రికలో ప్రచురించే వాడిని. దానివలన యువ రచయితలందరూ నా ప్రక్కన చేరారు. నా పత్రికని ప్రచారం చేయటం మొదలు పెట్టారు.

పత్రిక గురించి పాటుపడుతున్న రచయిత లందరిచేత చందాలు కట్టించడమే కాకుండా, వారి చుట్టుప్రక్కల వారి చేత కూడా కట్టించమని కోరుతున్నాను. కొంతమంది ప్రకటనలు కూడా విరివిగా సేకరిస్తూ పంపిస్తున్నారు.

నా పత్రిక సర్క్యులేషన్ పెరిగిపోయింది.

పారితోషికం కాకుండా నా పత్రికలో రచన పడితే చాలు అన్నట్లుగా రచయితలు తయారయ్యారు.

నా పేరుకి లోటులేదు.

నాకు ఇప్పుడు నిరుద్యోగ సమస్య తీరిపోయింది.

బాంకులో ఎక్కౌంటు పెరిగిపోయింది.

నా ఉద్యమాన్ని ఇంకా విస్తృత పరచాలి.

కొత్త రచయితలకు పారితోషికం ఈయకపోయినా పర్వాలేదు—రచన ప్రచురింపబడితే చాలు. అలాగే చేస్తున్నాను. క్రొత్తవారికేమిటి ప్రముఖ రచయితలు సైతం నా పత్రికలో పారితోషికం లేకుండానే రాస్తున్నారు ఎందుకంటే వారందరూ నా ఉద్యమంలో పాలు పంచుకొంటున్నారు.

ఇంకా ఉద్యమం విస్తృతి చెందాలి.

నా పత్రిక ఇంకా లాభాలు గడించాలి. దానికి రచయితలు ఎంతోమంది ప్రకటనలు, చందాలు సేకరించడానికి రచనలు అందించడానికి నా వెనక వుండాలి.

అందుకే నా పత్రికలో ప్రతీ పేజీలోనూ నా నినాదాన్ని ప్రచారం చేస్తున్నాను.

అదే!

'తెలుగు రచయితలారా—ఏకంకండి!'

ఆ నినాదమే నా పత్రికకి బలం, పెట్టుబడి, లాభాలూను. □

కూరగాయలండోయ్



రాకాసి కీటకాలు



కృష్ణమూర్తి టెంటులోంచి బయటకు వచ్చాడు.

రాజూ, బాబులూ వంటపనిలో వున్నారు. శేషగిరి వంట చెరకు నరికి ముక్కలు చేస్తున్నాడు. కృష్ణమూర్తి వంట

పనివైపు వెళ్ళి, "సాయం కావాలన్నట్టా?" అన్నాడు.

రాజు అతడిని చూచి, అక్కర లేదన్నట్టుగా తల అడ్డంగా త్రిప్పాడు.

"ఈ కట్టెలు ప్రోగుపెట్టరా మూర్తీ!" అన్నాడు శేషగిరి.

శేషగిరిని సమీపించాడు కృష్ణమూర్తి.

"ప్రొఫెసర్‌గారు యింకా రాలేదు. కారణం ఏమై వుంటుందంటావు?" అన్నాడు కృష్ణమూర్తి కట్టెలు ఏరి కుప్ప వేస్తూ.

దూరంగా చెట్లమీద పక్షులు ఎగురుతోన్నాయి. సూర్యుడు అలసిపోయినట్టు చెట్లచాటుకు దిగాడు. పగలంతా యెండ వేడిమితో వుక్కపోసిన అడవి క్రమంగా చల్లబడుతోంది.

"ఏమో! నట్టనడిమి అడవిలో మనం నలుగురమూ యీ రాత్రి గడపగలమా?" అన్నాడు శేషగిరి.

మిత్రులు ముగ్గురూ ఆలోచనలోపడ్డారు. ప్రొఫెసర్ రాంశర్మతో కలిపి అయిదుగురు విద్యార్థులు బయలుదేరారు. ఆటవిక జాతుల పుట్టుకకు సంబంధించిన మూలపురుషుల అవశేషాలు కొన్ని ఈ అడవి ప్రాంతాలలో దొరికాయి. అవశేషాల గురించి మరింత సమగ్రమైన సమాచారం కోసం మరిన్ని అవశేషాల సేకరణ కోసం రాంశర్మ ప్రయత్నిస్తున్నారు. ఆయన ప్రోద్బలంమీదనే అయిదుగురు విద్యార్థులు విజ్ఞాన సేకరణకు అడవులు పట్టారు.

ప్రొద్దున్నే ఒక విద్యార్థి అయిన కోటేశ్వరాన్ని తనవెంట పెట్టుకుని ప్రక్కనే వున్న ఆటవికుల గ్రామానికి వెళ్ళారు ప్రొ॥ రాంశర్మ.

"మూడు గంటలకల్లా తిరిగి వచ్చేస్తానన్నారు ప్రొఫెసర్ గారు. ఎందుకు రాలేదు? అటవికుల గ్రామంలో ఆగి

పోయారా?"

"ఆటవికులు ఆయనకు ఏదైనా కీడు తలపెట్టలేదు కదా?"

"ఎక్కడయినా ఆయనకు ప్రమాదం ఎదురయిందా?"

"ఈ అడవిలో క్రూరమృగాల తాకిడి ఎక్కువ వుంటుందని విన్నాను" మిత్రులు తర్జనభర్జన పడుతున్నారు.

శేషగిరీ, కృష్ణమూర్తీ కలిపి టెంటుకు చుట్టూ వంట చెరకు నెగడు రూపంలో అమర్చుతున్నారు.

సాయంకాలమవుతోంది. అడవిలో పక్షులగోలా, జంతువుల అరుపులూ, నక్కల వూళలూ ఎక్కువగా వినిపించసాగాయి. కృష్ణమూర్తి నెగడకు నిప్పు ముట్టించబోయాడు. అప్పుడే టెంటు ముందు జీపు ఆగింది. జీపును రాంశర్మ నడుపుతున్నాడు. అతడి ప్రక్క కోటేశ్వరం కూర్చున్నాడు. వెనుక తగిలించి వున్న ట్రెయిలర్‌లోంచి ఆటవికులు దిగారు.

అంతసేపూ తర్జన భర్జన పడిన మిత్రులకు ప్రాణాలు ఒక్కసారిగా లేచివచ్చాయి. నలుగురూ తమ చేతులలో వున్న పనులను వదలిపెట్టి ప్రొ॥ రాంశర్మను చుట్టుముట్టారు.

ప్రొ. రాంశర్మ వారిని చూసి నవ్వి, "కంగారుపడుతున్నారా. డియర్ ఫెలోస్....?" అన్నాడు. కుర్రాళ్ళు సిగ్గుపడ్డారు.

నెగడు వెలిగించే కార్యక్రమం ఆటవికులు చేపట్టారు.

"మనం యిక్కడ వున్నంత కాలం వీళ్ళు మనకి తోడు వుంటారు" అన్నాడు ప్రొ. రాంశర్మ.

స్నేహితులు ధైర్యంగా వూపిరి పీల్చుకున్నారు.

2

కోటేశ్వరం బద్ధకంగా కదిలాడు. నిద్ర మత్తుగా పట్టేసింది. అయినా మధ్యలో మెలకువ వచ్చింది. కనురెప్పలు బరువుగా కదిపాడు. అకస్మాత్తుగా తనకు మెలకువ యెందుకు వచ్చింది?

టెంటులో దీపం వెలుగుతోంది. టెంటులో నిశ్శబ్దంగానే వున్నా, యెక్కడో శబ్దమవుతోంది. గాలిలో ఏదో విమానం ప్రొపెల్లర్‌లాగా రొదపెడుతోంది. ప్రొపెల్లర్ టెంటు గుడ్డను ఢీకొంది.

ఇప్పుడు టెంటులో జుమ్మ్‌మ్ అని ఒకటే శబ్దం. వంట పాత్రల్లోంచి వస్తోంది శబ్దం. పాత్రలు గిపెడుతోన్నాయి. గ్లాసుల దొంతర క్రిందికి దొర్లిపోయింది. కోటేశ్వరానికి తప్ప మిగతా వారికి నిద్ర మెలకువ రావడంలేదు.

కోటేశ్వరం చటుక్కున లేచాడు. పాత్రలలో ప్రవేశించింది కీటకమా? తుమ్మెదవంటిదయితే అంత పెద్ద శబ్దం చేయగలుగుతోందా? కోటేశ్వరం నీడ టెంటులో కదిలింది. వంటపాత్రలమీద పడింది. మరు క్షణంలో జుమ్మనే మోత గాలిలోకి లేచింది.

స్టూడెంట్స్ పడుకున్న టెంటు ప్రక్కనే ప్రొ. రాంశర్మ పడుకున్న టెంటు వుంది. కోటేశ్వరానికి మెలకువ వచ్చిన సమయానికే రాంశర్మకూ మెలకువ వచ్చింది. ఆయన లేచి కూర్చున్నాడు. వాచీ చూచుకున్నాడు. రాత్రి పన్నెండు దాటి యాభై నిముషాలయింది. టెంటులోంచి బయటకు చూశాడు.

నెగడకూ టెంటుకూ మధ్య ఖాళీ స్థలంలో ఆటవికులు

పడుకున్నారు. నెగడు కాంతిలో అడవి ప్రశాంతంగా వుంది.

'ప్రశాంతతలోనే భయంకరంగా వుంటుంది'. నవ్వుకున్నాడు రాంశర్మ. అతడి నుదురు ముడతలు పడింది. టెంటులో శబ్దమవుతోంది. జుమ్.... ప్రొపెల్లర్ మోత లాగా ఒకటే గోల! రాంశర్మ అటు పరకాయించి చూశాడు.

బల్లమీద జాం, రొట్టె వున్నాయి. జాంసీసా దానంతట అదే దొర్లింది. బల్లమీద నుండి జారి గడ్డిలో పడింది. రాంశర్మ అటునడిచి సీసా ఎత్తుబోయాడు. సీసాలో జుమ్ అంటోంది. రాంశర్మ సీసామూత తడప బోయాడు.

మూతకు రంధ్రం పడింది. సీసాలోంచి కీటకం బయటకు వచ్చింది. రాంశర్మ దాన్ని చూస్తూనే నిర్ఘాంతపోయాడు. కోడిగ్రుడ్డు ప్రమాణంలో నల్లగా నిగనిగలాడుతోంది. రెక్కలు బలంగా వుండి గిర్రున పంకా ఆకుల్లాగా తిరుగుతోన్నాయి. కీటకం సీసామీద వాలింది. రెక్కల వేగమైన కదలిక ఆగింది.

ముందుకాళ్ళతో నోరు తుడుచుకుంది కీటకం. తర్వాత మెల్లగా నోరు తెరచింది. రాంశర్మ గుక్క పృగించి దానినే చూడసాగాడు. నోట్లో రెండు సన్నపాటి బ్లేడ్స్ వున్నాయి. బ్లేడ్స్‌కి ఒకవైపు కొడవలి సరుకులున్నాయి. కీటకం తాపీగా నోరు మూసుకుని వొళ్ళు విరుచుకుంది. రెక్కలను వేగంగా కదిల్చి గాలిలోకి లేచింది. టెంటులోంచి బయటకు ఎగిరిపోయింది. ప్రొపెల్లర్ శబ్దం క్రమంగా దూరమయిపోయింది.

రాంశర్మ మౌనంగా సీసా ఎత్తి చూసాడు. సీసామూత మొత్తం కొరికివుంది. కీటకానికి జాం ఇష్టంలాగా వుంది.

ఊడ్చుకుని నాకివేసింది. దీపం వెలుగులో సీసాలోకి చూశాడు రాంశర్మ. సీసాలో తడివుంది. సీసాను భద్రంగా కాగితంలో చుట్టి తాను పరిశోధన చేయవలసిన సామగ్రితో బాటు వుంచుకున్నాడు.

అవతల టెంటులోంచి ఏదో అలజడి వినిపించింది. రాంశర్మ బయటకు వెళ్ళాడు. స్టూడెంట్స్ పడుకున్న టెంటులో ప్రవేశించాడు రాంశర్మ.

శేషగిరి నేలమీద కట్టెలాగా బిగుసుకుపోయి వున్నాడు. రాంశర్మ అతడి ముక్కువద్ద వ్రేలువుంచి చూశాడు. శేష గిరి భారంగా వూపిరి తీస్తున్నాడు.

"ఏం జరిగింది?" అడిగాడు రాంశర్మ.

కోటేశ్వరం చెప్పాడు. "జుమ్‌మ్....అంటూ చప్పుడు చేసిన కీటకం ఏమిటో తెలియదు సార్! శేషగిరిని కరిచి పోయింది. అంతే—అతను ఇలా బిగుసుకుపోయాడు."

రాంశర్మ తలూపాడు. నిముషాలు బరువుగా కదులు తున్నాయి.

టెంటులో జరుగుతున్న అలికిడికి ఆటవికులు లేచారు. వారిలో ఒకడు టెంటులోకి వచ్చాడు. శేషగిరిని చూశాడు. అతడి బుగ్గలు తడిమాడు. తరువాత శేషగిరి ఒళ్ళంతా పరీ క్షగా నిమిరాడు.

శేషగిరి కాలి పిక్కలమీద కోడిగ్రుడ్డు ప్రమాణంలో వుబ్బివుంది. "మై గుడ్‌నెస్! ఎంత దద్దురు లేచింది!" అన్నాడు రాంశర్మ.

స్టూడెంట్స్ దద్దురు వైపు భయంగా చూస్తోన్నారు. అడవులలో విషపు ప్రాణుల కాటుకు ఆధునిక వైద్యంలో చికిత్సలేదు. ఇంకా ప్రయోగాలు జరగవలసి వుంది. అంత వరకూ శేషగిరి బతుకుతాడా?

"కంగారు వొద్దు బాబు యియి కందిరీగలు. ఒక్క గడియ బాబు....లే త్తడు" అన్నాడు ఆటవికుడు.

"గడియ....అంటే ఎంత సేపు?" అడిగాడు రాంశర్మ.

"లే త్తడు....బెంగ లే...."

"ఇత అతడిని ప్రశ్నించి లాభంలేదు. శేషగిరికి ప్రాణ భయంలేదు అని చెప్పాడు కదా! అదే చాలు సార్!" అన్నాడు కోటేశ్వరం.

రాంశర్మ అతడిని పరీక్షగా చూసి. "ఇతడిని కనిపెట్టుకుని వుండండి. నేను టెంటుకి వెళ్తాను" అన్నాడు.

ఆ రాత్రి ఎవరికీ నిద్రలేదు.

రాంశర్మ తన టెంటులో జాం సీసాలో దొరికిన కొద్దిపాటి ద్రవంతో ప్రయోగం చేస్తున్నాడు.

ॐ

కొండవాలుగా అడవి ఒత్తుగా పెరిగింది. ప్రొ॥ రాంశర్మ ముందు నడుస్తున్నాడు. అతడి వెనుక స్టూడెంట్సు నడుస్తున్నారు. అడవి దుర్గమంగా పెరిగిపోయివుంది. ఎటు చూచినా ముళ్ళదొంకలు.

"ఎలా వుందిరా శేషగిరీ?" అడిగాడు బాబులు.

"నథింగ్. అది కుట్టినట్టుకానీ, దద్దురు లేచినట్టు కానీ మీరు చెబితేనే నాకు తెలుస్తోంది. లేకపోతే—అసలు కందిరీగ కుట్టడం ఏమిటో నాకు తెలియనే తెలియదు" అన్నాడు శేషగిరి.

"అవేం కందిరీగలురా బాబూ! అంత మోత పెట్టాయి."

"అసలు వాటి సైజు ఎంతో?"

"మనం ఆదిమ మానవుడి పుట్టుక తెలుసుకునే కంటె యీ కందిరీగ తాత ముత్తాతలను గురించి తెలుసుకుంటే

బాగుండేది."

స్టూడెంట్స్ నవ్వుకున్నారు. ప్రొ॥ రాంశర్మ ఆగి వెనక్కి తిరిగి తన స్టూడెంట్సును ఆప్యాయంగా చూశాడు.

"కందిరీగల ప్రాజెక్టు ఎవరు తీసుకుంటారో నిర్ణయించుకోండి. తమాషా కాదు."

ఈసారి ఆశ్చర్యపోవడం స్టూడెంట్స్ వంతయింది.

"నిజంగానే అంటున్నారా సార్?" అన్నారు స్టూడెంట్స్.

"అవును కందిరీగల లాలాజలంలో లిక్విడ్ యీథర్ వంటి పదార్థం వుంది."

"లిక్విడ్ యీథర్! అహో!! ఎలాంటి ప్రకృతి విచిత్రం!"

"విచిత్రం కాదు. ప్రకృతి ధర్మం. లోహాలూ, అలోహాలూ ప్రకృతిలోనూ వున్నాయి. మన శరీరంలోనూ వున్నాయి. అయితే వాటి వాటి భౌతిక రూపాలూ, ఉనికీ, ప్రయోజనాలూ తేడా....దట్సాల్."

"మీ మాట వింటుంటే కందిరీగల మీద ప్రయోగాలు నేను చేపట్టాలనుకుంటున్నాను సార్!" అన్నాడు శేషగిరి.

అందరూ శేషగిరిని హాస్యం పట్టించారు.

"డిగ్రీలో నువ్వు జూఆలజీ మెయిన్ తీసుకున్నావా?" అడిగాడు ప్రొ॥ రాంశర్మ.

"లేదు సార్!" శేషగిరి అన్నాడు.

"మీలో కోటేశ్వరం ఒక్కడే జూఆలజీ తీసుకున్నాడు. మెయిన్ సబ్జెక్ట్ అతడికే కందిరీగల ప్రాజెక్టు చేయగల అధికారం వుంది."

కోటేశ్వరం కృతజ్ఞతలతో తలమునకలయాడు.

శేషగిరి చిన్నబుచ్చుకోనకుండా, "కందిరీగ నన్ను కుట్ట

డమే ఒక అర్హతగా భావించుకున్నాను" అన్నాడు.

అందరూ నవ్వారు.

"కోటేశ్వరం నువ్వు కందిరీగలను సేకరించుకో. మిగతావాళ్ళం మమూలుగా నిర్ణయించుకున్న ప్రాజెక్ట్ మీద వుంటాం" అన్నాడు ప్రొ॥ రాంశర్మ.

కోటేశ్వరం తలూపి, "ఆటవికులను సహాయం అడుగుతాను సార్:" అన్నాడు.

ఆటవికుల గూడెంలో కోటేశ్వరం నిలబడిపోయాడు. మిగతా వాళ్ళు ప్రొ॥ రాంశర్మ వెంట లోయకట్టు ప్రాంతాలకు దారితీసారు.

4

కోటేశ్వరం చాల ఆలస్యంగా టెంటుకు తిరిగివచ్చాడు. అతడివద్ద సన్నటి ఇనుప చువ్వలల్లిన పంజరం వుంది. పంజరంలోంచి ఝుమ్మని శబ్దం చేస్తూన్నాయి కందిరీగలు. కోపంతో రెచ్చిపోయినట్టు అవి హోరు పెడుతున్నాయి.

స్టూడెంట్సుకు వాటి కోపం చూశాక మతిపోయినంత పనయింది. అవి ఈ రాత్రికి నిద్రపోనిస్తాయా? అవి నిద్రపోతాయో లేవో తెలియదు అందుకే వాళ్ళు కోటేశ్వరం మీద రకరకాల ప్రశ్నలు పురమాయించారు.

కోటేశ్వరం వాళ్ళ ప్రశ్నలకు జవాబులు చెప్పి కందిరీగలకు అడవి దుంపలను కత్తిరించి మేత పెట్టాడు. కందిరీగలు దుంపముక్కలను వూదేశాయి. ప్రొ॥ రాంశర్మ కందిరీగల గురించి పట్టించుకోలేదు. తన పరిశోధనల కోసం ఏర్పాటు చేసుకున్న అంశాల గురించి ఆలోచించుకుంటున్నాడు. తన టెంటులో రకరకాల గ్రంథాలను రిఫర్ చేసుకుంటున్నాడు.

ఆ రాత్రి భోజనాల దగ్గర మాత్రం ఆయన కోటేశ్వ రాన్ని ప్రశ్నించారు.

"ఎన్ని కందిరీగలు సంపాదించావు కోటేశ్వరం?"

"ఇరవై వరకూ దొరికాయి సార్! లక్కీ న్యూస్.... ఆడ కందిరీగ దొరికింది సార్! అది సాధారణంగా పట్టు బడదని చెప్పారు ఆటవికులు."

"గుడ్ ఆడ కందిరీగ అయితే ఉత్పత్తిని పెంచుకో వచ్చునూ, వాటిని క్రమబద్ధమైన పరిశీలనలో వుంచుకోనూ వచ్చును"

"అవును సార్! అంతా ఆటవికుల కృషివల్లనే సాధ్య మయింది సార్!"

"వీటి ఆహారపు టలవాట్లను గురించి తెలిశాయా వివ రాలు?"

"తెలిశాయిసార్! రోజుకు మూడుసార్లు యివి ఆహారం తింటాయి. ఒక కందిరీగ ఎంత బరువు వుంటుందో ఆ బరువుకు రెట్టింపు బరువు ఆహారం స్వీకరిస్తాయి. అడవి దుంపలు, జొన్న కంకులూ, చెరకు గడలూ వీటికి ప్రీతి కరం. గంటకు 80-100 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. వీటికి వాసన శక్తి అమోఘం. ఫాన్ పూర్తి స్పీడులో తిరుగునంత వేగంగా యివి రెక్కలను చలింపచేస్తాయి."

"గుడ్, కోటేశ్వరం! చాల ముఖ్యమైన సమాచారం సంపాదించావు."

గురువుగారి అభినందనకు శిష్యుడు చాలా సంతోష పడ్డాడు. రాంశర్మ తన విద్యార్థులకు గుడ్‌బై చెప్పి తన టెంటులోపలికి వెళ్ళిపోయాడు. ఆటవికులు నెగడు వెలిగిం చారు.

"కందిరీగలు రాత్రివేళలో విశ్రాంతి తీసుకుంటాయా!"

అడిగారు మిత్రులు.

కోటేశ్వరం నవ్వి, "కడుపు నిండి వుంటే అవి విశ్రాంతి తీసుకుంటాయి" అన్నాడు.

"ఈ రాత్రి వీటి మిత్రబృందం మన మీద దాడిచేస్తాయేమో!"

"అవును. అందుకే యీ కందిరీగల బోనును ఎక్కడ వుంచుదాం?"

"గుడారం బయట నెగడు వేడి సోకనిచోట."

కోటేశ్వరం మిత్రుల మాట మన్నించాడు. అందరూ నిద్రకు వుపక్రమించారు. కాని రాంశర్మ మాత్రం తన పుస్తకపఠనంలో తీవ్రంగా నిమగ్నమై వున్నాడు. అర్ధరాత్రి గడిచింది. ఆటవికులూ, స్టూడెంట్సూ నిద్రకు దాసోహ మంటున్నారు.

ఉన్నట్టుండి రాంశర్మ గుడారంలో దీపం పగిలింది. కిరసనాయిలు ఒలికింది. ఇంకేముంది జ్వాలలు లేచాయి. గుండె లవిసిపోయేలాగా రాంశర్మ అరిచాడు. జ్వాలలు టెంటును నాలుగుప్రక్కలా చుట్టుముట్టాయి.

ఆటవికులకూ, స్టూడెంట్సుకూ మెలకువ వచ్చింది. టెంటు కాలుతోంది. నిద్ర కళ్ళతో అటు పరుగెత్తారు. ఎవరి కందిన నీటి బకెట్లు వారు జ్వాలలవైపు వాపిరారు. జ్వాలలు మరీ రెచ్చిపోయాయి. నీళ్ళు నిండుకున్నాయి. ప్రొ॥ రాంశర్మతో సహా టెంటు మొత్తం కాలిపోయి బూడిద మిగిలింది.

స్టూడెంట్స్ గొల్లుమన్నారు. ప్రొ॥ రాంశర్మ వాళ్ళను ఒక గురువులాగా కాక ఒక ఆప్తమిత్రుడిలాగా చూచేవాడు. అందరిలోనూ పరిశోధనా కాంక్షను పెంచాడు. తల్లినీ తండ్రినీ ఒకేసారి కోల్పోయినట్టు స్టూడెంట్స్ దుఃఖించారు.

అతి కష్టంమీద ఆ రాత్రి తెల్లవారింది. గుడారం బూడిదగా అయివుంది.

కోటేశ్వరం కెవ్వుమన్నాడు. అతడు కందిరీగల పంజరం వుంచిన చోట అది లేదు. అక్కడే కాదు ఆ చుట్టుప్రక్కల ఎక్కడా కనిపించనే లేదు.

" 'మై గుడ్‌నెస్' పంజరం ఏమయింది!" అరిచాడు కోటేశ్వరం.

ఒకప్రక్క స్టూడెంట్సూ, రెండోప్రక్క ఆటవికులూ కందిరీగల పంజరం కోసం వెతికారు. పంజరం ఎక్కడా కనిపించలేదు. కోటేశ్వరం దాదాపు పిచ్చివాడై పోయాడు. ఒకవేపు ప్రొఫెసర్‌గారు టెంటుతో సహా దగ్ధమైపోయారు. రెండోప్రక్క తను మూడు రోజులపాటు యెన్నో వ్యయ ప్రయాసలకు లోనై సేకరించిన కందిరీగలు మాయం కావడం విచిత్రంగా వుంది. ఈ రెండు సంఘటనల వెనుక వున్న హస్తం ఎవరిది?

'శేషగిరి!' పళ్ళు పటపటలాడించాడు. బహిరంగంగానే శేషగిరితో తగాదా వేసుకున్నాడు కోటేశ్వరం.

"కోటేశ్వరం! నాకు ప్రొఫెసర్‌గారి మీద పగ ఏమిటి? ఎంతగా అయితేమటుకు ఆయనను సజీవంగా దహనం చేస్తానా?" అన్నాడు శేషగిరి.

"కందిరీగల ప్రాజెక్టును నువు పరిశోధిస్తా నన్నావు. ఆయన నిన్ను కాదని ఆ బాధ్యత నామీద వుంచారు. నువు గురువుగారిమీద కత్తికట్టి సమయంకోసం చూస్తున్నావు. కందిరీగల పంజరం దాచిపెట్టి వచ్చావు. టెంటుకు నాలుగు ప్రక్కలా నిప్పుపెట్టావు. చదువులో నిమగ్నం అయి పోయిన గురువుగారు జ్వాలలను చూసుకోలేదు. ఆహుతై పోయారు."

"అబద్ధం! కాకమ్మ కథలు చెప్పి గురువుగారి మరణానికి నన్ను హంతకుడిని చేయాలనుకుంటున్నావు. నన్ను అడ్డు తప్పించాలని నీకే యీ పథకం తోచి వుంటుంది. కందిరీగల బోనును రాత్రి నువ్వే దాచి వచ్చావు. గురువుగారిని నువ్వే చంపి వుంటావు. ఆయనను అడ్డం తప్పించు కున్నట్టే నన్ను అడ్డం తప్పించుకోవాలని పన్నాగం పన్నావు. రాంశర్మగారు నీకు ఏం అపకారం చేశారు?" శేషగిరీ కోటేశ్వరం అచ్చమైన శత్రువులలాగా కలియ బడ్డారు. మిత్రులు వాళ్ళను విడదీశారు.

"మనం ఈ అడవిలో కుమ్ములాడుకోవడం అనవసరం. టవున్ వెళ్ళి ప్రొ॥ రాంశర్మగారి మరణం గురించి ఎటూ పోలీసులకు తెలియచేయవలసి వుంది. మీ యిద్దరి వ్యవహా రమూ అక్కడే తేల్చుకోవచ్చును" అన్నాడు కృష్ణమూర్తి.

అందరికీ అంతవరకూ తర్వాత ఏం చేయాలో తెలియ లేదు. కృష్ణమూర్తి మాటలు వాళ్ళకు కర్తవ్యం తెలిపాయి.

భస్మరాశిగా మారిన గురువుగారి టెంటువున్న స్థలాన్ని చూచి మౌనంగా నిలబడ్డారు. వాళ్ళ కళ్ళు తడిశాయి నీరు ధారగా కారుతోంది. నాగరికుల సంస్కారం ఏమిటో అర్థం గాక ఆటవికులు బిక్కమొహాలతో కూర్చున్నారు.

5

సాయంత్రం ఆరయింది. శీతాకాలం కావడం వలన జనం మార్కెట్ వీధులలోంచి తొందరగా యిళ్ళకు చేరు కుంటున్నారు. చీకటి పడింది లగాయితు మంచు కురు స్తోంది.

తారాచంద్ కళ్ళజోడు తీసి కాష్‌బాక్స్ మీద పెట్టాడు. కళ్ళు నులుముకుని షాపులోకి చూశాడు. తన వజ్రాల,

బంగారు ఆభరణాల షాపులో దీపాలు ప్రకాశవంతంగా వెలుగుతోన్నాయి. సేల్స్‌మన్‌లు యిద్దరూ ఒకచోట చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు.

తారాచంద్ తిరిగి కళ్ళద్దాలు పెట్టుకుని లెడ్జర్ ముందు వేసుకున్నాడు. ఎలక్ట్రానిక్ కాలిక్యులేటర్ అరచేతిలో వుంచుకున్నాడు. నంబర్లు నొక్కబోయాడు.

షాపులోకి ముసలాయన ప్రవేశించాడు. కర్ర తాటించుకుంటూ తారాచంద్‌ను సమీపించాడు. అతడి భుజానికి పెద్ద గుడ్డసంచి వ్రేలాడుతోంది.

"ఏం కావాలి సార్?" అన్నాడు తారాచంద్.

"ఈ వీధిలో పేరున్న షాపు మీదే కదూ!" అడిగాడు ముసలాయన.

"అవును."

"రెండు తులాల బంగారం గొలుసులో లాకెట్ అమర్చాలి."

"అలాగే ఆర్డరివ్వండి. లాకెట్స్ నమూనాలూ, గొలుసు తయారు నమూనాలూ పరిశీలించండి" తారాచంద్ తన సేల్స్‌మన్ వైపు చూశాడు.

ముసలాయన ఆత్మీయంగా తారాచంద్ భుజం తట్టి, "మనం ఒకే వయసువాళ్ళం అనుకుంటాను" అని సేల్స్‌మన్ వైపు నడిచాడు.

తారాచంద్‌కి అతడి ప్రవర్తన విడ్డూరంగా వుంది. ముసలాయనను అటు వెళ్ళనిచ్చి తారాచంద్ లెడ్జర్‌తో కుస్తీపట్టసాగాడు.

నమూనాలు ఎంచుకున్నాడు ముసలాయన. సేల్స్‌మన్‌ల యిద్దరి భుజాలూ తట్టాడు. తారాచంద్‌కి అడ్వాన్స్ యిచ్చి బయటికి నడిచాడు.

సేల్స్‌మన్‌లు యిద్దరూ యజమానిని సమీపించారు. "ముసలాయన సంచిలో ఏవో తినుబండారాలున్నాయి సార్. జిహ్వాచాపల్యం వున్నవాడికి లాగా వున్నాడు సార్!" అన్నారు వాళ్ళు.

తారాచంద్ నవ్వి, "అతడు నా వద్ద నిలబడినంత సేపూ తినుబండారాల వాసనే వేసింది. అంతా యింకా అతడు యిక్కడ నిలబడినట్టే వాసన వస్తోంది" అన్నాడు.

తారాచంద్ మాట ముగియనేలేదు జుమ్....మన్న ప్రొపెల్లర్ తిరుగుతున్న చప్పుడు. ముగ్గురి కళ్ళూ ఆశ్చర్యంగా తెరచుకున్నాయి. ఏం జరుగుతోందో ముగ్గురికీ తెలియలేదు.

ఒక గంట తర్వాత వాళ్ళకు స్పృహవచ్చింది. తారాచంద్ గుండెలు అవిసిపోయాయి కాష్‌బాక్స్ తెరిచేవుంది. వజ్రాలనగల షోకేసు ఖాళీగా వుంది.

6

"విశాఖపట్నం: డిసెంబర్ 16.

స్థానిక నగల దుకాణంలో గతరాత్రి విచిత్రమైన దొంగతనం జరిగింది. తారాచంద్ తన ఇద్దరు సేల్స్‌మన్లతో షాపులో వుండగానే దొంగతనం జరిగింది. కాష్‌బాక్స్ తెరిచి సుమారు అరవై అయిదు వేల రూపాయల నగదునూ, రెండు లక్షల రూపాయల విలువైన వజ్రాల నగలనూ దొంగ(లు) ఎత్తుకుపోయారు. దొంగతనం ఎలా జరిగిందో వాళ్ళలో ఒక్కరూ చెప్పలేకపోయారు. ఇది మరీ విచిత్రంగా వుంది.

పోలీసుల దర్యాప్తులో ఈ విషయాలు తేలాయి.

దొంగతనం జరగడానికి ముందుగా తారాచంద్

షాపులోకి వచ్చిన ముసలాయన ఎవరు? అతడి వద్ద తినుబండారాల వాసన వున్నట్టు తారాచంద్, అతని సేల్స్‌మన్ చెప్పడంలో అంతరార్థం వుంది. దొంగతనం జరిగినంతసేపూ తారాచంద్, అతడి మనుష్యులూ స్పృహతప్పి వుండటం నిజమేనా? స్పృహ తప్పడానికి ముందు ముగ్గురూ షాపు గుమ్మంలో విన్నట్టు చెబుతోన్న శబ్దం ఏమిటి? జూమ్మ్ అని ఎగిరింది తేనెటీగ కాదుకదా! ముగ్గురి శరీరాలపై పెద్ద దద్దురులున్నాయి. అవేమిటో తెలియటంలేదు. క్రయిమ్‌బ్రాంచ్ డిపార్ట్‌మెంటుకు కేసు ఒప్పగించారు. దర్యాప్తు జరుగుతోంది. మా పాఠకులకు త్వరలో కేసు పూర్తి పాఠం అందించ గలం."

కోటేశ్వరం ఆ ఉదయం పత్రికలోని వార్త చదివి కొన్ని క్షణాలపాటు కళ్ళు మూసుకున్నాడు. కృష్ణమూర్తి అతడి భుజంతట్టి, "తారాచంద్ షాపులో జూమ్మ్ అని శబ్దం చేసిన ప్రాణి రాకాసి కందిరీగ. సందేహంలేదు" అన్నాడు.

"అవును. అది నిశ్చయముగా కందిరీగే. అది శేషగిరిని కరచింది. అతడికి స్పృహ తప్పింది. కాని అతడికి ఆ విషయమే తెలియలేదు తారాచంద్, అతడి మనుషులనూ కందిరీగ కుట్టివుండాలి."

"అంతేకాదు. ముందుగా ముసలతను షాపులోకి ఆకర్షించడానికి తినుబండారాల వాసన ఏర్పాటు చేశాడు. తరువాత కందిరీగలు షాపులో ఏ మూల నుండో ప్రవేశించి ముగ్గురినీ కరిచాయి."

"అంతే....ఆ రోజు నేను సేకరించుకున్న కందిరీగలు

ఎత్తుకుపోయినవాడు ముసలాయనే అయివుండాలి."

"ఆ ముసలాయన ప్రొ॥ రాంశర్మ ఎందుకు కాకూడదు?"

"నాన్సెన్స్.... ఆయన చనిపోయారు. పైగా సామాజికంగా ఉన్నతోద్యోగంలో వున్న రాంశర్మగారు యిలాంటి దోపిడీ చేస్తారని నువ్వు యెలా అనుకున్నావు?"

"అయితే నట్టడవిలోంచి కందిరీగల పంజరాన్ని ఎవరెత్తుకుపోయారు—దొంగతనం ముందు తారాచంద్‌కి కనిపించిన ముసలాయన యెవరు? నట్టడవిలో మనం స్టూడెంట్సుం అయిదుగురమూ, ఆటవికులు నలుగురమూ చివరివరకూ కలసే వున్నాం. మనలో ఎవరు పంజరాన్ని అవహరించే అవకాశం లేదు. అపహరించి యెలా అడవి దాటించగలరు?"

కోటేశ్వరం చటుక్కున కిటికీలోకి చూశాడు. కిటికీ అద్దం వెనుక నీడ తప్పుకుంది. కోటేశ్వరం బయటికి పరుగెత్తాడు. కిటికీ సమీపంలో ఎవరూ లేరు. ఎక్కడో జుమ్మంటూ శబ్దం అవుతోంది. కోడి గ్రుడ్డు ప్రమాణంలో వున్న కందిరీగ నల్లటి బంతిలాగా గాలిలో ఎగురుతోంది. కోటేశ్వరం దాన్ని విదిలించుకోబోయాడు. బంతిలాగా వచ్చి కందిరీగ కోటేశ్వరాన్ని కొట్టుకుంది. ఎక్కడో సన్నటి సూది దిగినట్టుగా అనుభూతి కలిగింది. అంతే — తర్వాత కోటేశ్వరం మెల్లగా నేలమీదకు జారిపడ్డాడు. గంట తర్వాత అతడికి స్పృహ వచ్చింది. గదిలో వచ్చి చూస్తే కృష్ణమూర్తి లేడు.

కోటేశ్వరం తలపట్టుకున్నాడు. కందిరీగలను ఎవరో ప్రయోగించినట్టు తెలుస్తోంది.

కోటేశ్వరం పోలీస్ స్టేషన్‌కి వెళ్ళాడు.

మరుక్షణంలో నగరంలో కృష్ణమూ ర్తి కోసం గాలింపు ప్రారంభమయింది. ఆ రోజు గడిచింది కాని కృష్ణమూ ర్తి జాడ తెలియలేదు.

7

"కోటేశ్వరంగారూ? మీకు కిటికీవద్ద కనిపించిన మనిషి గురించి వర్ణించగలరా?" అడిగాడు క్రయింబ్రాంచ్ ఇన్ స్పెక్టర్ కుమార్.

"మనిషిని చూడలేదు సార్! నీడ. అదీ అస్పష్టం గానే."

"నీడ మీకు తెలిసిన మనిషిదా? కొ త్త వ్య క్తిదా?"

"చెప్పలేను సార్!"

కుమార్ చిరాకుగా చూచి, "మీరు నీడను చూచి పరుగెత్తారు. కందిరీగ కుట్టింది. వచ్చి చూసేసరికి గదిలో కృష్ణమూ ర్తి మాయమైపోయాడు. నగరంలో అతడి జాడ దొరకలేదు. మనిషి ఏమైపోతాడు? కరిగి గాలిలో కలిసి పోతాడా?" అన్నాడు.

"నీడలాగా నాకు కనిపించిన వ్య క్తి ఎత్తుకుపోయా డేమో?"

"డామిట్....ఎందుకు ఎత్తుకుపోతాడు?"

"రాంశర్మగారిని తూలనాడాడు కృష్ణమూ ర్తి. దాని తర్వాతనే యీ సంఘటన జరిగింది."

"ఏమని తూలనాడాడు?"

"రాత్రి జరిగిన దోపిడికి రాంశర్మ కారణమేమో అన్నట్టు మాట్లాడాడు."

కుమార్ తల పట్టుకుని, "మీ స్నేహితులకు బుర్రలు చెడిపోయాయనిపిస్తోంది. రాంశర్మ సజీవ దహనమయాడు. అతడి అస్తిపంజరం వెంటు కాలగా ఏర్పడిన భస్మంలో

దొరికింది. అతడు చనిపోయాక ఎలా బతికిరాగలడు?" అన్నాడు.

"అడవిలో కందిరీగల పంజరం మాయమయింది సార్. ఉన్న వ్యక్తులందరమూ అక్కడే వున్నాం. పంజరం ఎలా మాయమయింది? కందిరీగల విషయంలో రాంశర్మ గారు నన్ను వివరాలడిగారు. ఆ రాత్రే అగ్నిప్రమాదం జరిగింది. వీటన్నింటికీ ఏదయినా కనిపించని సంబంధం వుండాలి!"

"అదీ మీరే తేల్చాలి. రాంశర్మగారితో అత్యంత సన్నిహితంగా తిరిగిన స్టూడెంట్ మీరేకదా!"

"నేనే సార్!"

"అందుకేగా కందిరీగల ప్రాజెక్టు విషయం మీకు ఒప్పచెప్పారు."

"కాదుసార్ నేను నిజంగానే ఆ ప్రాజెక్టు చెయ్యడానికి వున్నవారిలో అర్హుడిని."

"అయితే మీకు ఆయన మనస్తత్వం తెలిసే వుండాలి. దోపిడి చేయగలిగే మనస్తత్వం ఆయనకు వుందా?"

కోటేశ్వరం మాట్లాడలేదు. కుమార్ అతడి మొహంలోకి చూచి "మీరు ఏ విషయమూ దాచివుంచకుండా వుండటం మంచిది!" అన్నాడు.

కుమార్ మాట ముగించకముందే టెలిఫోన్ మ్రోగింది. కుమార్ రిసీవర్ ఎత్తాడు.

"సార్! 301 ని మాట్లాడుతున్నాను సార్?" అవతల నుండి వినిపించింది.

"ఎక్కడినుండి?"

"రామకృష్ణా బీచినుండి సార్!"

"చెప్పు. ఏం జరిగింది?"

"సముద్రం వారగా ఒక శవం దొరికింది సార్! యువకుడిది. నల్ల పాంటులోకి తెల్లచొక్కా టక్ చేశాడు."

"అక్కడే కాపలావుండు. నేను సిబ్బందితో వస్తాను."

"ఎస్ సర్!"

కుమార్ హడావుడిగా రిసీవర్ పెట్టేసి హాట్ సరిచేసుకున్నాడు. కోటేశ్వరం మొహం తెల్లగా పాలిపోయి వుంది. కుమార్ అంబులెన్స్‌కి యింటర్ కమ్ నొక్కాడు.

"ఏమిటి సార్....నల్లపాంటులో తెల్లచొక్కా టక్ చేసుకున్నాడా? యువకుడా?" అన్నాడు కోటేశ్వరం.

"ఏం! అతడు మీకు తెలుసా?" కుమార్ అతడిని వెంటబెట్టుకొని జీపును బయలుదేరతీశాడు.

కోటేశ్వరం కంగారుగా చూచి, "అతడు కృష్ణమూర్తి అయివుంటాడు సార్!" అన్నాడు.

జీపు వేగం పుంజుకుంది.

బీచ్‌లో పడివున్నది కృష్ణమూర్తి శవమే. కోటేశ్వరం తనను తాను నిగ్రహించుకోలేక పోయాడు. కృష్ణమూర్తిని నీడలాగా కనిపించిన మనిషే ఎత్తుకుపోయాడు. కృష్ణమూర్తి అతడికి అనుకూలంగా ప్రవర్తించి వుండడు. అందుకే అతడి చేతిలో హత్య అయిపోయాడు.

కృష్ణమూర్తి మెడ నల్లగా కమిలిపోయి వుంది. అతడి మెడమీద వ్రేళ్ళ గుర్తులు స్పష్టంగా కనిపిస్తోన్నాయి. ప్రాథమిక దర్యాప్తు తర్వాత శవాన్ని అంబులెన్స్‌లో మార్చ్యురీకి చేర్పించాడు.

"శవం కంఠం మీద వ్రేలిముద్రలున్నాయి. హంతకుడి కుడిచేతిముద్ర అది. కుడిచేతికి ఆరు వ్రేళ్ళున్నాయి" అన్నాడు కుమార్.

"కుడిచేతికి ఆరు వ్రేళ్ళా?" నోరావులించాడు కోటేశ్వరం.

కుమార్ చురుకుగా తలూపి, "రాంశర్మ చేతికి అయిదు వ్రేళ్ళేకదూ!"" అన్నాడు.

"కాదు సార్! ఆయన కుడిచేతికీ ఆరువ్రేళ్ళు!"

"సెంటు కాలిన భస్మంలో దొరికిన అస్థిపంజరం కుడి చేతికి ఐదు వ్రేళ్ళున్నాయి."

కోటేశ్వరం నిర్ఘాంతపోయాడు. అయితే రాంశర్మ బతికే వున్నాడా? కృష్ణమూర్తిని అతడే చంపాడా? ఎందుకు చంపాడు? కేవలం తనను అనుమానించాడని తెలిసేనా?

8

అందంగా కట్టిన కాలనీ అది. వీధి సందడిగా వుంది. ఆ వీధిలో ఒక చివరగా వున్న యింట్లో పెళ్ళి జరుగుతోంది. ఇల్లు విశాలమైన భవనం. రెండంతస్తుల ఆధునిక నివాసగృహం.

పెళ్ళికూతురుకు నగలు అలంకరిస్తోంది తల్లి. పెళ్ళికూతురి ముందు నగలపెట్టె వుంది. గదిలోనే బల్లమీద వెండి పళ్ళెం వుంది. దానిలో కట్నం సొమ్ము లక్షయాభై వేలున్నాయి. పెళ్ళికూతురు నగలను ఎంచి తల్లికి అందించబోతోంది.

గదిలో సెంటు వాసనలు అలుముకుని వున్నాయి. ఎక్కడో జుమ్మ్ అంటోంది. గాలిలోకి హెలికాప్టర్ లేస్తోన్నట్టు వచ్చే శబ్దం అది. మరుక్షణంలో గదిలోకి బంతిలాగా ఎగురుతూ వచ్చింది కందిరీగ. వస్తోనే పెళ్ళి కూతురును ఢీకొంది. తరువాత తల్లిని ఢీకొంది. ఇద్దరూ తల్లడిల్లిపోయారు.

తల్లీకూతుళ్ళకు స్పృహ తప్పింది. గదిలోకి అతడు

ప్రవేశించాడు. డబ్బు మూట కట్టుకున్నాడు. నగలపెట్టె అందుకొన్నాడు.

క్షణాలలో గోడల చాటున మాయమయ్యాడు.

* * * *

"బాంకిలో డబ్బు జమవెయ్యి. మొత్తం ఎనభై రెండు వేల రూపాయిలు" అన్నాడు మేనేజర్.

కాషియర్ తలూపి, బ్రీఫ్‌కేసులో నోట్లకట్టలు సర్దుకున్నాడు. వాన్‌తో బాంక్‌కి బయలుదేరాడు. వాన్‌ని వెంబడిస్తోంది కందిరీగ. ఎవరో విసిరిన నల్ల అయస్కాంతపు ముక్క లాగా కాషియర్‌ను కరచింది. కాషియర్‌కి స్పృహతప్పింది.

వాన్ రోడ్డు ప్రక్క ఆగింది. డ్రయివర్ సీటు దిగి కాషియర్‌ను సమీపించాడు. బ్రీఫ్‌కేసు అందుకున్నాడు. కాషియర్‌ను మెల్లగా రోడ్డుమీదకు తోసి వ్యాన్‌ని పోనిచ్చాడు.

రాకాసి తేనెటీగలు, వాటి సహాయంతో జరిగే దోపిడీలు నగరంలో పెద్ద సంచలనాన్ని కలిగించాయి.

9

ఆ భవనం అంతటా తియ్యటి వాసన ముక్కుపుటాలకు సోకుతోంది. కందిరీగలు పెద్దవీ, పిల్లలూ కలసి భవనంలో స్వైరవిహారం చేస్తోన్నాయి. భవనంలో చిన్నా పెద్దా మొత్తం పార్టీకి వచ్చినవారంతా ఎక్కడబడిదే అక్కడ నిశ్చింతగా నిద్రపోతున్నారు.

బాగా కలిగినవాడి యింట బర్త్‌డే పార్టీ కావడంతో అందరూ డబ్బు వున్నవాళ్ళే వచ్చారు. అందరివద్దా వున్న డబ్బూ, ఆభరణాలూ ప్రోగుపడి ఒక ట్రంకుపెట్టె నిండిపోయింది. పెట్టెను మెట్లమీదుగా యీడ్చాడు అతడు. జర

జర శబ్దం అయింది.

కందిరీగలు తమ పని అంతటితో అయిపోయినట్టుగా భవనంపైకి ఎగిరిపోయాయి. కదులుతోన్న నల్లటి కోడి గ్రుడ్లలాగా రెక్కలు వూపి ఎగిరిపోతున్నాయి. నాలుగయిదు విమానాలు భవనంపైన గాలిలో ఎగురుతోన్నట్టుగా శబ్దమవుతోంది. రానురాను ఆ శబ్దం దూరమైపోయింది.

అతడు తనలో తానే నవ్వుకుని జేబులోంచి వీసా తీసి ముద్దుపెట్టుకున్నాడు. పై జేబులోంచి పాస్‌పోర్ట్ తీసి సరి చూసుకున్నాడు. పెట్టెను పోర్టికోవైపు లాగాడు. పోర్టికోలో కారు వుంది కారు తలుపు తెరచి వుంది. అతడు పెట్టెను డిక్కీవైపు నెట్టాడు. డిక్కీ మూత తెరిచాడు. అతడి కళ్ళు పెద్దవయాయి. డిక్కీలో పిస్తోలు గురిపెట్టుకుని కోటేశ్వరం కూర్చున్నాడు.

"సార్! క్షమించి చేతులు పైకెత్తి వుంచండి!" అన్నాడు కోటేశ్వరం.

పెట్టెను యీడ్చుకు వచ్చిన వ్యక్తి పకపక నవ్వి చటుక్కున ట్రంకుపెట్టె తలుపు తెరచాడు. ఏదో మీట నొక్కాడు. పెట్టెలోంచి మాయ అర తెరచుకుంది. అరలోంచి రెండు బంతులవంటి ప్రాణులు మోత పెట్టుకుంటూ గాలిలో తిరిగాయి.

కోటేశ్వరంమీద పల్చటి ద్రవం జల్లులాగా పడింది! కందిరీగలు అటు కదిలాయి.

"లాభం లేదు రాంశర్మా!"

ద్రవం జల్లిన రాంశర్మ చటుక్కున ప్రక్కకు చూశాడు. రాంశర్మ కణతకు పిస్తోలు గురిపెట్టి నిలబడ్డాడు క్రయిమ్‌బ్రాంచ్ యిన్‌స్పెక్టర్ కుమార్.

"నువ్వు వేసనూనె ఒంటికి పూసుకుని కందిరీగలను

ప్రయోగిస్తోన్నావు. నీ పద్ధతి కోటేశ్వరం కనిపెట్టాడు. అందుకే నువు సువాసనా ద్రవం అతడిమీద చల్లినప్పటికీ కందిరీగలు అతడివైపు వెళ్ళి ఢీకొట్టి కరవలేక పోయాయి. సువాసనా ద్రవం కంటె వేపనూనె ఘాటు యెక్కువ." నవ్వాడు కుమార్.

అతడి మాటకు తాళం వేస్తోన్నట్టుగా కందిరీగలు రెండూ గాలిలోనే ఎగురుతోన్నాయి.

"మాస్టారూ! ఎందుకు చేస్తున్నారీ పని? మీ విద్య, మేధస్సూ, పరిశోధనా గాలికి వదిలిపెట్టి రాకాసి కీటకాలతో జనాన్ని వంచిస్తున్నారా?" కోటేశ్వరం బాధగా అన్నాడు.

"అంతే కాదు కోటేశ్వరం, నన్ను అనుమానించిన కృష్ణమూర్తిని ఎత్తుకుపోయి నా దారికిరమ్మని బతిమాలాను. అతడు తన విద్యను యీ తుచ్ఛమైన ఆశపోతుతనానికి బలి పెట్టనని చెప్పాడు. అతడిని బతకనిస్తే నా ఆమాకీ చెబు తాడు. అంతవరకూ లోకం నన్ను కీర్తిశేషుడి క్రింద జమ వేస్తోంది. అందుకే అతడిని పీకపిసికి బీచ్‌లో పారేశాను.

మన త్రవ్వకాలలో ఒక అస్థిపంజరం దొరికింది. దానిని స్టూడెంట్స్ కళ్ళ పడకుండా జాగ్రత్తగా నా టెంటుకు చేర్పించాను. అదే రాత్రి నువు కందిరీగల పంజరం తీసుకువచ్చి నా టెంటుకు తిన్నగా వుంచావు.

ఎంతకాలంపాటు యీ దేశంలో యెన్ని పరిశోధనలు చేసి ఏం లాభం? ఎవరు గుర్తిస్తారు! ఇదే విదేశాలలో అయితేనా నా ప్రతిభకు వెంటనే గుర్తింపు వస్తుంది. అందుకే ఆ రాత్రి పథకం వేస్తూ కూర్చున్నాను. అస్థిపంజ రాన్ని టెంటులో ఏర్పాటుచేసి నాలుగు ప్రక్కలా ఒకేసారి అంటుకునేలాగా టెంటుకు నిప్పు పెట్టాను.

కందిరీగల పంజరంతో అడవి దాటాను. కందిరీగల

వాసన శక్తిమీద ప్రయోగాలు చేశాను. విదేశాలకు వెళ్ళి పోవాలి. నా ప్రతిభతో యింకా గొప్ప శాస్త్రవేత్తను కావాలి! అనుకున్నాను కాని.... ఈ పార్టీ కావాలని మీరే ఏర్పాటు చేశారనీ, కావాలని పత్రికలలో ప్రకటించి నా దృష్టిని యిటు మళ్ళించారనీ గ్రహించలేకపోయాను" తల వొంచి నిలబడ్డాడు రాంశర్మ.

కుమార్ సంకెళ్ళు తీశాడు.

గాలిలో యెగురుతోన్న రాకాపి కీటకాలు యింకా పైకి లేచాయి. కుమార్ తమాషాగా సంకెళ్ళు చప్పుడు వేశాడు. అవి పైకి ఎగిరిపోయాయి.

ప్రొ॥ రాంశర్మ చేతులు చాపాడు. కుమార్ ఆయన చేతులకు సంకెళ్ళు వేశాడు.

ప్రొ॥ రాంశర్మ కుడిచెయ్యి ఆరువ్రేళ్ళూ ముడుచు కున్నాయి—మానసిక వేదనకు చిహ్నంలాగా. □

నేరాల పెరుగుదల!

ప్రేమదేవత

వసుంధర



"కళ్ళు మూసుకో—దైవ ప్రార్థన చేసుకో" అన్నదామె.

అతడు దీనంగా ఆమెవంక చూశాడు. అతడు కూర్చుని వున్నాడు. చేతులు వెనక్కి విరిచి కట్టబడి వున్నాయి. అతడి నడుం స్థంభానికి కట్టబడి వుంది. ముందుకు జాపిన కాళ్ళు రెండూ దగ్గరగా కట్టబడి వున్నాయి.

అతడు అసహాయుడు.

"ప్లీజ్ నన్ను....చంపవద్దు" అన్నాడతను.

ఆమె చేతిలో కత్తి వుంది. అది యెనిమిదంగుళాల పొడవు వుంది. తళతళా మెరుస్తోంది. అయితే ఆమె కంటిచూపులు ఆ కత్తికంటే వాడిగా వున్నాయి.

అతడు భయంగా, దిగులుగా ఆలోచిస్తున్నాడు.

ఇలా జరుగుతుందని అతడనుకోలేదు. ఇంట్లో ఒంటరిగా వున్నాడు. ఆమె ఫోన్ చేసింది—వస్తానని!

రమ్మన్నాడు....

వచ్చింది.

శృంగారం నటించి బుట్టలో వేసుకుని ఈ స్థితికి తీసుకుని వచ్చింది. ఇప్పుడు తనేం చేయాలి?

"ఇంకా కళ్ళు మూసుకోలేదు నువ్వు...." అన్నదామె.

"భయం వేస్తోంది...." అన్నాడతను.

"నీకు భయమా? నిన్ను చూస్తూంటే నాకు భయం వేస్తోంది."

"ప్లీజ్—నన్ను వదిలిపెట్టు...." మళ్ళీ అన్నాడతను.

"నేను చెప్పేది ఒక్కటే మాట—కళ్ళు మూసుకో—దైవప్రార్థన చేసుకో!" అన్నదామె.

"నాకు వేరే దైవం లేదు. నువ్వే నా దైవానివి" అన్నాడతను.

"నిజంగా?" అన్నదామె నవ్వుతూ.

"అవును" అన్నాడతను.

"నువ్వు నీ దైవాన్ని ఏమి చేయాలనుకుంటున్నావో చెప్పు!" అన్నదామె ఇంకా నవ్వుతూ. ఆ నవ్వులో వెటకారం వుంది.

"ప్రతిరోజూ పూజ చేస్తాను" అన్నాడతను.

"ఒక్కసారి గుర్తు చేసుకో — ఇదివరకు గూడా ఇలాంటి మాటే అన్నావు" అన్నదామె అదేవిధంగా నవ్వుతూ.

అతను కళ్ళు మూసుకున్నాడు.

"దైవ ప్రార్థన చేసుకుంటున్నావా?" అన్నదామె.

"లేదు—గతాన్ని గుర్తుచేసుకుంటున్నాను...." అన్నాడతను.

"గుర్తుచేసుకో.... నువ్వేం గుర్తు చేసుకుంటున్నావో పైకి అను. తప్పు చెప్పావా—కత్తి సూటిగా గుండెల్లో దిగుతుంది" అన్నదామె.

* * * *

ఇద్దరూ బీచివద్ద కూర్చుని వున్నారు. అతను వున్నట్లుండి కనులు మూసుకున్నాడు.

"కంట్లో ఏమైనా పడిందా?" అన్నదామె కంగారుగా.

"నీ వంటికేమైనా అయిందా?" అన్నాడతను తాపీగా.

"నీ కంటికీ నా వంటికీ ఏమిటి సంబంధం?"

"నా కంటినిండా నీవే వున్నావు. నా కంట్లో ఏం పడినా నీ వంటికి ఏదో అవుతుంది. అలా ఏమీ కాలేదంటే నా కంట్లో ఏమీ పడలేదనే అర్థం" అన్నాడతను.

"అబ్బ—ఎంత తెలివిగా మాట్లాడతావు!" అన్నదామె.

"ఈ తెలివి నా స్వంతం కాదు" అన్నాడతను.

"ఎక్కణ్ణించైనా అద్దెకు తెచ్చుకున్నావా?"

"లేదు. నేను భక్తుణ్ణి...." అన్నాడతను.

"భక్తులకు తెలివితేటలుంటాయా?" అన్నదామె ఆశ్చర్యంగా.

"భక్తులకున్న తెలివితేటలవల్లనే కదా—ఉన్నాడో లేడో తెలియని దేవుడికి ఊరూపేరూ వస్తున్నాయి."

"అబ్బ—నీ మాటలు అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఇంతకూ నువ్వు కళ్ళెందుకు మూసుకున్నావో చెప్పు" అన్నదామె.

"పొరపాటున నీ ముఖంలోకి సూటిగా చూశారు. కళ్లు జిగేల్మన్నాయి...."

"మరీ అంతలా పొగడకు....నాకు సిగ్గేస్తోంది" అన్నదామె.

"పొగడ్డం నిజంగా నాకు చేతనై వుంటే ఈ పాటికి మా ఆఫీసులో నాకు చాలా ప్రమోషన్లు వచ్చి వుండేవి. నాకు నిజం తప్ప మరోటి చెప్పడం రాదు...." అన్నాడతను.

"పోనీ కాసేపు మాట్లాడ్డం మానేయ్...."

"మానేస్తాను—నన్ను పూజ చేసుకోనిస్తే...."

"పూజా?" అన్నదామె ఆశ్చర్యంగా.

"అవును నా పూజ చూద్దువుగాని—నా గదికి వస్తావా?"

"నీ గదికా—పెళ్ళి కాకుండా అక్కడికి రాను ..."

"అంటే నువ్వు నన్ను అనుమానిస్తున్నావు. అయితే ఇప్పుడే నేను యిక్కణ్ణించి వెళ్ళిపోతాను. ఎందుకంటే దేనికీ నిన్ను నేను తప్పు పట్టలేను. ఒక ఆడపిల్ల ప్రేమ మైకంలో పడిపోకుండా తన జాగ్రత్తలో తనుండాలను కోవడం సహజం. అందుకు నిన్ను నేను తప్పుపట్టలేను. కానీ నువ్వు నన్ను అనుమానించావంటే నా ప్రవర్తనలో ఏదో లోప మున్నదన్న మాట."

"అలాగనవద్దు నీ ప్రవర్తనను నేనూ తప్పుపట్టలేను."

"ఇవన్నీ ఉత్తుత్తి మాటలు. నిజంగా నువ్వు నన్ను నమ్మిన పక్షంలో నాతో నా గదికి వస్తావు—" అన్నాడతను.

ఆమె లేచి "పద!" అంది.

"నిజంగా నువ్వు ఒప్పుకున్నావా?" అన్నాడతను ఆశ్చర్యపోయి.

"పద!" అన్నదామె మళ్ళీ.

ఇద్దరూ అతడి గదికి వెళ్ళారు. అతడు గది తలుపులు వేశాడు.

ఆ గదిలో ఓ మంచం వున్నది. మంచంమీద ఎత్తైన పరుపు. తెల్లని దుప్పటీ....దుప్పటీపై మల్లెపూలు.

గదిలో మత్తైన పరిమళం.

ఆమెకు అనుమానం వచ్చింది. కానీ బయటపడలేదు.

"ఇంటిలో నా కెక్కడా దేవుడి పటం కనబడ్డంలేదు" అన్నదామె.

"నాకు దేవుడు లేదు....నువ్వే నా దేవతవు...." అన్నాడతను.

"అంటే?" అన్నదామె కంగారుగా.

"ఈ గది నా పూజామందిరం. ఈ మంచం నా ప్రేమ సింహాసనం. నిన్ని సింహాసనంపై అధిష్టింపజేసి నేను పూజ చేస్తాను."

"చివరికి నేననుకున్నట్లే చేశావు" అన్నదామె.

"ప్లీజ్ నన్ను అనుమానించకు. వెళ్ళి ఆ మంచంమీద కూర్చో!" అన్నాడతను.

"కూర్చుంటాను ....పడుకోను" అన్నదామె.

"నీ యిష్టం" అన్నాడతను.

"నీవు నా పక్కన కూర్చోకూడదు....నన్ను తాక కూడదు."

"ప్లీజ్....తాకవద్దని మాత్రం అనకు."

"ఎందుకని?"

"పూజకు నీ పాదాలు తాకవలసి వున్నది."

"ఛీ" సిగ్గుపడిందామె.

"ప్లీజ్ .... ఇది నా ముచ్చట.... కాదనకు...."

ఆమె వెళ్ళి మంచంమీద కూర్చుంది. అతడామె పాదాల చెంత చతికిలబడ్డాడు

"ఛీ—ఏమిటిది?"

"నీవు దేవతవు. నేను భక్తుణ్ణి. ఇది యింతే" అంటూ అతడు జేబులోంచి చిన్నపొట్లంతీసి అందులోని మల్లెపూలు ఆమె పాదాలమీద వేస్తూ - ప్రేమ దేవతాయై నమః అంటూ స్తోత్రం చదవసాగాడు.

కొద్దిక్షణాలు ఆమె సహించింది. తర్వాత "ఏమటిది?" అంటూ లేచి నిలబడింది.

అతడామె పాదాలు గట్టిగా పట్టుకుని "నా దేవతకు ఆగ్రహం వచ్చింది. పూజ మధ్యలో లేచిపోయింది" అన్నాడు దిగులుగా.

"లేదు—నాకీ పూజ చాలు."

"నిజంగానా?"

"నా పూజ నీకు తృప్తి కలిగించిందా?"

"ఊఁ"

"మరి నీ భక్తుడికి వర మేమిస్తావు?"

"వరం దేవత చెప్పదు. భక్తుడు అడగాలి."

"అడిగితే దేవత ఇస్తుందా?"

అతడు లేచి నిలబడ్డాడు. ఆమె వంక సూటిగా చూసి కనులు మూసుకుని "నేను అడగలేను" అన్నాడు.

"అయితే నేను వెళ్ళిపోతాను" అన్నదామె.

"నువ్వు వెళ్ళిపోతే నేను చచ్చిపోతాను."

ఆమె అతడివంక చూసింది—"పెళ్ళి కాకుండా తప్పు కదూ?" అన్నది.

"పెళ్ళి సమాజం కోసం. అది ఈ రోజు కాకుంటే రేపైనా జరుగుతుంది. కానీ అంతవరకూ నేను బ్రతికి వుండగలనా?"

"నువ్వు బ్రతికి వుండాలి—"

"అయితే నీకు ఇష్టమేనా?"

ఆమె తల వంచుకుంది. అతడామెను దగ్గరగా తీసుకున్నాడు....

* * *

"నువ్వు చచ్చిపోతావేమోనని ఆ రోజు నీకు లొంగిపోయాను. కానీ ఈ రోజు నిన్ను లొంగదీసి మరీ చంపుతున్నాను. ఓడలు బండ్లు ...బండ్లు ఓడలు అంటారు. ఇదే కాబోలు" అన్నదామె కఠినంగా.

"నన్ను చంపవద్దు—"

"నిన్ను చంపకపోతే ఎలా?"

"నన్ను చంపడం వల్ల నీకు లాభమేమిటి?"

"నాకు కాదు ఆడపిల్లలకు లాభం. నీలాంటి మోసగాళ్ళు బ్రతికివుండకూడదు" అన్నదామె.

"నేను నా తప్పులన్నీ ఒప్పుకుంటాను. నువ్వెలా చెబితే అలా వింటాను నన్ను వదిలిపెట్టు."

"అయితే నన్ను పెళ్ళి చేసుకుంటావా?"

"చేసుకుంటాను."

"మరి నీ భార్యనేం చేస్తావ్?"

"నువ్వేం చెబితే అది చేస్తాను"

"నీ భార్యకు చంపమని విషం ఇస్తాను. అదామెకిస్తావా?"

"ఇస్తాను—"

"అందుకే నిన్ను చంపాలనుకుంటున్నాను. నీ అవసరం

తీరడంకోసం నువ్వేమైనా చేస్తావు. నువ్వు నీచుడివి. దుర్మార్గుడివి. అల్పుడివి తుచ్ఛుడివి."

"నువ్వు నన్ను ఎన్నైనా తిట్టు. చంపవద్దు."

ఆమె వికటంగా నవ్వింది—"కానీ నిన్ను చంపుతాను నేను—"

"ఎందుకని?"

"ఆ ప్రశ్న నీవే వేసుకో!"

అతను కళ్ళు మూసుకున్నాడు.

"దైవ ప్రార్థన చేసుకుంటున్నావా?"

"లేదు—నన్ను నేను ప్రశ్నించుకుంటున్నాను...."

"నీ ప్రశ్నలూ. సమాధానాలూ నాకు వినబడేలా పైకి చెప్పు—వాటిలో నాకు తేడా కనిపించిందా కత్తి సూటిగా నీ గుండెల్లోకి దిగుతుంది" అన్నదామె.

* * *

"మన పెళ్ళెప్పుడో చెప్పడంలేదు నువ్వు" అన్నదామె.

"మన పెళ్ళి అయిపోయింది" అన్నాడతను.

"ఎప్పుడు?"

"చెప్పనా?"

అతడు చెప్పాడు. ఆమె సిగ్గుపడింది.

"చాలా అందంగా సిగ్గుపడతావు నువ్వు...."

"నాకు పొగడ్తలు వద్దు. పెళ్ళి కావాలి."

"మన పెళ్ళి అయిపోయిందని చెప్పాను నీకు."

"మన పెళ్ళి కాలేదు."

"అయింది."

"అయితే మీ యింటికి వెడదాం నాకు అత్తమామల ఆశీర్వచనాలు కావాలి" అన్నదామె.

"నాకు ఎవ్వరూ లేరు. ఇదే నా యిల్లు."

"అయితే ఈ రోజు నించీ నే నిక్కడే వుండిపోతాను."

"పెళ్ళి కాగానే ఈ గది ఖాళీ చేయాలని ఇంటాయన షరతు పెట్టాడు."

"పోనీ—నువ్వు మా ఇంటి కొచ్చేయి...."

"అలాగే—కానీ రేపు మంచిది కాదు."

"నీకు తిథి వార నక్షత్రాలు కూడా తెలుసా?"

"అన్నీ తెలియవు. నా లక్కీ డే ఇరవై రెండు. ఈవేళ పన్నెండో తారీఖు. సరిగ్గా పదిరోజుల అనంతరం నేను మీ యింటికి వచ్చేస్తాను" అన్నాడతను.

"కానీ నా లక్కీ డే పన్నెండు ..."

"మన పెళ్ళయ్యాక నా లక్కీడేయే నీ లక్కీడే...."

"అదిసరే—ఈ పదిరోజుల్లోనూ నీ భార్యనేం చేస్తావ్?" అన్నదామె.

"నా భార్య ఎవరు? నువ్వే కదా?"

"ఈ యింట్లో మనకు పెళ్ళయింది. కానీ నీకు ఇంకో యిల్లుందనీ - అందులో నీకో భార్య వుందనీ—మీ ఇద్దర్నీ నీ తలిదండ్రు లాశీర్వదించారనీ నాకు ఈ రోజు ఉదయమే తెలిసింది" అన్నదామె.

అతడు ఒక్కక్షణం తడబడి "అయితే అన్నీ నీకు తెలిసిపోయాయన్న మాట. ఇక దాచి లాభంలేదు—మనం జరిగింది మర్చిపోయి—స్నేహితుల్లా విడిపోదాం—" అన్నాడు.

"మరి నాకు రోజూ పూజ చేయాలి కదా—ఎలాగ?"

"వరాలవసరమైనప్పుడే పూజలు. నా కింక నీ నుంచి ఏ వరాలూ అవసరం లేదు" అన్నాడతను.

ఆమె అతడి కాలరు పట్టుకుని "నన్నెందుకిలా మోసం

చేశావు చెప్పు!" అన్నది ఆవేశంగా.

"అనవసరంగా ఆవేశపడకు. మగవాడి బుద్ధి చంచలం. అది కొత్త రుచులు కోరుతుంది. ఆడదాని వయసు పెద్దది. అది మగవాడికి లొంగుతుంది. మగవాడి బుద్ధికి ఆడదాని వయసు జతపడితే అదొక అందమైన అనుభవం. నిన్ననుభవించడంకోసం నేను ప్రేమను నటించాను. నీ వయసు అల్లరి చేస్తూంటే నువ్వు నన్ను నమ్మినట్లు నటించావు. నేను నిన్ను మోసం చేస్తున్నానని నాకు తెలుసు. మోసపోతున్నట్లు నీకూ తెలుసు. ఇద్దరం సరదాపడ్డాం. ఇంత కాలం నీ సహకారానికి నా ధన్యవాదాలు. భర్తగా కాకుండా మగవాడిగా నా అవసరం వుందనిపిస్తే భవిష్యత్తులో కూడా నీకు నేను తప్పక సహకరిస్తాను" అన్నాడతను.

"ఇప్పుడు నేను నీ యింటికి వెడతాను. నీ కథంతా చెబుతాను."

"ప్రస్తుతానికి నా భార్య ఊళ్ళో లేదు."

"ఆమె ఎక్కడుందో అక్కడికే వెడతాను."

"నీకో అక్కా, చెల్లి వున్నారు. నా కథ బయటపెడితే నా కంటే నీ వాళ్ళే ఎక్కువ నష్టపోతారు. అందులోనూ నీ అక్క పెళ్ళై కాపురం కూడా చేసుకుంటోంది."

"నీ లాంటి వాడికి బుద్ధి చెప్పడంకోసం నేను బంధుత్వాలనీ మమకారాలనీ మరిచిపోదలచాను."

"సరే-ఎందుకైనా మంచిది. నాలుగు రోజులు ఆగు" అన్నాడతను.

* * *

"నాలుగు రోజులు అవకాశ మిచ్చేసరికి నువ్వు పెట్రేగిపోయావు. నాకు బాగా గుర్తుంది. ఒక ఉత్తరం తీసుకుని వెళ్ళావు నువ్వు. నా అక్క, బావ సినిమా దగ్గరుండగా

నా అక్కారు నమస్కరించావు. ఆమెకో ఉత్తరం ఇచ్చి— దయుంచి నాకిలాంటి ఉత్తరాలు వ్రాయకండి. నేనలాంటి వాణ్ణికాను— అని వెళ్ళిపోయావు. ఆ ఉత్తరం ఒక ప్రేమ లేఖ

బావ అక్కను అనుమానించాడు. అక్క కాపురంలో కలతలు రేగాయి. ఈలోగా నేను నీ భార్యను కలుసుకున్నాను. అందరు భార్యల్లాగే ఆమె నన్ను తిట్టింది. నువ్వు అపర శ్రీరామచంద్రుడి వంది.

ఈలోగా నువ్వు నా చెల్లెలు వ్రాసినట్లు ఓ రౌడీ వెధవకి ప్రేమలేఖ వ్రాసి అడ్రసు కూడా ఇచ్చావు. ఇంట్లో ఎవరూ లేని స యంలో వాడొచ్చి అత్యాచారం చేయబోయాడు. నలుగురూ వచ్చి వాణ్ణి తన్నబోయారు. వాడు నువ్వు వ్రాసిన ఉత్తరం చూపించి తన తప్పేమీ లేదన్నాడు. ఇంట్లో ఆ సమయంలో తనొక్కర్తే వుంటుందని వ్రాసిన వివరాలు ఆ రౌడీ వెధవకు తెలిసే అవకాశంలేదు. అందుకని అందరూ నా చెల్లెల్ని తప్పుపట్టారు. అక్క, నేను, చెల్లి — అందరూ చెడ్డపేరు తెచ్చుకున్నాం — నువ్వు మాత్రం అనుకున్నది సాధించావు....అవునా?" అన్నదామె.

"ఇప్పుడాలోచిస్తూంటే అనిపిస్తున్నది. నేను వర్ణనకు అందనంత దుర్మార్గుడిని. నీ కారణంగా నా కళ్ళు తెరుచుకున్నాయి. నా తప్పులన్నీ సరిదిద్దుకుంటాను. నీ పేరు చెప్పుకుంటాను. నన్ను వదిలిపెట్టు."

"నిన్ను ఎలా వదులాను?" అన్నదామె. "నీ కారణంగా నా అక్క ఆత్మహత్య చేసుకుంది. ఆమెను ప్రాణాలతో తిరిగి రప్పించగలవా? నా చెల్లెకి పెళ్ళికావడంలేదు. ఆమెకు వరుణ్ణి తేగలవా?"

"నేను తప్పు చేశాను. నీకు తెలుసు. తప్పు చేసిన వాళ్ళకు సరిదిద్దుకునే అవకాశమిస్తే వాళ్ళు వాల్మీకి అంతటి గొప్పవారౌతారు. నావల్లనే ప్రపంచానికి ఎక్కువ ప్రయోజనం వుంటుంది. ప్లీజ్ నన్ను వదిలిపెట్టు."

"నీలో మార్పు వచ్చిందని నాకెలా తెలుస్తుంది?"

"ఇప్పుడు నువ్వు నన్ను వదిలిపెట్టు. నాకో అవకాశమివ్వు."

"ఆల్‌రైట్" అన్నదామె. అప్పుడామె తన చేతిలో వున్న కత్తిని తీసుకుని అలమారలో వుంచింది. అతణ్ణి సమీపించి కట్లు విప్పింది.

"చాలా థాంక్స్—నీకు అంత మంచిదాన్ని నేనెక్కడా చూడలేదు"

"నీలో మార్పు వచ్చిందని నాకెలా తెలియబరుస్తావు?" అన్నదామె.

"నువ్వు నన్ను బంధించావు. చంపబోయావు. అయినా నా మనసు నిన్ను కోరుతున్నది. ఎందుకంటే నువ్వు నా దేవతవు. నేను నీ భక్తుణ్ణి" అన్నాడతను.

"మరి దేవతను ఎందుకు మోసం చేశావు?"

అతను మాట్లాడలేదు.

"చెప్పు నీకు ఎటువంటి శిక్ష విధించాలి."

"అంతా నీ యిష్టం" అన్నాడతను.

"అయితే అలమారలోని కత్తి తీసుకునిరా" అన్నదామె.

"ఎందుకు?"

"నీ చిటికెన వ్రేలు తెగ్గొడతాను. అదే నీకు శిక్ష...."

అతను వెళ్ళి కత్తి తెచ్చి ఆమె ముందుంచాడు. ఆమె ఆశ్చర్యంగా "నేను అనుకున్నదొకటి అయినది ఒక్కటి" అన్నది.

"నువ్వేమనుకున్నావు?"

"కత్తి తీసుకుని నా మీద తిరగబడతావనుకున్నాను."

"అప్పుడు?"

"నేను చచ్చిపోతాను. నాకెలాగూ జీవితం మీద వాంఛ లేదు. నీ యింట్లో నా చావు—పదిమందీ నిన్ను హంతకు డనడం జరుగుతుంది—అదో తృప్తి నాకు."

"నువ్వే నన్ను చంపవచ్చు గదా."

"చూస్తూ చూస్తూ ఓ ఆడది తన ప్రియుణ్ణి చంపలేదు."

"నాకు తెలుసు-నువ్వు నన్ను చంపలేవని!" అన్నాడతను.

"ఇంకా ఏం తెలుసు నీకు?"

"నీకు జీవితం మీద వాంఛ లేకపోయినా నాకు నీ మీద వాంఛ వున్నది. అందుకు నీ అంగీకారం లభిస్తుందని కూడా నాకు తెలుసు" అన్నా డతను.

"ఎంత ధైర్యం నీకు!"

"ధైర్యం కాదు—నమ్మకం. నెల రోజుల పరిచయంలో నీ ఔన్నత్యం అర్థం చేసుకున్నాను. నీ వంటి ఉత్తము రాలిని మోసం చేస్తున్నందుకు బాధ కలిగింది. నా అసహా యతకు కోపం వచ్చేది. నీ వంటి ఉత్తమురాలిని భార్యగా పొందకపోవడం నా దురదృష్ట మనిపించింది. ప్లీజ్.... ఇప్పుడు ...నువ్వు నన్ను కాదనకు"

ఆమె మాట్లాడలేదు.

"నన్ను చంపాలని కత్తి తెచ్చావు. ఆ కత్తి నా చేతి లోకి వస్తే అది నేను నీ పాదాల ముందే వుంచాను. నిన్నింతగా నమ్మిన నన్ను ....ప్లీజ్ ....కాదనకు ...."

"నువ్వు చాలా తెలివైనవాడివి" అన్నదామె.

"నా తెలివి నాది కాదు. నేను నీ భక్తుణ్ణి."

"నీ తెలివి ప్రమాదకరమైనది" అన్నదామె.

"ఏం?"

"నీ భార్యపోయి ఇంకా మూడు వారాలు దాటలేదు. అప్పుడే నీ మనసు పరస్త్రీ సాంగత్యాన్ని కోరుతున్నదా?"

"ఆ తప్పు నాదికాదు. ప్రేమది!"

"కట్టుకున్న భార్యను ప్రేమించలేనివాడివి— నువ్వు నన్ను ప్రేమిస్తావా?"

"నేను కట్టుకున్న భార్యను ప్రేమించలేదు. నిన్నే ప్రేమించాను."

"అబద్ధం—"

"అందుకు ఋజువుంది."

"ఏమిటది?"

"చెబితే నువ్వు నమ్మవు."

"చెప్పకపోతే నువ్వు చస్తావు" అంటూ ఆమె మళ్ళీ కత్తి తనచేతిలోకి తీసుకుంది.

"నువ్వు చంపుతావన్న భయంతో కాదు. నాకు నీ మీద ఎంత ప్రేమ వున్నదో ఋజువు చేయడం కోసం నేను నీకు చెబుతాను."

"చెప్పు" అన్నదాను.

"నా భార్య చచ్చిపోలేదు. నేనే ఆమెను చంపేశాను."

ఆమె తెల్లబోయింది

"నీ కోసం-కేవలం నీకోసం-ఆమెను నేనేచంపేశాను."

"నా కోసమా?"

"అవును—నాకు నువ్వు కావాలి. నువ్వు లేనిదే బ్రతకలేననిపించింది. కానీ అప్పటికే నాకు పెళ్ళయిపోయింది. మన పెళ్ళికి అంగీకరించమని నా భార్యను వేడుకున్నాను. విషం తాగి చావనైనా చస్తాను కానీ మన పెళ్ళికి అంగీకరించనందామె. ఎలాగూ చస్తానంది కదా అని— నేనే విష

మిచ్చి ఆమెను చంపేశాను."

"మరి నిన్ను ఎవరూ అనుమానించరూ?"

"భర్త భార్యను చంపితే అనుమానించడమా?" అని నవ్వాడతను.

"అయితే పెళ్ళి చేసుకుని నన్నూ చంపుదామనుకుంటున్నావా?"

"నిన్ను నేను చంపుతానా? నువ్వు దేవతవు, నేను భక్తుణ్ణి."

"నన్ను చంపకపోతే శ్యామలని యెలా పెళ్ళి చేసుకుంటావు?" అన్నదామె.

"శ్యామల ఎవరు?" అన్నాడతను కంగారుగా.

"శ్యామల ఎవరో నీకు తెలుసునని నాకు తెలుసు."

"నువ్వు చాలా విచిత్రంగా మాట్లాడుతున్నావు. కొత్త కొత్త విశేషాలు చెబుతున్నావు. శ్యామల యెవరో నాకు తెలియదు."

"శ్యామల పేరిట రెండు లక్షల రూపాయల ఆస్తి ఉంది. ఆమె వయస్సు ఇరవై రెండేళ్ళు. ఆమెకు భర్త పోయి మూడేళ్ళయింది. ఆమెను నువ్వు వలలో వేసుకున్నావు. ప్రేమించానని చెప్పావు. నీ భార్య జబ్బుమనిషనీ, త్వరలోనే చచ్చిపోతుందనీ ఆమెతో అన్నావు. నీ భార్య చావగానే శ్యామలని పెళ్ళిచేసుకుంటానని చెప్పావు."

"అభూత కల్పన. ఏ ఆడదయినా అలా ఒప్పుకుంటుందా? భార్యను చంపి నిన్ను పెళ్ళి చేసుకుంటానంటే" అని ఏదో చెప్పబోయి ఆగిపోయాడతను.

"ఏమో! అలాగేచెప్పి నన్ను ఒప్పించాలనుకున్నావు."

"అవును. వ్యవహారం పీకెల మీదకు వచ్చింది కాబట్టి అలా చెప్పాను. నిన్ను నమ్మించడానికి నిజం తప్ప వేరే

మార్గం లేకపోయింది."

"పాపం వెర్రి శ్యామల నీ భార్య నిజంగా రోగిష్టిదనీ, చరమకాలంలో ముత్తయిదువగా చనిపోవాలన్న ఆమె కోరిక ను తీర్చడం కోసం ఆమె మెడలో తాళికట్టావని నువ్వు చెప్పిన అబద్ధాలన్నీ నమ్మింది. నేను నిజం చెబితే తెల్లబోయింది."

"శ్యామలకు నువ్వు అన్నీ చెప్పేశావా?" అన్నాడతను.

"శ్యామల ఎవరు - నీకు తెలియదేమో!" వెటకారంగా అన్నదామె.

"నువ్వు....నువ్వు...." అంతకు మించి మాటలు రాలేదతడికి.

"భద్రకాళిని" అన్నదామె.

"అయితే నన్ను చంపేయ్. నీ చేతుల్లో చనిపోవడం నాకు ఆనందం" అన్నాడతను.

"అసలు నేను ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను. కానీ చేసుకోలేదు. ఎందుకో తెలుసా?"

"తెలియదు."

"నీకు ఆనందం కలుగుతుందేమోనని!" అన్నదామె. నీకు ఆనందం కలగకుండా వుండడం కోసం నేను నా ఆనందాన్ని కూడా త్యాగం చేయగలను."

"అంటే?"

"నేను నిన్ను చంపను."

"అదీ నాకు ఆనందమే అయితే?"

"బ్రతికుండడం నీకు ఏ మాత్రమూ ఆనందం కలిగించని పరిస్థితి కలిగిస్తాను."

అతను భయంగా ఆమె వంక చూపి "నువ్వు నన్ను ప్రేమించలేవా?" అన్నాడు.

"నేను నిన్ను ప్రేమించగలనని ఎందుకనుకుంటున్నావు?"

"ఆడది ఒకసారి ప్రేమిస్తే తన కెంత అన్యాయం జరిగినా సరే ప్రేమను వదులుకోలేదంటారు" అన్నాడతను.

"ఆడదాని గురించి నీకు తెలిసిన నిర్వచనమే అదైతే నేను ఆడదాన్ని కాదు" అన్నదామె.

"ఒక్క నిముషం ఆగు" అని అతడు లోపలకు వెళ్ళి కొద్ది క్షణాల్లో చేతిలో మంగళసూత్రాలతో వచ్చి "ఇప్పుడు నీ మెడలో తాళి కడతాను" అన్నాడు.

"ఒక్క నిముషం" అన్నదామె.

"ఎందుకు?"

"నీ నిర్వచనం ప్రకారం నన్ను ఆడదిగా మార్చడం కోసం నువ్వు నాకు తాళి కట్టాలనుకుంటున్నావు. అంతకు ముందు నీ కో విషయం చెప్పాలి!" అన్నదామె.

"ఏమిటది?"

"నీ భార్య కో అన్న ఉన్నాడు తెలుసా?"

"తెలుసు."

"నీ భార్య ఆత్మహత్యచేసుకుని చనిపోయిందని అతను నాకు చెప్పాడు. నీలాంటివాడ్ని కట్టుకున్న ఆడదానికి అదే గతి అని నేను అన్నాను. అతని కా విషయం తెలియదు. నీ భార్య చనిపోతూ అతనికి ఓ చీటీ వ్రాసిందట. అందులో తన చావుకు కారణం నేనని వ్రాసిందట. అతను నన్ను చంపాలని వచ్చాడు. నేను అతడికి నీ నిజస్వరూపం వెల్లడి చేశాను. మొత్తానికి నీ భార్య పతివ్రత అనిపించుకుంది."

"నీ మాటలు ఎవరూ నమ్మరు" అన్నాడతను.

"ఆ సంగతి నాకూ తెలుసు. అందుకే నిజం నీచేత చెప్పించాను."

"అంటే?"

"నేను ఇంట్లో ప్రవేశించినపుడు వీధి తలుపులు దగ్గరగా మాత్రం వేశాను."

"అంటే?"

"అతను ఇంట్లోనే ఉన్నాడు. మన సంభాషణ అంతా విన్నాడు."

"అబద్ధం" అంటూ అరిచా డతను.

"కాదు, నిజమే!" అంటూ అక్కడికో యువకుడు ప్రవేశించాడు.

"బావా!" అన్నాడతను ఆశ్చర్యంగా.

"అవును. అన్నీ విన్నాను నేను."

"జరిగిందంతా నువ్వు నమ్ముతున్నావా?"

అతడి బావ చటుక్కున ఆమె చేతిలోంచి కత్తి లాక్కుని "నేనిప్పుడు నీ ప్రాణాలు తీస్తానంటే నమ్ముతావా?" అన్నాడు.

"నమ్మను" అన్నాడతను.

"ఎందుకని?"

"నాకు మానవత్వం మీద నమ్మకముంది."

"మానవత్వం అంటే ఏమిటి?"

అతను నవ్వి "స్త్రీకి పతిభిక్ష పెట్టడం" అన్నాడు.

"ఏ స్త్రీకి?"

క్షణాల మీద అతను తన చేతిలోని తాళిబొట్టును ఆమె మెడలో వేసి "ఈ స్త్రీకి!" అన్నాడు.

అతడి బావ, ఆమె ఊహించని ఈ పరిణామానికి తెల్లబోయారు.

"ఏమిటిది?" అన్నాడతడి బావ.

"మా పెళ్ళికి నువ్వే సాక్షివి" అన్నా డతను.

అతడి బావ, ఆమె వైపు తిరిగి "అయితే ఇప్పుడు

నువ్వు పతిభిక్ష పెట్టమంటావా?" అన్నాడు.

"అసలు నే నా విషయమే ఆలోచించడం లేదు" అన్నదామె.

"ఎందుకని?"

"నేను శ్యామల విషయం ఆలోచిస్తున్నాను. నేను చచ్చేక కదా ఆమెకు వివాహ మయ్యేది!" అన్నదామె.

అతడి బావలో ఆవేశం పెల్లుబికింది. "వీడు నరరూప రాక్షసుడు. వీడ్ని బ్రతకనివ్వ కూడదు" అన్నాడు ఆవేశంగా.

"పతిభిక్ష అడగడానికి బదులు నా బావ నింకా రెచ్చగొడుతున్నావు! ఇది ఉత్తమ ఇల్లాలి లక్షణం కాదు" అన్నాడతను.

ఆమెకు ఆవేశం కలిగింది. అతడి బావ చేతిలో కత్తి వుంది. అయినా అతడికి ఎంత ధైర్యం! సెంటిమెంట్లతో ప్రపంచాన్నే జయించగలనని అతడి నమ్మకం. ఈ నమ్మకము చాలా ప్రమాదకరమైనది. ఈ నమ్మకంతో అతడు ఆడపిల్లల్ని వల్లో వేసుకుంటున్నాడు. సమాజంలో పెద్ద మనిషిననే భావిస్తున్నాడు.

"నువ్వు పతివనీ అంగీకరిస్తున్నాను. పతివ్రతాధర్మాన్నీ పాటిస్తున్నాను" అన్నదామె.

"నువ్వు పతిభిక్ష అడుగుతావా?" అన్నాడతడి బావ ఆశ్చర్యంగా.

"లేదు" అన్నదామె. "ఇతడు నా మెడలో మంగళ సూత్రాలు వేశాడు. పతివ్రతా ధర్మాన్ని పాటించి యితడు పోయినప్పుడే వాటిని మెడలోంచి తీస్తాను."

"అవి నీకు కొంత కాలం పాటు వుంచుకోవాలని వున్నదా?"

అతడు, అతడి బావ ఆమె వంక జవాబు కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

"నా మెడలో సర్పహారం కదలాడుతున్న భ్రాంతి కలుగుతున్నది. ఏ క్షణంలోనైనా నా ప్రాణాలు పోవచ్చునన్న భీతి నాలో రేగుతున్నది" అన్నదామె.

"ఇదా నీ పతివ్రతా ధర్మం" అన్నాడతను కోపంగా.

"నువ్వింక మాట్లాడకు" అన్నాడతడి బావ.

అతడి బావ ఆదేశంపై ఆమె అతడిని తిరిగి తాళ్ళతో బంధించింది.

"కళ్ళు మూసుకో, దైవప్రార్థన చేసుకో!" అన్నాడతను.

—ఇది చదివి ఎవరయినా కథ మొదటికి వచ్చిందనుకుంటే పొరబడ్డారనే అనాలి. ఎందుకంటే కథ యిక్కడే ముగిసిపోయింది. □

నేరం చేయరాదు!



హాబి

జి. ఉషావిఠల్



"నాకో యాభై రూపాయలు కావాలి" అంటూ పంకజం చనువుగా నా జేబులో చెయ్యి పెట్టబోయింది.

ఒక చేత్తో జేబుని గట్టిగా పట్టుకుని, మరోచేత్తో ఆమె చేతిని తోసేస్తూ, "మొన్ననేగా పండుగ అంటూ వంద రూపాయలు పట్టుకుపోయావు! మళ్ళీ యేమొచ్చింది?" అన్నాను.

"ఈ ఆరాలన్నీ యేమిటి రాజా? యాభై రూపాయలు యివ్వమంటుంటే!" గోముగా అంటూ నా మెడ చుట్టూ

చేతులు వేసి నాకు హత్తుకుపోతూ, తన పెద్ద కళ్ళెత్తి నా వైపు మత్తుగా చూసింది.

డబ్బులు కావల్సి వచ్చినప్పుడంతా ఆమె వుపయోగించే మొదటి అస్త్రం అది! ఇప్పుడిప్పుడే అన్నీ అర్థం చేసుకోగలుగుతున్న నేను, ఆ చేతుల్ని చిరాగ్గా వదిలించుకుంటూ,

"చూడు పంకజం! నువ్వు యిలా వేళాపాళా లేకుండా నా గదికి వస్తూ వుండటం మంచిది కాదు. ఎవరన్నా చూస్తే బాగుండదు" అన్నాను.

పంకజం దెబ్బతిన్నట్టు నా వైపు చూసింది.

"ఏమిటివాళ కొత్తగా మాట్లాడుతున్నావు? నేను యిలా నీ గదికి రావడం యిది మొదటిసారి కాదుగా?" అంది.

"మొదటిసారి కాదులే. కాని యిదే ఆఖరుసారి అవనీ! నాకు పెళ్ళి నిశ్చయం అయింది. ఇకనించీ అమ్మాయి తాలూకు వాళ్ళు వస్తూపోతూ వుంటారు. వాళ్ళకి మన సంగతి తెలియాల్సిన అవసరం లేదు" అన్నాను నిర్మోహమాటంగా.

రెండు రోజుల్నించీ యెలా యీ విషయం పంకజంతో కదపడమా అని ఆలోచిస్తున్నాను. మనసులో సుళ్ళు తిరుగుతున్న మాట అనుకోకుండా బయటపడిపోయింది. ఆ మాట విన్న పంకజం చప్పున ఒక అడుగు వెనక్కివేసి, నావైపు నమ్మలేనట్టు చూస్తూ,

"ఏమిటీ? నీకు పెళ్ళా? నువ్వు...నువ్వు పెళ్ళి చేసుకుంటున్నావా?" అంది.

"ఏం? నేను పెళ్ళి చేసుకోకూడదా?" అన్నాను.

"మరి.... మరి ... మన స్నేహం?" పాలిపోయిన మొహంతో అడుగుతున్న పంకజాన్ని చూస్తే క్షణంసేపు జాలివేసిన మాట నిజమే. కాని ఆమె యెత్తులు, నాటకాలు

అలవాటుపడి వున్న నేను, కరగబోతున్న మనసుని అదుపులో పెట్టుకుంటూ,

"మన స్నేహానికి ఫుల్‌స్టాప్ పెడ్దేద్దాం. మన స్నేహం నీ భర్తకి అభ్యంతరం లేకపోయినా, నా భార్యకి అభ్యంతరం అవచ్చు" అన్నాను. ఆ మాటకి పంకజం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"రాజా! నువ్వేనా యీ మాట అంటున్నదీ? నేను లేకుండా నువ్వు బ్రతగ్గలవేమోగాని, నువ్వు లేకుండా నేను క్షణంగూడా వుండలేను" ఆ మాట అంటూ ముందుకి వచ్చి నా ఛాతీమీద తల ఆనించబోయిన పంకజాన్ని చేత్తో ఆపుతూ,

"ఇవే మాటలు, నాకంటే ముందు యీ గదిలో అద్దెకున్న రమేష్‌తో అన్నావని నాకు తెలుసు పంకజం. నాకు షిఫ్ట్ మారింది. ఫేక్టరీకి టైమవుతోంది. వెళ్ళాలి" అన్నాను కఠినంగా.

పంకజం దెబ్బతిన్న నాగినిలా నా వైపు చూస్తూ మౌనంగా గుమ్మం దాటింది ఆమె అంత తొందరగా వదులుతుందని నేను అనుకోలేదు. చీకట్లోకి రాయి విసిరాను. అది సరిగ్గా తగలాల్సిన చోటే తగిలినట్టుంది. మారు మాట్లాడ లేకపోయింది.

నాకు ముందు యీ గదిలో అద్దెకున్న కుర్రాడి పేరు రమేష్ అని పంకజమే ఒకసారి నాతో చెప్పింది. పంకజానికి, అతనికి సంబంధం వుండేదో లేదో నాకు తెలీదు. కాని పంకజం స్వభావాన్ని బట్టి చూస్తే వుండే వుంటుందనిపిస్తుంది. పోన్లే! ఇంక అది యెలా యేడిస్తే నాకేం? అదేం కట్టుకున్న పెళ్ళాం కాదుగా?

తేలికపడ్డ మనసుతో గబగబా తయారై, గదికి తాళం

పెట్టి వీధిన పడ్డాను. మళ్ళీ సెకండ్ షిఫ్ట్ మొదలైంది నాకు. వెధవ ఫేక్టరీ. వెధవ షిఫ్టు! ఒక షిఫ్టుకి అలవాటు పడేసరికి అది మారిపోతుంది ఒక వేళాపాళా లేని యీ వుద్యోగం వల్లే నేను యిన్నాళ్ళూ నా పెళ్ళి వాయిదా వేస్తూ వచ్చాను. పంకజం పరిచయంతో అసలు పెళ్ళి చేసుకోవా ల్సిన అవసరమే నాకు కనిపించలేదు.

ఈ వీధిలో, యీ గదికి రాకముందు. నాకు పంకజం యెవరో తెలీదు. ముందున్న గది ఫేక్టరీకి చాలా దూరం అవడం, పైగా అర్ధరాత్రి. అపరాత్రి వచ్చే నా రాక యింటి వాళ్ళకి యిబ్బంది కలిగించటంతో నే నా గది మూడేళ్ళ క్రితం ఖాళీ చెయ్యక తప్పలేదు.

అప్పట్లో ఒక బ్రోకరుద్వారా నాకు పంకజం వాళ్ళ వీధి గది అద్దెకి దొరికింది. గదికంటేగూడా యింటి యజ మానురాలైన పంకజం అందమే నన్ను యెక్కువగా ఆకర్షించిన మాట నిజమే గాని, ఆవిడ భర్త రాఘవుల్ని, రౌడీగా ఆ వీధిలో ఆతగాడికున్న పేరు ప్రఖ్యాతుల్ని చూసి కొంతకాలంపాటు నా చాపల్యాన్ని నాలోనే అణచుకోక తప్పలేదు.

మొదట్లో రాఘవులికి భయపడి పంకజాన్ని తలెత్తి గూడా చూసే వాడిని కాదు. పంకజమే పదే, పదే కలి పించుకొని నాతో మాట్లాడుతూ వుండేది. రాఘవులు కళ్ళె దురుగానే నాతో సరసాలాడుతూ. మాటలతో. చూపులతో నన్ను రెచ్చగొడుతూ వుండేది. రెండ్రోజులకోసారి పండ గనో, పబ్బమనో, తన పుట్టినరోజనో. లేకపోతే యెవరో వచ్చిన రోజనో వంకపెట్టి నన్ను భోజనానికి పిలుస్తూ వుండేది

ఆమెతో నా పరిచయం యెక్కువయే కొద్దీ, ఆ ఇంట్లో

రాఘవులి స్థానమేమిటో నాకు అర్థం కాసాగింది. రాఘవులు కేవలం ఆమెకీ. ఆమె యవ్వనానికీ కాపలాదారు మాత్రమే. ఆమెమీద అతడికి యెలాంటి హక్కుగాని, అధికారంగాని లేవు. ఈ సత్యం అర్థం చేసుకున్న నేను, చెప్పొద్దూ! విజృంభించేశాను.

రాఘవులు కళ్ళెదురుగానే నేను పంకజం కొంగుపట్టి, నా గదిలోకి లాక్కుని తలుపేసుకున్నా. అతడు పన్నెత్తి అదేమని? అడిగేవాడు కాదు. సమాజం కోసం భర్తగా నటిస్తున్న అతడికి రెండు పూటలా మంచి భోజనం, సాయంత్రము అయేసరికి ఓ సీసాడు నాటుసారా, అప్పుడప్పుడు పంకజం పొందూ జీతంగా ముట్టేవి.

పంకజం కౌగిట్లో నేను కరిగిపోతూ వుంటే. నా జీతం, బోనసు మొదలైనవి పంకజం చేతుల్లో కరిగిపోసాగేయి ఆమె యెంత బాగా నన్ను చూసుకునేదంటే పొరపాటున గూడా పెళ్ళిని గురించిన ఆలోచన నా దగ్గరికి చేరనిచ్చేది కాదు. అలా యెన్ని వేలు నేను పంకజం షోకులకి, సరదాలకి, బుడి బుడి రాగాలకి కరిగిపోయి, వళ్ళు తెలియకుండా తగలేశానో అప్పట్లో నాకు తెలియలేదు. మూడేళ్ళదాకా, అంటే మొన్న మొన్న సుజాతని చూసేవాకా నాకు పంకజం మత్తు వదల్లేదు.

పంకజంతో నా వ్యవహారం మామయ్యదాకా యెలా వెళ్ళిందో నాకు తెలియదుగాని. వున్నట్టుండి హఠాత్తుగా వూడిపడ్డ మా మామయ్యని చూసి నాకు కాళ్లూ, చేతులూ ఆడలేదు. తల్లీ, తండ్రీ లేని నన్ను పెంచి పెద్దచేసి యింతవాడిని చేసిన మామయ్యంటే నాకు భయం భక్తి రెండూ వున్నాయి ఇంత కాలం యేదో కుంటి సాకులు చెప్పి పెళ్ళి వాయిదా వేశాను. ఈ సారి అది కుదరలేదు.

మామయ్య నన్ను ముక్క చీవాట్లువేసి, వూరికి తీసుకు వెళ్ళి దూరపు బంధువు లమ్మాయి సుజాతతో నా పెళ్ళి సెటిల్‌చేసిగాని నన్ను వదల్లేదు. పైగా వెంటనే పంకజం యింట్లో గది ఖాళీ చేసెయ్యమని తాఖీదు గూడా యిచ్చాడు.

మామయ్య చెప్పకపోయినా, యెందుకో సుజాతను చూపిన క్షణం నించీ నాకు పంకజం అంటే వెగటు పుట్టుకు రాసాగింది. పంకజాన్ని వదుల్చు కోవడం ఆమెతో స్నేహం చేసినంత సులువు కాదని తెలుసు నాకు. బంగారు గుడ్లు పెట్టే బాతులాంటి నన్ను పంకజం అంత తేలిగ్గా వదులు కుంటుందా? ఫేక్టరీ దగ్గర పడటంతో ఆలోచనలు కట్టి పెట్టి పంచింగ్ మిషన్‌వైపు నడిచాను.

2

"రాజా" అని చిన్నగా పిలుస్తూ, పంకజం తలుపు తడుతూవుంటే మెలుకువ వచ్చింది నాకు.

చాలా పొద్దెక్కినట్టుంది. ఎండ మిటమిటలాడుతోంది. పంకజం మళ్ళీ "రాజా! చాలా పొద్దెక్కింది. లేచి తలుపు తియ్యి" అంటూ గట్టిగా తలుపు కొట్టడంతో మరి లేవక తప్పింది కాదు. లేస్తూనే పంకజం మొహం చూడ్డం ఇష్టం లేని నేను, నా మొహాన్నే అద్దంలో ఓమారు చూసుకుని, వెళ్ళి తలుపు తీశాను.

"హమ్మయ్య! లేచావా? ఇంత మొద్దు నిద్రేమిటి బాబూ? గంటసేపట్నించీ తలుపు కొడుతున్నాను. వెళ్ళి మొహం కడుక్కురా. కాఫీ తెస్తాను" అంటున్న పంకజాన్ని పరీక్షగా చూశాను.

రోజూ కంటే చాలా శ్రద్ధగా అలంకరించుకుంది. నిన్న నాతో జరిగిన సంభాషణను మరిచిపోయినట్లే, మా ఇద్దరి మధ్య యేమీ జరగనట్టే మాట్లాడుతోంది. కాని నిజానికి

నిన్న నా ప్రవర్తన పంకజాన్ని బాగా కలవరపరిచి వుండాలి. ఎందుకంటే ఈ మధ్య నేను నా గదిని వాడటం అరుదైపోయింది. నా భోజనం పడక అన్నీ పంకజం ఇంట్లోనే. నేను యెంత అర్ధరాత్రి, అపరాత్రి వచ్చినా, పంకజం విసుక్కోకుండా తలుపు తీసి. కట్టుకున్న భార్య కంటే గూడా ఎక్కువగా ఆదరించేది.

అలాంటిది నిన్న రాత్రి షిఫ్టు ముగించుకుని నేను తిన్నగా నా గదికి వచ్చి పడుకోవడం, పంకజాన్ని కలవర పరచకుండా వుంటుందా?

"ఏమిటి రాజా, అలా చూస్తూ నిల్చుండిపోయేవు? వెళ్ళి మొహం కడుక్కురా కాఫీ తాగుదువు గాని" అంటూ పంకజం మళ్ళీ హెచ్చరించింది.

"ఇవాళ హోటళ్ళేమీ స్ట్రయిక్ చెయ్యడంలేదులే! వెళ్ళి కాఫీ తాగ్గలను" అన్నాను.

పంకజం విసురుగా యేదో సమాధానం చెప్పబోయి, అంతలోనే సంబాళించుకుంది.

"రాజా! ఏమయింది నీకు? నా చేతి కాఫీ కూడా విష మయిపోయిందా? నేనేం చేశాను? నా తప్పేమిటో చెపితే దిద్దుకుంటాను" అంది వేడికోలుగా. ఆమె కళ్ళల్లో నీళ్ళా క్కటి తక్కువగా వున్నాయి. కాని నా మనసు కరగ లేదు.

"నిన్ననే చెప్పాను ఇంక మన స్నేహం కొనసాగించ డము కుదరదని. ఇంత కాలం నేను నీకు డబ్బు ఇచ్చాను. నువ్వు నాకు సుఖాన్నిచ్చావు. ఇంక మనం ఒకళ్ళకొకళ్ళం యేమీ బాకీ లేము" అన్నాను తెగేసినట్టు. అంత కఠినంగా పంకజంతో యెలా మాట్లాడగలిగేనో నాకే తెలీదు.

పంకజం ఏదో సమాధానం చెప్పేలోపలే తువ్వాలు భుజంమీద వేసుకుని బాత్‌రూమ్ వైపు నడిచాను. పంకజం వాళ్ళ వంటింటి గుమ్మంలో కూర్చుని బీడీ కాల్చుకుంటున్న రాఘవులు నన్ను కొరకొర చూస్తూ తుప్పున పక్కకి తిరిగి వుమ్మడం నేను గమనించి కూడా గమనించనట్టు నటిస్తూ బాత్‌రూమ్‌లో దూరి తలుపేసుకున్నాను.

స్నానం వగైరాలన్నీ ముగించుకుని, హోటల్లో తిండి తిని, మళ్ళీ ఫాక్టరీకి వేళయ్యేదాకా యింటివేటలో పడ్డాను. నా కెందుకో నా గదికి వెళ్ళలన్నా పంకజంతో వాదులాడా లన్నా ఇష్టం లేదు.

రాత్రి షిఫ్టు ముగించుకుని గదికి వెళ్ళే సరికి పంకజం యింట్లో యింకా దీపం వెలుగుతోంది. గది తలుపు తీస్తున్న చప్పుడు విని బయటికి వచ్చింది.

"ఇవాళ రోజంతా యింటికి రానేలేదు. ఏమయినా తిన్నావా లేదా? పాలు తీసుకురానా?" అంటూ ఆప్యాయంగా అడిగింది. ఆమె బయటికి రాగానే మల్లెపూలు, మరికొ ఖందు సెంటు వాసనలు గాలిలో అలుముకున్నాయి.

నేను ఆమె అందాన్ని, అలంకరణని గమనించకుండా "ఏం వద్దు. అన్నట్టు ఓ సంగతి: ఎల్లుండి గది ఖాళీ చేసేస్తున్నాను. పూర్తి నెలకి అద్దె యిచ్చేస్తానునుకో" అని చెప్పేసి నోట మాట రానట్టు, నమ్మలేనట్టు విస్మయంగా చూస్తున్న పంకజాన్ని అలాగే వదిలి నేను గది తలుపు వేసుకున్నాను.

పంకజం విషయంలో నేను చాలా తొందరపాటు చూపిస్తున్నా నేమో ననిపించసాగింది నాకు. ఇంకాస్త నెమ్మదిగా, సౌమ్యంగా పంకజానికి నచ్చచెప్పి వుంటే బాగుండును. కాని నాలో వున్న బలహీనత నాకు తెలుసు.

నేనిలా బింకంగా వుండకపోతే పంకజం నన్ను తేలిగ్గా గెలుచుకోగలదు. మరి నే నెప్పటికీ యీ వూబిలో నించి బైటపడలేను.

ఈ మాఘమి వెళ్ళగానే ముహూర్తాలు వున్నాయంటూ మామయ్య వుత్తరాలు రాస్తున్నాడు. ఇంతకాలం నేను సాగించిన యీ చీకటి జీవితం, నా భావిని చీకటి చెయ్యడం నాకెంతమాత్రం యిష్టంలేదు. సుజాత వచ్చేసరికి యీ బురదంతా కడిగేసుకుని, స్వచ్ఛంగా వుండాలన్నదే నా కోరిక.

సుజాత జ్ఞాపకానికి రాగానే పంకజం నా ఆలోచనల్లో మరుగున పడిపోయింది.

మర్నాడు పంకజం నన్ను నిద్రలేపే ప్రయత్నం చెయ్యలేదు. నేనే ఆలస్యంగా నిద్రలేచాను.

నాకు పంకజంగాని, రాఘవులుగాని యెక్కడా కనిపించలేదు. నేనుగూడా అట్టే వాళ్ళగురించి ఆలోచించలేదు.

త్వరగా తయారై తిన్నగా ఒక స్నేహితుడింటికి వెళ్ళాను. అతని దగ్గర అప్పు తీసుకుని వెళ్ళి యింటికి అద్దెను యిచ్చాకగాని నా మనసు కుదుటపడలేదు.

పంకజం యింటికి అద్దెకి రాకముందు నా బేంక్ బాలన్సు బాగానే వుండేది. ఎవరి దగ్గరా చెయ్యి చాచవలసిన అవసరం వుండేది కాదు. పంకజంతో నా పరిచయం పెరిగే కొద్దీ, నా బాంక్ బాలన్సు తరిగిపోవడమే కాకుండా అందిన చోటల్లా అప్పులు చెయ్యాల్సివచ్చేది. పంకజం నన్ను మరీ కొల్లగొడుతోందని అనిపించినా నేను అట్టే పట్టించుకోలేదు.

అప్పట్లో నా జీవితానికో గమ్యం లేదు నా మీద ఆధారపడినవాళ్ళు గాని, నా డబ్బుని ఆశించేవాళ్ళుగాని యెవరూ లేరు. ఇకముందు అలా కాదు. నాకూ అని ఓ చిన్న

సంసారం యేర్పడబోతోంది. త్వరగా అప్పులన్నీ తీర్చేసి, యింటికి కావల్సిన నాలుగు వస్తువులూ అమర్చుకోవాలి. ఆలోచిస్తూ వుత్సాహంగా అడుగులు ముందుకి వేశాను.

3

సెక్యూరిటీ చెకింగ్ అయిందనిపించుకుని, కాంటీన్‌లో ఒక టీ తాగి, ఫేక్టరీ ఆవరణ వదిలేసరికి అర్ధరాత్రి దాటి పోయింది. అది నా మామూలు వేళే!

ఒక్కడ్నీ జేబులో చేతులు పెట్టుకుని చకచక నడుస్తున్నాను. నా గది ఫేక్టరీకి అట్టే దూరం లేదు. నడిచి వెళ్ళగలిగేటంత దూరం. కాకపోతే సాధారణంగా మొదటి ఆట సినిమా అయ్యాక, రెండో ఆట వదిలే వేళ అయేదాకా యీ ప్రాంతాల్లో అసలు జనసంచారం వుండదు. కాని నాకు మాత్రం ఆ నిర్మానుష్యమైన వీధుల్లో అలా వంటరిగా నడుచుకుంటూ పోవడం బాగా అలవాటైపోయింది.

మా వీధిలో మా ఫేక్టరీలో పనిచేసే వాళ్ళు కొంతమంది వున్నా, వాళ్ళంతా ఫేక్టరీ వదిలిన తక్షణం సైకిలెక్కి రయ్యిమని వెళ్ళిపోతారు. వాళ్ళ తొందర చూసి నాకు ఒకప్పుడు నవ్వు వచ్చేది. కాని యిప్పుడు అర్ధం అవుతోంది వాళ్ళ ఆతృత. వాళ్ళకోసం యింట్లో భార్య కళ్ళల్లో వత్తులు వేసుకు యెదురుచూస్తూ వుంటుంది. అందుకే ఆఘమేఘాలమీద యింటికి పరుగెత్తుతారు.

ఇప్పుడు నేను చూసిన యిల్లు యీ ప్రాంతాలకి బాగా దూరంలోనే వుంది. కావాలనే పంకజానికి బాగా దూరంగా వుండాలనే. వాళ్ళ నీడ కూడా ఆ ప్రాంతాల్లో పడకుండా వుండాలనే అంత దూరంలో యింటికోసం ప్రయత్నించాను. ఫేక్టరీకి నా రాకపోకలకి కాస్త యిబ్బందనిపించినా నా మనసుకి కాస్త శాంతిగా వుంటుంది.

పరధ్యానంగా నడుస్తున్న నేను, లైటు స్థంబం దగ్గర యెవరిదో నీడ కదిలినట్టయి చటుక్కున ఆగిపోయాను.

ఈ వేళప్పుడు యీ చిన్న వీధిలో అసలు జనసంచారం వుండదు. ఎవరబ్బా అక్కడ తచ్చాడుతున్నది? ఎందుకు అక్కడ వున్నట్టు? ఏదో తెలీని భయం నా వెన్నులో వణుకు పుట్టించింది. మరి అడుగు ముందుకి పడలేదు.

కొయ్యలా నిలబడిపోయిన నా ముందుకి చీకట్లో నించి ఆ మనిషెవరో వేగంగా పరిగెట్టుకుంటూ వచ్చి నామీదకి యేదో విసిరాడు.

ఒక క్షణంలో, సగంసేపు మాత్రంలో నే నా మనిషిని గుర్తుపట్ట గలిగేను. అతను రాఘవులు! మరుక్షణంలో భగభగ మండుతున్న మంటల్లోకి నన్ను నెట్టి నట్టయి వెర్రికేకలు పెడుతూ, కుప్పకూలిపోయాను.

* * *

చావుకీ, బ్రతుక్కీ మధ్య నెలల తరబడి వూగిసలాడిన నా ప్రాణం ఆఖరికి యెలాగో నిలబడింది. ఆ మాత్రానికే

రాఘవులు నామీద యాసిడ్ పోశాడని, దాంతో నా వళ్ళంతా ఒక పక్క కాలిపోయిందని నాకు తెలుసు, కాని నా మొహం, నా అందమైన మొహం యింత ఘోరంగా, నేనే యిడుసుకునేటంత వికారంగా తయారైందని నేను అనుకోలేదు. ఇప్పుడు సుజాత కాదుగదా, పంకజంలాంటి బజారు మనిషికూడా నా ఛాయలకి రాదు.

ఆఖరికి పంకజం తన కక్ష యిలా తీర్చుకుందన్నమాట!

వెక్కి వెక్కి యేడుస్తున్న నా తల నిమురుతూ, "రాజూ! ఏమిటిది? చిన్న పిల్లాడిలాగ! ప్రాణాలు దక్కాయి సంతోషించు. వాళ్ళిద్దర్నీ నేను వదిలేననుకున్నావేమిటి? పోలీసు రిపోర్టిచ్చి అరెస్టు చేయించాను" అంటున్న మామయ్యని దీనంగా చూశాను.

వాళ్ళిద్దర్నీ పోలీసులు అరెస్టు చేసినా, వాళ్ళకి శిక్షపడినా పోయిన నా రూపు నాకు వస్తుందా? దుష్టులతో చేసే స్నేహాలు ఆఖరికి యిలాగే పరిణమిస్తాయి గామోసు! □

పలిగిన దొంగ

ఎం.డి. చైతన్య



టి.వి. కొనాలనేది సుబ్బారావు చిరకాల వాంఛ. చాలా కాలం తర్వాత ఆ శుభముహూర్తం ఆసన్నమైనం దుకు సుబ్బారావు సంతోషించాడు. ఆ రోజు అతను ఆబిడ్స్‌లో దయానోరా టి.వి. కొన్నాడు. ఇన్‌స్టాల్‌మెంటు బేసిస్‌మీద అయితేనేమి చివరికి అతని కోరిక నెరవేరింది. సుబ్బారావు భార్య, ఇద్దరు పిల్లలు యెంతగానో సంతోషించారు.

ఆ రోజు చాలా సంతోషంగా గడిచింది. చుట్టుపక్కల ఇంటివారంతా వచ్చి—ఆ రోజు టి.వి. లో వచ్చిన హిందీ సినిమా చూసారు. టి.వి. వచ్చినప్పటినుంచి సుబ్బారావు యింటికి ఏదో ప్రత్యేకత సంతరించినట్లయింది. వీధిలో సుబ్బారావు ఇమేజ్ చెప్పుకోతగినంతగా పెరిగింది. కారణ మేమిటంటే ఆ వీధిలో టి.వి. సెట్టు యెవ్వరికీ లేదు. అత నొక్కడి యింట్లోనే టి.వి. వుండటం అదొక గొప్ప విష యమై పోయింది.

వాళ్ళు అలా టి.వి. కొన్న సంతోషంలో నుంచి తేరు కొనక ముందే—

ప్రొద్దున్నే "టెలిగ్రాం" అంటూ మెసెంజర్ వచ్చాడు.

తన తమ్ముడు బాబురావు ఇచ్చాడా టెలిగ్రాంని.

టెలిగ్రాంలోని విషయాన్ని చదువుకున్న సుబ్బారావు కుప్పలా కూలిపోయాడు.

అతని భార్య సావిత్రి ఆతృతగా వచ్చి "ఏమిటి.... ఏమైందండి!" అని ప్రశ్నించింది.

సుబ్బారావు ఏడుస్తూ టెలిగ్రాం అందించాడు.

"ఫాదర్ ఎక్స్పైర్డ్ స్టార్ట్ ఇమ్మిడియట్లీ...."

—బాబురావు

టెలిగ్రాంని అందుకున్న సావిత్రి అందులో విషయాన్ని చదువుకొని "మావయ్యా...." అంటూ సుబ్బారావుతో జత కలిపింది.

వాళ్ళింట్లో జరుగుతున్న గలభా విని చుట్టుప్రక్కల వాళ్ళంతా వచ్చారు. అక్కడ ఒక పెద్ద గుంపు తయా రైంది. అందరూ విషయం తెలుసుకొని సానుభూతి వచ నాలు పలుకుతున్నారు. కొందరు "ఇంకా ఏడుస్తూ కూర్చు

న్నారేమిటి....ఇప్పుడు సూర్యాపేటకు ఎక్స్‌ప్రెస్ బస్సు వుంది. త్వరగా వెళ్తే దొరుకుతుంది. కడసారి తండ్రిని చూసుకునే అదృష్టమైనా కలుగుతుంది'' అంటూ వారిని కర్తవ్యోన్ముఖులను చేసారు.

సుబ్బారావు తమ ఆఫీసులోనే పని చేస్తున్న ప్రక్కింటాయనకు వారం రోజులకు సెలవు వ్రాసి ఇచ్చాడు.

వాళ్ళు త్వరత్వరగా సామాన్లన్నీ సర్దుకొని ప్రయాణానికి సిద్ధమయ్యారు.

ఎవరో వెళ్ళి ఆటోను పిలుచుకొని వచ్చారు.

సుబ్బారావు ఇంటికి తాళం వేసి—ఇద్దరు పిల్లలు, భార్యా సమేతుడై ఆటో యెక్కాడు.

ఆటో ముందుకురికింది.

2

సూర్యాపేట!

బస్టాండులో రిక్షా మాట్లాడుకొని సుబ్బారావు తన యింటికి చేరుకున్నాడు.

రిక్షా ఇంటిముందు ఆగింది.

రిక్షా దిగడమే ఆలస్యం సుబ్బారావు అతనిభార్యా పిల్లలు బావురుమంటూ ఏడుస్తూ యింట్లోకి ప్రవేశించారు.

సుబ్బారావు వెళ్ళి—అతని తల్లిని పట్టుకొని ఏడవటం మొదలెట్టాడు. అతని భార్య సావిత్రి సూట్‌కేసు మెట్లమీద పెట్టి ఏడుస్తూ కూర్చుంది.

వాళ్ళ ఏడుపులు పెడబొబ్బలు విని యింట్లోని వారంతా వచ్చారు. విషయం తెలియక వాళ్ళుకూడా ఏడవటం మొదలెట్టారు.

ముందుగా సుబ్బారావు తల్లి తేరుకొని—

“ఒరే సుబ్బూ....ఏమిట్రా ఏమైంది .... అందరూ

క్షేమంగా వున్నారుకదా .... ఎందుకురా మీరు ఏడుస్తూ వచ్చారు. ఏం జరిగింది చెప్పరా...." అంటూ ఆమె అడిగింది.

సుబ్బారావు ఆశ్చర్యపోయాడు. ఇదేమిటి వీళ్ళు నన్నే ఏమైంది అని ప్రశ్నిస్తున్నారేమిటి? నాన్నగారు పోయి నేను ఏడుస్తుంటే—వీళ్ళకిదంతా ఏమి పట్టలేదా? వీళ్ళు అప్పుడే నాన్నగారిని మరిచిపోయారా? నాకు టెలిగ్రాం లేటుగా అందిందా?

క్షణంలో అతని మెదడులో అనేక ప్రశ్నలు మెదిలాయి.

"ఒరే సుబ్బారావు ఏమిట్రా....ఏం జరిగింది ఆడపిల్లలా అలా ఏడుస్తున్నావు దేనికీ...." అంటూ సాక్షాత్తు సుబ్బారావు వాళ్ళ నాన్న రంగారావుగారు వచ్చేసారు.

సుబ్బారావు ఆశ్చర్యం, ఆనందంతో నోరు తెరిచాడు.

"మీరు పోయారని బాబురావుగాడు టెలిగ్రాం ఇచ్చాడు నాన్నా!"

రంగారావుగారు పెద్దగా నవ్వేసారు.

సుబ్బారావు తమ్ముడు బాబురావు అప్పుడే అక్కడికొచ్చాడు.

"నేను టెలిగ్రాం ఇచ్చానా? బావుంది. నేనెందుకు యిస్తాను?" అన్నాడు.

సుబ్బారావు తన జేబులోని టెలిగ్రాం తీసి అందరికి చూపించాడు.

టెలిగ్రాం ఎవరిచ్చారో వాళ్ళకెవ్వరికీ అర్థం కాలేదు.

వాళ్ళు కొద్దిసేపట్లోనే అంతా మరిచిపోయి అక్కడ జరిగిన నాటకీయ సన్నివేశాన్ని తలుచుకొని నవ్వుకున్నారు.

తను యెలాగు హైద్రాబాదునుండి ఇంతదూరం వచ్చే

సాదు కదా అని అక్కడే రెండురోజులుండి—మూడవ రోజు హైద్రాబాదు ప్రయాణమయ్యాడు సుబ్బారావు.

3

ఆటోరిక్షా సుబ్బారావు ఇంటిముందు ఆగింది.

సుబ్బారావు ఆటోవాడికి డబ్బులిచ్చి—వెళ్ళి యింటి తలుపులు తెరిచాడు. సూట్‌కేసు లోనికి మోసుకొచ్చాడు.

భార్యా పిల్లలంతా యింటిలోనికి వచ్చేసారు.

ఆటో వెళ్ళిపోయింది.

సుబ్బారావుకు టి.వి. గుర్తొచ్చింది. దుమ్ము పట్టి వుంటుంది. బట్టతో శుభ్రం చేద్దామని టి.వి. వుండే గది లోకి వెళ్ళాడు ఆ గదిలో వుండవలసిన టి.వి. కన్పించ లేదు. సుబ్బారావు గతుక్కుమన్నాడు వేసిన తాళం వేసి నట్లే వుంది. టి.వి. మాయమైందేమిటి?

సుబ్బారావు గాభరాపడిపోయాడు.

"సావిత్రీ! ఇంట్లో దొంగలు పడ్డారు. మన టి.వి. సెట్టు కన్పించడం లేదు. ఇంకా ఏమేమి కన్పించడం లేదో త్వరగా చూడు" అన్నాడు.

సావిత్రి కిటికీలన్ని తెరిచి చూసింది.

"టేప్‌రికార్డర్ కన్పించడంలేదండి!" అని అరిచింది.

అన్ని వెతికి చూసుకోగా—

నాలుగువొందలు నగదు, ఒక నెక్లెసుతో పాటు పట్టు చీరెలున్న ఒక ఎర్ర సూటుకేసు కూడా కన్పించడం లేదు.

మిగతా వస్తువులన్నీ వున్నాయి. బిందెలు, చెంబులు, పళ్ళాలు అన్ని కరక్టుగా వున్నాయి.

సుబ్బారావు పోలీసు స్టేషనులో రిపోర్టిచ్చాడు.

"ఎవరిమీదనైనా అనుమానం వుంటే చెప్పండి.... వాడిని అరెస్టుచేసి ప్రశ్నిస్తాం...." అన్నాడు యస్.ఐ.

మా ర్త్రాండ.

తనకు ఎవరిమీద అనుమానం లేదని చెప్పాడు.

యస్.ఐ. వచ్చి స్పాట్‌ను చూసి పోయాడు.

4

"నమస్కారం సార్!"

"నమస్తే....రండి....కూర్చోండి!"

సుబ్బారావు కూర్చున్నాడు.

అది ఒక ప్రయివేటు డిటెక్టివ్ ఏజెన్సీ ఆఫీసు.

"వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ...." డిటెక్టివ్ సుధాకర్ వినయంగా అడిగాడు.

"నేను సంజీవయ్య నగర్‌లో వుంటాను సార్. మా యింట్లో దొంగలు పడి డయోనోరా టి.వి., టు ఇన్ వన్ నేషనల్ పానాసోనిక్ టేప్ రికార్డర్, ఒక నెక్లెసు, నాలుగు వందలు నగదు, కొన్ని చీరెలున్న ఒక సూట్‌కేసు దొంగిలించారు సార్!"

"అలాగా? మీరు ఇంట్లో వున్నప్పుడే ఈ దొంగతనం జరిగిందా?"

"లేదండి....దానికో కథ వుంది. దొంగ చాలా తెలివి కలవాడు. మా నాన్నగారు పోయారని సూర్యాపేట నుండి ఒక దొంగ టెలిగ్రాం యిచ్చాడు. మేము హడావుడిగా ఇంటికి తాళంవేసి ఏడుస్తూ సూర్యాపేటకు వెళ్ళాం. అక్కడ మా నాన్నగారు సలక్షణంగా వున్నారు. అప్పుడు గానీ మాకు తెలియలేదు. అది దొంగ టెలిగ్రాం అని. ఎలాగు వచ్చాము కదా అని అక్కడ రెండు రోజులు వుండి తిరిగొచ్చాము. తీరా ఇక్కడికొచ్చి చూస్తే ఇంట్లో దొంగతనమైంది. మా ఇంట్లో దొంగతనం చేయడానికే వాడా దొంగ టెలిగ్రాం వ్యవహారం నడిపాడు."

"నిజమే దొంగతనం ఒక పథకం ప్రకారం జరిగింది. అయితే—దొంగ మిమ్మల్ని బాగా ఎరిగినవాడేనన్నమాట."

"ఉండొచ్చండి, లేకపోమీ మా వాళ్ళు సూర్యాపేటలో వుంటారని తెలియడం, మా తమ్ముడి పేరు బాబురావు అని తెలియడం చూస్తే—నన్ను బాగా యెరిగినవాడే యీ దొంగతనం చేసాడనిపిస్తోందండి!"

"ఓ కే. ఈ కేసును నేను టేకప్ చేస్తున్నాను నేను మీ యింటి నొకసారి చూడాలి!"

"ఓ తప్పకుండా, ఇప్పుడే వెళ్దాం పదండి!"

ఇద్దరూ కలిసి సైకిలు మోటారు మీద సంజీవయ్య నగరు కొచ్చారు.

ఆ కాలనీ ఒక ప్లాను ప్రకారం కాకుండా ఇష్టమొచ్చినట్టు కట్టారు. అది ప్రభుత్వం భూమి కావడమే అందుకు కారణం అయ్యుంటుంది. కొంత మంది వ్యక్తులు ఆ కాలనీలో భూమిని ఆక్రమించుకొని అవసరమున్న వారికి అమ్మేసారు. కాలనీలో కొన్ని పెంకుటిల్లు, కొన్ని డాబాలు, కొన్ని యాస్బెస్టాస్ రేకులతో కట్టిన ఇళ్లు వున్నాయి.

సుబ్బారావు ఇల్లు ఆరుగదులున్న డాబా. ముందు వరండా వుంది. కాని తర్వాత గదిలో వాళ్ళు టి.వి. పెట్టారు. పైన 'యాంటెన్నా' మాత్రం దొంగ అలాగే వుంచాడు. బహుశా ఎవరైనా చూస్తారేమోనని అనుమానంతో అలాగే ఉంచి వుండవచ్చు.

5

నగరంలో టి.వి. సెట్లు అమ్మే అన్ని షాపులను తిరిగి ఈ వారంలో టి.వి. సెట్టును కాకుండా, ఒక 'యాంటెనా'ను మాత్రం యెవరైనా కొన్నారా? అని ఎంక్వయిరీ చేశాడు డిటెక్టివ్ సుధాకర్.

అతని ప్రయత్నం ఫలించింది.

సంజీవయ్య నగరులో వుండే యూసుఫ్ పాషా ఒక యుంటెన్నా కొనుక్కు వెళ్ళాడని తెలిసింది—

డిటెక్టివ్ సుధాకర్ సంజీవయ్య నగరంలో యూసుఫ్ పాషా ఇంటని వెతికాడు. సుబ్బారావు ఎదిరింట్లోనే అతడు వుంటున్నాడు.

ఎస్.ఐ. మార్తాండ సహాయంతో, డిటెక్టివ్ సుధాకర్ యూసుఫ్ పాషా ఇంటిపై దాడి చేశాడు. సుబ్బారావు యింట్లో పోయిన వస్తువులన్నీ యూసుఫ్ యింట్లో దొరికాయి. ఎస్.ఐ. అతడిని అరెస్టుచేసి స్టేషన్‌కు తీసుకెళ్ళాడు.

సుబ్బారావు సంతోషంగా డిటెక్టివ్ సుధాకర్‌కు ఫీజు ముట్టచెప్పాడు. □

నీకీ గొడుగేల?

కొండను ఢీకొన్న ఎలుక

రచన
వాణిశ్రీ

కంట్రాక్టర్ గోపీనాథ్ ఏడింటికల్లా ఇంటికి చేరుకున్నాడు.

పగలంతా ఎండలో వర్క్‌స్పాట్‌లో వుండి పని చేయిస్తున్నాడు. అతను కాంట్రాక్టు తీసుకున్న ఓవర్ బ్రిడ్జి పూర్తి కావొచ్చింది. ఎంత తొందరగా పూర్తిచేస్తే అంత

మంచిదని అతను నిర్ణయించుకున్నాడు. కనీసం పది లక్ష లైనా ఈ వర్కులో మిగులుతుందని మొదట్లో అంచనా వేసుకున్నాడు. కాని ఇంజనీర్లంతా ముక్కు సూటిగాళ్ళు, లాల్ బహదూర్ శాస్త్రి శిష్యులూ తగలబడ్డారు. గడ్డివాము దగ్గర కుక్కల్లా కాపలా కాస్తున్నారు. వాళ్ళు తినరు, మరొకళ్ళని తిననివ్వరు.

'ఈ కాలంలో గూడా ఇటువంటి పిచ్చివాళ్ళు వుంటా రని కలలో గూడా' అనుకోలేదని గోపీనాథ్ అనుకోని రోజులేదు.

అతను ఆఫీసు రూమ్‌లో కూర్చోగానే నౌకరు చెమటలు కక్కుతున్న బీర్ బాటిల్ తెచ్చి ఓపెన్ చేసి టేబుల్ మీద పెట్టాడు.

గోపీనాథ్ గ్లాసులోకి బీర్ వంచుకునే లోపల ప్లేటులో జీడిపప్పు తెచ్చి వుంచుతూ "అయ్యా! తమ కోసం ఎవరో వచ్చారు" అన్నాడు నౌకరు.

అతను ముఖం చిట్లించి నౌకరుకేసి తీవ్రంగా చూశాడు.

"ఎవరో కనుక్కో!" అన్నాడు

నౌకరు వెళ్ళిపోయి కొంచెం సేపటికి తిరిగి వచ్చి "అయ్యా! ఆయన పేరు జనార్ధన్ అని చెప్పాడు. తమకి స్నేహితులట" అన్నాడు.

జనార్ధన్ యెవరో వూహించడానికి ప్రయత్నించి విఫలు డయ్యాడు. డబ్బు, పలుకుబడి వున్నవాడికి అంతా స్నేహి తులే. ఊళ్ళో జనార్ధన్‌లు, జనార్ధనరావులు బోలెడు మంది వున్నారు. అందులో ఎవరని అనుకోవాలి?

గోపీనాథ్ బాటిల్ ఖాళీచేసి అవి అక్కడ్నుంచి తీసెయ్య మని సంజ్ఞ చేశాడు.

"అతన్ని రమ్మను" అన్నాడు.

"కోప్పడకు సురేందర్! నువ్విప్పుడు చాలా గొప్ప కంట్రాక్టరుగా చలామణీ అవుతున్నావు. గౌరవంగా జీవిస్తున్నావ్? కాని పాతరోజులు మర్చిపోతున్నావ్. నీ పార్టనర్ని గుర్తించలేనట్లు నటిస్తున్నావ్. అది మంచిది కాదు. నమ్మకద్రోహం సహించరానిది" తీవ్రంగా అన్నాడు జనార్ధన్.

"నువ్వు నా పార్టనర్‌వా? ఎవడైనా నవ్విపోతాడు. నాకు ఎప్పుడూ, ఏ కాంట్రాక్టులోనూ పార్టనర్స్ లేరు. నాకు డబ్బుకు లోటులేదు. మరొకర్ని పార్టనర్‌గా వేసుకోవాల్సిన అవసరం నాకు లేదు" అన్నాడు గోపీనాధ్.

"అది కాంట్రాక్టులో. ఇప్పటి సంగతి. కాని పాత రోజుల్లో....?"

"ఏమిటి నీ ఉద్దేశ్యం! పాత రోజులు అంటావేమిటి? అసలు నువ్వెవరో గుర్తుకు రాక చస్తుంటే" విసుగ్గా అన్నాడు గోపీనాధ్.

"సరే నేను గుర్తు చేస్తాను సురేందర్. పదేళ్ళ క్రితం నువ్వూ, నేనూ, రామిరెడ్డి సికింద్రాబాద్‌లో బ్యాంక్ దోపిడీ చేశాం. క్యాష్‌వున్న సూట్‌కేస్‌తో నువ్వు ముందు వెళ్ళిపోయావు. రామిరెడ్డి, నేను మరొక మోటార్ సైకిల్ మీద తప్పించుకుని పారిపోతుంటే దురదృష్టవశాత్తు యాక్సిడెంట్ జరిగి పోలీసులకు దొరికిపోయాం. మాకు పదేళ్ళు జైలుశిక్ష పడింది రామిరెడ్డి జైల్లోనే క్యాన్సర్ వచ్చి పోయాడు. నేను శిక్ష పూర్తయ్యాక విడుదల అయ్యాను. ఇప్పుడైనా గుర్తొచ్చానా?" అంటూ వికటంగా నవ్వాడు జనార్ధన్.

గోపీనాధ్ మతిపోయిన వాడిలా చూశాడు. అతని ముఖం చెమట్లు పట్టివుంది.

నౌకరు తలవూపి వెళ్ళిపోయాడు.

జనార్ధన్ లోపలకు వచ్చి దర్జాగా కుర్చీలో కూర్చుని "బాగున్నావా?" అంటూ వెకిలిగా నవ్వాడు.

గోపీనాధ్‌కి మండిపోయింది. తనని చూపి ఎవరైనా విష్ చెయ్యకపోతే అతనికి వెంటనే కోపం వస్తుంది. కాని అతనెవరో గుర్తు రావడంలేదు. మనిషి నల్లగా మొరటుగా వున్నాడు. ముఖంమీద స్ఫోటకం మచ్చలున్నాయి. బ్రౌన్ కలర్ చారల చొక్కా వేసుకుని అచ్చం సినిమాలో విలన్‌లా కనిపిస్తున్నాడు.

"ఎవరు నువ్వు?" ప్రశ్నించాడు గోపీనాధ్.

జనార్ధన్ పక పక నవ్వాడు.

"నువ్విలా అంటావని నాకు ముందే తెలుసు, చాలా మారిపోయావు సురేందర్? పార్టనర్‌నే మర్చిపోయావా? కాదు మర్చిపోయినట్లు నటిస్తున్నావ్!"

"ఏమిటి నువ్వు అనేది? నువ్వు పొరపాటున మా యింటికి వచ్చినట్లున్నావు. నా పేరు సురేందర్ కాదు. గోపీనాధ్."

"పేరు మార్చుకున్నావన్న మాట. మంచిదే. పోలీసుల కళ్ళు కప్పడానికి భలే ఎత్తు వేశావ్. కాని సురేందర్ నువ్వు పేరు మార్చుకోగలవు గాని ముఖం మార్చుకోలేక పోయావ్. ఎందుకంటే అది నీ చేతిలో లేదు గనుక" అని పకపక నవ్వాడు జనార్ధన్.

గోపీనాధ్‌కి అతని నవ్వు వింటుంటే చిర్రెత్తు కొచ్చింది.

"పిచ్చి పిచ్చిగా వాగకు. అసలు ఎవరు నువ్వు? ఎందు కొచ్చావ్?" కోపంగా అన్నాను.

"చూడు జనార్దన్! నువ్వు పొరపాటు పడుతున్నావ్! నా పేరు గోపీనాధ్. సురేందర్ కాదు...."

జనార్దన్ అతని మాటలకు అడ్డొచ్చాడు. "భయపడకు సురేందర్. నీ పాత జీవితం గురించి నే నెవరికీ చెప్పను. నీకు ఏ విధంగానూ అడ్డురాను. కాని నాకు ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చేస్తే వెళ్ళిపోతాను."

"డబ్బా?...."

"అవును సురేందర్. పది లక్షలు పోయాయని పేపర్లో చదివాము. నా భాగం మూడు లక్షల చిల్లర రావాలి. ఇప్పుడు రామిరెడ్డి లేడు. వాడికి పెళ్ళాం, పిల్లలు గూడా లేరు. కాబట్టి వాడి వాటాలో గూడా భాగం వస్తుంది. ఫిఫ్టీ. ఫిఫ్టీ. ఐదు లక్షలు యిచ్చేస్తే వెళ్ళిపోతాను."

"ఐదు లక్షలా?" నోరు తెరిచాడు గోపీనాధ్.

"పదేళ్ళ క్రితం ఐదులక్షల విలువ యిప్పుడెంత? బ్యాంక్‌లో డిపాజిట్ చేసినా పదిహేను లక్షలు అయ్యేది. అయినా నేను వడ్డీ అడగడంలేదు. అసలు ఇవ్వమంటున్నాను" కఠినంగా అన్నాడు జనార్దన్.

"నువ్వు చెప్పేదంతా వింటుంటే నాకు మతిపోతున్నది. సడెన్‌గా ఎక్కడ్నుంచో వూడిపడి నన్ను సురేందర్ అంటున్నావ్, బ్యాంక్ దోపిడీలో పార్టనర్ని అంటున్నావ్, ఐదు లక్షలు యివ్వమని డిమాండ్ చేస్తున్నావ్. అంతా గందరగోళంగా వుంది" అన్నాడు గోపీనాధ్ విసుగ్గా.

"అలాగా సురేందర్. నాకు రావాల్సిన ఐదు లక్షలు ఎగనామం పెట్టదల్చుకున్నావన్న మాట. నీకు నీతి నిజాయితీ లేవని అర్థమైపోయింది. నీ గురించి చెప్పమని పోలీసులు మమ్మల్ని ఎంత దారుణంగా హింసించారో నీకు తెలీదు. మే మా బాధలు ఓర్చుకుని నీ ఆచూకీ చెప్పలేదు.

ఎప్పటికైనా మా భాగం మా కిస్తావని నమ్మకంతో శిక్ష అనుభవించాలని నిర్ణయించుకున్నాం. నువ్విలా అడ్డం తిరుగుతావని అనుకుని వుంటే మాతోపాటు నీకూ శిక్ష పడేటట్లు చేసేవాళ్ళం. ఇప్పటికైనా ముంచుకునిపోయిం దేమీలేదు. నిన్ను కటకటాల వెనక్కి పంపకపోతే నా పేరు జనార్ధన్ కాదు."

"అనవసరంగా బెదిరించకు. నా పలుకుబడి తెలియక ఏదో వాగుతున్నావ్! పోలీస్ సూపర్నెంట్, జిల్లా కలెక్టర్ గూడా నాకు ఫ్రెండ్స్. ఇద్దరు మంత్రులు నేను చెప్పినట్లు వింటారు."

"దొంగ దొరికే వరకూ దొరే. ఆఖరి మాట చెప్తు న్నాను. మర్యాదగా నా కివ్వాల్సిన డబ్బు ఇచ్చి వేస్తే మంచిది. లేకపోతే నువ్వు అనవసరంగా చిక్కుల్లో పడ తావు. ఇప్పుడే వెళ్ళి నువ్వు బ్యాంక్ దోపిడీలో పార్టనర్ వని పోలీసులకు చెప్తాను" అన్నాడు జనార్ధన్.

"నీ వెవరో నాకు తెలియదు. నన్ను బ్లాక్ మెయిల్ చేయడానికి ఇదొక ఎత్తు?" కఠినంగా అన్నాడు గోపీనాధ్.

"నీ ధీమా అదన్న మాట" అంటూ జనార్ధన్ పై జేబులో నుంచి పర్సుతీసి ఒక ఫోటో లాగి టేబుల్‌మీద విసిరికొట్టాడు.

"చూశావుగా మనం ముగ్గురం కలిపి దిగిన ఫోటో. ఈ ఒక్క ఆధారం చాలు సురేందర్ నిన్ను కటకటాల వెనక్కి పంపడానికి. ఆలోచించుకో నీకు వారం రోజులు గడువిస్తున్నాను" అంటూ జనార్ధన్ ఫోటో పర్సులో పెట్టు కుని చరచరా వెళ్ళిపోయాడు.

గోపీనాధ్‌కి కళ్ళు తిరిగిపోతున్నాయి. కుర్చీలో వెనక్కి వాలి నీరసంగా వుండిపోయాడు. మనసులోకి ఆలోచనలు

గందరగోళంగా వస్తున్నాయి.

బజ్జర్ నొక్కాడు.

నౌకరు చేతులు కట్టుకుని వినయంగా వంగి నిల్చు న్నాడు.

"విస్కీ బాటిల్" అన్నాడు గోపీనాథ్.

నౌకరు టేబులు మీద విస్కీ బాటిల్, గ్లాసు వుంచాడు.

గోపీనాథ్ పీడకలలా వచ్చిన జనార్ధన్‌ని మర్చిపోవ డానికి విస్కీని ఆశ్రయించాడు.

2

గోపీనాథ్ గుండెల్లో గుబులు గూడు కట్టుకున్నది.

జనార్ధన్ యింటికొచ్చి బెదిరించిపోయాడు. రేపెక్క డైనా నడిబజార్లోనో, వర్క్‌స్పాట్‌లోనో పట్టుకుంటే తన పరువు ఏం కావాలి? వీడి పీడ యెలా వదుల్తుంది? వాడికి భయపడి ఐదులక్షలు ఇవ్వడమా?

నాన్సెన్స్! వాడొక దొంగ. జైల్లో పదేళ్ళు శిక్ష అనుభ వించి వచ్చాడు. వాడికి సోషల్ స్టేటస్ లేదు. తను సొసై టీలో యెంతో గౌరవం గలవాడు. డబ్బున్నవాడు. తను వాడికి భయపడడమా?

నో వాడికి భయపడగూడదు వాడి బ్లాక్‌మెయిల్‌కి లొంగగూడదు అనుకున్నాడు గోపీనాథ్. కాని జనార్ధన్ మళ్ళీ తనకు కనిపించి పరువు తీస్తాడేమోనని లోలోపల భయపడుతూనే వున్నాడు. మూడు రోజులు గడిచిపోయాయి. ఎండలు మండిపోతున్నాయి.

రోజూ బీర్ తాగి రిలాక్స్ అయ్యేవాడల్లా 'జనార్ధన్' భయంతో విస్కీ తాగి మత్తుగా పడుకుంటున్నాడు.

నాలుగోరోజు రాత్రి గోపీనాథ్ విస్కీ సేవిస్తూ వుండగా టెలిఫోన్ గణ....గణ....మ్రోగింది.

రిసీవర్ ఎత్తి "గోపీనాథ్ హియర్" అన్నాడు.

"నమస్కారం కంట్రాక్టర్‌గారూ!"

"ఎవరు?"

"జనార్ధన్."

"నువ్వా?"

"అవును."

"ఏమిటి?"

"నాలుగు రోజులు గడిచిపోయాయి."

"ఐతే?"

"గుర్తు చెయ్యడానికి ఫోన్ చేశాను."

"నేను మర్చిపోతేనే గదా నువ్వు గుర్తు చెయ్యడానికి."

"డబ్బు ఎప్పుడిస్తావు?"

"చూడు జనార్ధన్. నువ్వు చూపించిన ఫోటో ట్రిక్ ఫోటో అనుకుంటాను."

"సురేందర్! పిచ్చిగా వాగకు" కఠినంగా వినిపించింది జనార్ధన్ గొంతు.

"పిచ్చి నాకు కాదు. నీకు. డబ్బుపిచ్చి. కాస్త డబ్బు సంపాదించిన వాడిని చూడగానే కథలల్లి బ్లాక్‌మెయిల్ చేసి లాగడానికి చూస్తారు."

"ఐతే నువ్వు మొండికేశావన్న మాట."

"డబ్బు అంత తేలికగా రాదు మిష్టర్ జనార్ధన్. కష్టపడి సంపాదించిన డబ్బు."

పకపక నవ్వు వినిపించింది.

"ఎందుకు అలా నవ్వుతావు?"

"కష్టపడి సంపాదించిన డబ్బు అని నువ్వు అంటుంటే నవ్వొచ్చింది."

"అలాగే నవ్వుకో...." అని విసురుగా రిసీవర్ పెట్టే

కాడు గోపీనాధ్.

నౌకరు టేబుల్‌మీద డిష్‌లు పెట్టాడు.

జనార్ధన్ గుర్తొస్తే అతనికి భోజనం సహించడంలేదు. ఆవేశం ముంచుకొచ్చేస్తోంది. ఒక్కసారిగా అయిదు లక్షలు ఇవ్వడమా? వీల్లేదని మనసు భీష్మించుకుంది. కాని వీడి పీడ యెలా విరగడ చేసుకోవడం?

గోపీనాథ్ తీవ్రంగా ఆలోచించసాగాడు.

జనార్ధన్ చాలా ప్రమాదకరమైన వ్యక్తి. వాడు అడిగిన డబ్బు యివ్వకపోతే తన పరువు బజారులో పెడతాడు. పోలీసులు తన వెంట పడతారు. పేపరువాళ్ళు లేనిపోని కథలల్లి ప్రచారం చేస్తారు. అవన్నీ ఊహించుకుంటుంటే గోపీనాధ్ వంటిమీద తేళ్ళు జెర్రులు పాకుతున్నట్లు ఫీలయ్యాడు.

3

"గుడ్ మార్నింగ్ సురేందర్!" ఫోన్‌లో జనార్ధన్ గొంతు వినిపించింది.

గోపీనాధ్‌కి కంపరం ఎత్తిపోతోంది. ఇటువంటి డేంజరస్ ఫెలోతో జాగ్రత్తగా వుండాలి అనుకుని రాబోతున్న కోపాన్ని అణుచుకున్నాడు.

"చూడు జనార్ధన్ నన్నా పేరుతో పిలవకు. నా పేరు గోపీనాధ్."

"పాతపేరు. పాతవృత్తి. పాతస్నేహితులు. పాత రోజులు. నీకు అసహ్యంగా వున్నాయి కదూ! అది సహజమే సురేందర్."

"ఏమిటి నీ సతాయింపు? రాత్రేగా ఫోన్ చేశావు. మళ్ళీ ప్రొద్దున్నే తయారయ్యావు."

"తప్పదు సురేందర్. నువ్వు డబ్బు యిచ్చేవరకూ

నిన్ను నీడలా వెంబడిస్తాను. నీ గుండెలో నిద్రపోతాను. నన్ను ఎంత తొందరగా వదిలించుకుంటే అంత మంచిది."

"అట్లాగే జనార్ధన్. సాయంకాలం ఏడు దాటాక మా ఇంటికి రా. నీతో మాట్లాడాలి."

"మాట్లాడడానికా! అదేదో ఇప్పుడే మాట్లాడరాదూ! డబ్బు ఇచ్చేట్లయితే వస్తాను."

"ఎంత మాట్లాడుకున్నా యెదురుగా కూర్చుని మాట్లాడుకున్నది వేరు. తప్పకుండా రా. నీ సంగతి సెటిల్ చేస్తాను."

"సరే."

గోపీనాధ్ ఫోన్ పెట్టేశాడు.

బజర్ నొక్కాడు.

నౌకరు లోపలకు వచ్చి నిల్చున్నాడు.

"నువ్వు వెంటనే వెళ్ళి డ్రైవర్ హుస్సేన్ని నేను అర్జంటుగా రమ్మన్నానని చెప్పి తీసుకురా" అన్నాడు గోపీనాధ్.

నౌకరు తలవూపి నిష్క్రమించాడు.

గోపీనాధ్ అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తూ ఏదో తీవ్రాలోచనలో పడిపోయాడు.

4

"సార్ పిలిచారట" అన్నాడు హుస్సేన్.

"అవును హుస్సేన్! నీతో పని పడింది" అని పెదవుల మీద నవ్వు తెచ్చిపెట్టుకున్నాడు గోపీనాధ్.

"చెప్పండి సార్. చిటికలో చేసేస్తాను" అని చిటికలు వేశాడు హుస్సేన్.

"అనుకోకుండా నా కొక పీడ వచ్చి పడింది. దాన్ని వదిలించుకోవాలి హుస్సేన్. అందుకే నిన్ను పిలి

పించాను."

"ఏమిటి సార్ ఆ పీడ?"

"సాయంకాలం ఏడుగంటలకు నువ్వు ఇక్కడకు వస్తే వాడిని చూపిస్తాను. రెండు రోజుల్లో వాడిని పైకి పంపించే బాధ్యత నీది."

"రెండు రోజులు ఎందుకు సార్! రెండు గంటలు చాలు. లారీ కిందపడి చట్నీ ఐపోతాడు" అని నవ్వాడు హుస్సేన్.

"తొందరపడకు హుస్సేన్. జాగ్రత్తగా వుండాలి. నిదానంగానే చెయ్యి. రెండు రోజులు గడువుంది. పోలీసులు యాక్సిడెంట్ అని నమ్మాలి."

"నమ్మక ఏం చేస్తారు సార్! పైన మీరున్నారుగా!" భావగర్భితంగా నవ్వాడు హుస్సేన్.

"నేనున్నాననుకో. అది వేరే సంగతి. నీ జాగ్రత్తలో నువ్వుండాలి గదా! రోజు లన్నీ మనవి కాదనే సంగతి గుర్తుంచుకోవాలి"

"అలాగే సార్! నేను వెళ్ళొస్తాను."

"వెళ్ళు. సాయంకాలం ఏడుగంటలకు. మర్చిపోకు. వాడు ఇక్కడకు వస్తాడు."

హుస్సేన్ తల వూపి వంగి సలాంచేసి వెళ్ళిపోయాడు.

5

"ఐదు రోజులు గడిచిపోయాయి. ఇంకా రెండు రోజులు మాత్రమే వుంది గడువు" అన్నాడు జనార్ధన్.

"గడువులోపల నీ వ్యవహారం సెటిల్ చేస్తాను" నవ్వాడు గోపీనాధ్.

"ఏమిటో మాట్లాడాలన్నావ్?"

"అవును జనార్ధన్. నువ్వు అడిగిన ఐదు లక్షలు ఇవ్వ

లేను. పైకి సౌండ్‌గా కనిపిస్తున్నానేగాని ఈ మధ్య ఆస్థి కంటే అప్పులు పెరిగిపోయాయి. తీసుకున్న కాంట్రాక్టుల్లో నష్టం, వరుసగా అన్నీ దెబ్బతీశాయి."

"నీ వుద్దేశ్యం ఏమిటో చెప్పు."

"లక్ష రూపాయలిస్తాను. తీసుకుని వెళ్ళిపో" అన్నాడు గోపీనాథ్.

"సురేందర్!" తీవ్రంగా అన్నాడు జనార్ధన్.

గోపీనాథ్ మౌనంగా వుండిపోయాడు.

"న్యాయానికి రోజులు కావని వూరికే అనడం లేదు. నిజానికి కోటి రూపాయలు డిమాండ్ చెయ్యాలి నేను. నీ ఆస్థిలో సగం భాగం రావాలి నాకు. అయినా నేను న్యాయముగా ఐదు లక్షలు అడిగాను. అదివ్వడానికి పెద్దగా బాధ పడిపోతున్నావ్."

"జనార్ధన్. నువ్వనుకుంటున్నట్లు నా దగ్గర కోట్లు మూలగడం లేదు. నష్టాల్లో వున్నానని చెప్పినా వినవేం?"

"నీ మాయమాటలు నమ్మడానికి నేనేం పిచ్చివాడిని కాదు. నీ దగ్గర ఐదు లక్షలు ఎలా రాబట్టుకోవాలో నాకు తెల్సు" కోపంగా అన్నాడు జనార్ధన్.

గోపీనాథ్ దిక్కులు చూస్తూ వుండిపోయాడు.

"రెండు రోజులు గడువు తర్వాత నా గురించి ఏమిటో తెలుసుకుంటావు" అని జనార్ధన్ విసురుగా వెళ్ళిపోయాడు.

గోపీనాథ్ చిన్నగా నవ్వుకున్నాడు.

బజర్ నొక్కాడు.

నౌకరు వచ్చాడు.

"హుస్సేన్ని లోపలకు రమ్మను."

కొంచెం సేపటికి హుస్సేన్ వచ్చాడు.

"చూశావా వాడిని?" ప్రశ్నించాడు గోపీనాథ్.

"చూశాను సార్!" అన్నాడు హుస్సేన్.

"గుర్తుంచుకో."

"ఒక్కసారి చూశానంటే చాలు సార్. ఫొటో తీసినట్టే నా కళ్ళల్లో వుండిపోతాడు సార్!" అన్నాడు హుస్సేన్.

గోపీనాధ్ ఇనప్పెట్టె తెరిచి ఐదువేలు నోట్లు హుస్సేన్‌కి అందించాడు.

"జాగ్రత్తగా పని ముగించాలి. తర్వాత బ్యాలన్సు యిస్తాను."

"అలాగే సార్!" అన్నాడు హుస్సేన్ సంతృప్తిగా నవ్వుతూ.

6

ఆ రాత్రి గోపీనాధ్‌కి నిద్ర పట్టలేదు. విస్కీ మత్తులో గూడా జనార్ధన్ గుర్తుకొస్తున్నాడు. మర్నాడు వర్కు స్పాట్‌కి వెళ్ళినా అతనికి టెన్షన్‌గానే వుంది. 'జనార్ధన్ చావు వార్త వినేవరకూ మనసు అల్లకల్లోలంగానే వుంటుంది' అనుకున్నాడు.

రెండు రోజులు దొర్లిపోయాయి. జనార్ధన్ పెట్టిన గడువు ఈ రోజుతో ఆఖరు. రోజుకంటే ముందుగానే యింటికొచ్చాడు గోపీనాధ్.

"అయ్యా! మీకోసం జనార్ధన్ అట వచ్చారు" అన్నాడు నౌకరు.

ఉలిక్కిపడ్డాడు గోపీనాధ్.

మనసులో అలజడి రేగింది.

"రమ్మను" బొంగురు పోయిన కంఠంతో అన్నాడు గోపీనాధ్.

నౌకరు వెళ్ళిపోయాడు.

కొన్ని క్షణాల తర్వాత జనార్ధన్ వచ్చాడు.

జనార్ధన్ ప్రశాంతంగా కన్పించాడు. అతని ముఖంలో క్రౌర్యం లేదు. వినయంగా నిల్చున్నాడు వంగి. లోగడలా విసురుగా కుర్చీ లాక్కుని కూర్చోలేదు.

గోపీనాధ్‌కి అతని ప్రవర్తన ఆశ్చర్యం గాలిపేలా చేపింది.

"సార్!" అన్నాడు జనార్ధన్ నెమ్మదిగా.

గోపీనాధ్ విస్తుపోతూ చూశాడు జనార్ధన్ వైపు.

"క్షమించండి. పొరపాటు జరిగిపోయింది సార్!" అన్నాడు జనార్ధన్.

"పొరపాటా?....ఏమిటది?" కలవరపడ్డాడు గోపీనాధ్.

"మీరు అచ్చు సురేందర్‌లా వుండడంవల్ల మీరే అతనని పొరపాటు పడ్డాను సార్! మీ ఫొటో పేపర్లో పడడం వల్ల అది చూసి మిమ్మల్ని ఎన్నో మాటలన్నాను. నన్ను క్షమించాలి మీరు" అన్నాడు జనార్ధన్.

గోపీనాధ్‌కి మతిపోయినంత పనయింది.

"మీరు సురేందర్‌ని కానని మొత్తుకుంటున్నా నేను నమ్మలేక పోయాను. అతను అచ్చుగుద్దినట్లు మీలాగే వుంటాడు సార్: మీరు ఫొటోకూడా చూశారుకదా?"

"అది సరే! ఇప్పుడు నిజం ఎలా తెలుసుకున్నావు?" ఆనందంగా అన్నాడు గోపీనాధ్.

జనార్ధన్ నవ్వాడు.

"అసలు సురేందర్ కన్పించాడు సార్."

"ఎక్కడ?"

"వాడు ఈ వూళ్ళోనే వున్నాడు సార్. రాత్రి నేను ఎమ్యూజ్‌మెంట్ పార్కుకి వెళ్ళాను. గడ్డం, మీసాలు పెంచుకుని పిక్కులా కనిపిస్తున్న వ్యక్తి నా చేతిని హఠాత్తుగా పట్టుకున్నాడు. నేను బిత్తరబోతూ అతన్ని చూశాను-

అతను నవ్వి 'జనార్ధన్! నన్ను గుర్తుపట్టావా?' అన్నాడు. నేను యెంత ప్రయత్నించినా గుర్తించలేకపోయాను. 'నేనురా సురేందర్‌ని' అన్నాడు. నా ఆశ్చర్యానికి అంతు లేదు.

సురేందర్ ఆ ఎమ్యూజ్‌మెంట్ పార్కుకి అధిపతి. ఇంకా అతని కొక బార్, రెండు సినిమా థియేటర్లు, జిల్లాలో ఒక సినిమా డిస్ట్రిబ్యూషన్ సంస్థ వున్నాయట. తన ప్రైవేట్ రూమ్‌కి తీసికెళ్ళి అన్నీ చెప్పాడు. నేను జరిగిందంతా చెప్పాను. సురేందర్ జరిగిన పొరపాటుకి చాలా విచారించాడు. నన్ను మీ దగ్గరికి వెళ్ళి జరిగిన పొరపాటుకి క్షమాపణ చెప్పిరమ్మని పంపించాడు."

గోపీనాథ్‌కి చాలా సంతోషం వేసింది.

"కూర్చో జనార్ధన్" అన్నాడు.

జనార్ధన్ ఇబ్బందిగా కూర్చున్నాడు.

"సురేందర్ నీ భాగం నీ కిస్తానని చెప్పాడా?" ప్రశ్నించాడు గోపీనాథ్.

"సురేందర్ ఏమీ మారలేదు సార్! జైల్లో రామిరెడ్డి చనిపోయాడని తెలిసి ఎంతో విచారించాడు. ఈ వూళ్లోనే నన్ను వుండిపొమ్మన్నాడు. ఒక సినిమాహాలు నాకు ఇచ్చేస్తానని అన్నాడు. దాని ఖరీదు ముప్పై లక్షలు చేస్తుందట. సంవత్సరానికి నాలుగైదు లక్షలు నికరాదాయం వస్తుందట" జనార్ధన్ ఎంతో ఉత్సాహంతో చెప్పాడు.

"వెరీగుడ్" అన్నాడు గోపీనాథ్.

"ఇక నేను సెలవు తీసుకుంటాను" అన్నాడు జనార్ధన్.

"దొంగ నిజాయితీపరుడని నీ కథవల్ల తెలుసుకోగలిగాను" అన్నాడు గోపీనాథ్, సంతోషంగా అతడితో కరచాలనం చేస్తూ.

జనార్ధన్ నవ్వి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

గోపీనాధ్‌కి ఇప్పుడు చాలా హేపీగా వుంది. ఆనందంగా బీరు తాగుతున్నాడు. హూస్పేన్ అవసరం ఇకలేదు. అతన్ని వెంటనే రమ్మని నౌకరుతో కబురు చేశాడు.

ఇంతలో రోడ్డుమీద ఏదో లారీ స్పీడ్‌గా పోవడం, 'కెవ్వు'న హృదయ విదారకమైన కేక వినిపించడం, క్షణాలలో కరిగిపోయింది.

గోపీనాధ్ హడావుడిగా వీధిలోకి వెళ్ళాడు. జనం గుంపులు, గుంపులు చేరుతున్నారు.

"డ్రైవర్ పారిపోయాడు" అన్నారు ఎవరో.

ఆ లారీని చూశాడు గోపీనాధ్. తమది కాదు.

గోపీనాధ్ గుంపుని చీల్చుకుని వెళ్ళాడు.

రక్తపు మడుగులో విగతజీవుడై వున్నాడు జనార్ధన్. గోపీనాధ్ నిశ్చేష్టుడైపోయాడు. □

ఈ లెక్కకు జవాబేది?



నగ్నసుందరి ఫోటోలు

కాశీభట్ల భానుమూర్తి

"నీకేమన్నా నమ్మక ముందటరా, శర్మా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"చస్తే లేదు. ఎన్ని ఇంటర్వ్యూలు రాలేదు, మనం యెన్నింటికి వెళ్ళలేదు. అంబ పలికిందా, లేదు. దీనికీ లేదు" అన్నాడు శర్మ.

శర్మ వయస్సు ఇరవై ఐదు సంవత్సరా లుంటుంది.

శర్మకి నా అనేవాళ్ళు లేరు. చిన్నప్పటినుంచి కష్టపడి తన పొట్ట తాను పోషించుకొంటూ, చదువుకొంటుండేవాడు.

శర్మలాంటి పరిస్థితే సుబ్రహ్మణ్యానిదీను. వారాలు చేసుకొంటూ చదువు వెలగబెట్టాడు సుబ్రహ్మణ్యం. ఇద్దరూ బియ్యే పాసయి మూడు సంవత్సరాలు దాటింది. ఇక పైకి చదివే ఓపిక, పెట్టుబడీ ఇద్దరికీ లేవు.

కాలేజీలో మామూలు పరిచయంగా మొదలైన వారి స్నేహం, ఇద్దరూ అనాధ లవటం మూలంగా బలపడి ఇప్పుడు యిద్దరూ ప్రాణస్నేహితులయ్యారు. వాళ్ళు ఇప్పటికి ముప్పై మూడు ఇంటర్వ్యూలకి వెళ్ళారు. ఇది ముప్పై నాలుగో ఇంటర్వ్యూ. ఇదీ పోయిందని తెలిసింది వాళ్ళకి.

"పోనీ, ఎవరినైనా పట్టుకొని రికమండేషన్ కొట్టిస్తే" అన్నాడు శర్మ.

"మా ఆయనే వుంటే మంగలెందుకందట, ఒక ఆవిడ. అలా వుంది. రికమండేషన్ కొట్టించే కెపాసిటీ కనుక మనకు వుంటే ఇక ఈ తిరుగుళ్ళెందుకు. అయినా ప్రభుత్వం మారింది. ఇప్పుడు రికమండేషన్‌లు, ఉత్తర దక్షిణాలు పనిచేయవు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ప్రయివేటు ఉద్యోగాలకి ట్రై చేస్తే" అన్నాడు శర్మ.

"అబ్బె, జీతం తక్కువ. పని ఎక్కువ" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మరి ఎలా, మన భుక్తి గడిచేది? పోనీ ఎవరి జేబన్నా కొడదామా" అన్నాడు శర్మ.

"జేబు కాదు. చాలా రోజులుగా నాకొక ఆలోచన వుంది, దీనితో మన అదృష్టం తిరగబడుతుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఇంతలో ఒక బస్సు సుబ్రహ్మణ్యం పక్కనుంచి దూసుకొని పోయింది. శర్మ చప్పున సుబ్రహ్మణ్యాన్ని ఇవతలికి లాగేసాడు. కాస్తలో తప్పిపోయింది ప్రమాదం, లేకపోతే సుబ్రహ్మణ్యం నజ్జుగుజ్జు అయిపోయేవాడే.

"అదృష్టం తిరగబడుతుందన్నావు, ఇదా! నేను కనుక చూడకపోతే నిజంగానే నీ అదృష్టం తిరగబడేదే" అన్నాడు శర్మ.

"హూ! నిరుద్యోగి అంటే బస్సు డ్రయివర్లకి కూడా అలుసు కాబోలు. అయినా రోడ్డుమీద నడుస్తూ, అంత మంచి అయిడియా నీకు చెప్పటమేమిటి, దా అలా ఓవర్ బ్రిడ్జి మీద కూర్చొని మాట్లాడుకొందాము" అన్నాడు సుబ్రహ్మణ్యం.

ఇద్దరూ ఓవరు బ్రిడ్జిమీద కూర్చొన్నారు. తణుకు ఓవర్ బ్రిడ్జిమీద సాధారణంగా ఎవరూ వుండరు. ఇప్పుడుగూడా యెవరూ లేరు. ఉండి వుండి బస్సో, లారీయో వెడుతున్నాయి తప్ప. ఆ ప్రదేశం అంతా నిర్మానుష్యంగా వుంది. దూరంగా స్టేషన్‌లోంచి ప్యాసింజరు బండి లైటు మాత్రం కనపడుతోంది.

"ఇక చెప్పు ఏమిటి నీ అయిడియా" అన్నాడు శర్మ.

"ఎన్ని ప్రభుత్వాలు మారినా, యెందరు మంత్రులు మారినా ఈ నిరుద్యోగ పిశాచిని రూపు మాపలేరెవ్వరూ. ఒకవేళ మనకి ఉద్యోగం వచ్చినా నెలకి ఏ ఐదువందలో, ఆరువందలో తప్ప మన చేతికి రావు" అన్నాడు ఉపోద్ఘాతంగా సుబ్రహ్మణ్యం.

"ఆ! అందుకని ఏ బ్యాంకన్నా కొల్లగొడదామంటావా" అన్నాడు శర్మ.

"ఆ! అదే నేను చెప్పేది. బ్యాంకుని కొల్లగొట్టి, ఆ డబ్బుతో సుఖంగా జీవించవచ్చు. ఇక చచ్చేదాకా దొంగ తనాలు చేయక్కర్లేదు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అవును! ఇక చచ్చేదాకా దొంగతనాలు ఎలా చేస్తాం, జైల్లో వుంటాముగా" అన్నాడు శర్మ.

"ఛ! అపశకున పక్షి. శుభం పలకరా మంకెన్నా అంటే పెళ్ళికూతురు ముండేది, అన్నాడట నీలాంటి చవట ఒకడు" అన్నాడు చిరాగ్గా సుబ్రహ్మణ్యం.

"లేకపోతే నీ ప్లాను ఏమిటి, బ్యాంకు దోపిడీ చేసి, దొరికితే పోలీసులు జైల్లో పెట్టక, సన్మానం చేసి, 'బ్యాంకు ఛోరసార్వభౌమా' అని బిరుదు ఇచ్చి సత్కరిస్తారను కొన్నావా" అన్నాడు శర్మ.

"బ్యాంకుని కొల్లగొట్టి దొరికితేగా నువ్వన్నట్టు జరిగేది. నేను వేసినది చచ్చు పుచ్చు దోపిడి ప్లానుగాదు. నేను ప్లాను వేసాక చేసిన దొంగతనం నూటికి నూరుపాళ్ళు సక్సెస్ అవుతుందన్న నమ్మకం నాకుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఆ నమ్మకం నీకుండగానే సరా, పోలీసులకి వుండ వద్దూ" అన్నాడు శర్మ.

"ఛస్, ప్లాను వినకుండానే, వెధవ వాగుడూ నువ్వూ" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"చెపద్దన్నా మానతావా, చెప్పేడువు" అన్నాడు శర్మ.

ఒకసారి దగ్గి గొంతు సవరించుకొన్నాడు సుబ్ర హ్మణ్యం. సుబ్రహ్మణ్యం గొంతుతోపాటు తనూ గొంతు కలిపింది పాసింజరు రైలు. ఆ రైలు వెళ్ళేదాకా ఆగి చెప్పసాగాడు.

"దోపిడీ అను, దొంగతనం అనూ, ఎవరూ మనతో

కలవరు. మన మిద్దరమే. రెండు నకిలీ పిస్తళ్లు రెడీచేసి వుంచాను. శనివారం పన్నెండు దాటితే బ్యాంకులో కష్టమర్లు యెవ్వరూ వుండరు. మనం సరిగ్గా పన్నెండు గంటలు కొట్టేటప్పటికి బ్యాంకులో అడుగుపెడతాము. నేను ఏజంటుని కొందరు స్టాఫ్‌ని కవరుచేస్తాను నా పిస్తోలుతో. నువ్వు కాషియర్ దగ్గరికి వెళ్ళి నీ రివాల్వరు చూపించి డబ్బు మొత్తం నీ సంచీలో సర్దేయమను. కిక్కురుమనకుండా డబ్బు సర్దేస్తాడు. నువ్వు వెళ్ళి బయట వుండు, నేను వాళ్ళని కవరుచేస్తూ బయటికి వస్తాను. అప్పుడు యిద్దరూ కలసి పారిపోవచ్చు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"వింటానికి బానే వుంది కాని, జరుగుతుందా ఇది. బ్యాంకు దొంగతనం యింత సులభమవుతే, నిరుద్యోగులంతా దేశములోని తలొక బ్యాంకు చూసుకొంటే డిఫనెటుగా లక్షాధికారులవటం ఖాయం" అన్నాడు శర్మ ఆశ్చర్యంగా.

"వింటానికే కాదు, జరిగిగూడా తీరుతుంది చూడు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"జరగచ్చు, నేను కాదనను. బ్యాంకు ఉద్యోగులు అసమర్థులు కారు. పైగా ముందు మనం దోచుకుపోయినా, నాలుగైదు రోజులలో పోలీసులు పట్టుకొని మనని సన్మానించటం ఖాయం" అన్నాడు శర్మ.

"వైట్‌కాలర్ జాబ్‌లకి అలనాటు పడినవాళ్ళు మానసికంగా బలవంతులే కాని, శారీరకంగా బలవంతులు కారు. కనుక మనకా భయం లేదు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఏమో. జరిగేదాకా నమ్మకం లేదు" అన్నాడు శర్మ.

"ఛీ, ఛీ నీలాంటివాడిని తోడుగా కలుపుకొంటే, బ్యాంకు నుంచి డబ్బు కాదుగదా, విత్‌డ్రాయల్ ఫారాలు

గూడా తీసుకొని రాలేం" అన్నాడు చిరాగ్గా సుబ్రహ్మణ్యం.

"కోపగించుకోకు సుబ్బీ, ఊరికే అనుమానాలు వుంటే అడిగా, ఇంతకీ యెప్పుడు పెట్టావు ఆ దుష్టముహూర్తం" అన్నాడు శర్మ.

"నువ్వు మనస్ఫూర్తిగా కలుస్తావా, నాతో" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"కలవక తప్పదుగా, ప్రాణ స్నేహితులమైనందుకు. నీవు బ్యాంకుని కొల్లగొట్టి లక్షాధికారివి అవుతే, నేనూ కావద్దూ" అన్నాడు శర్మ.

"అయితే ఇంకేం ఆలస్యం. జులై 13వ తారీఖు శని వారం. ముహూర్తం బావుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

2

"అదే బ్యాంకు" అన్నాడు సుబ్రహ్మణ్యం, దూరాన్నుంచే శర్మకి తాము దొంగతనం చేయబోయే బ్యాంకు చూపుతూ.

పొద్దున ఆరింటనుంచి ఇప్పటిదాకా ఇరవైసార్లు రిహార్సల్స్ వేసుకొన్నారు సుబ్రహ్మణ్యం, శర్మలు. ఎలా మెసలుకోవాలి ఎలా పారిపోవాలని. శుక్రవారం నాడే అన్ని గుళ్ళూ తిరిగి కనపడిన దేవుడికల్లా మొక్కుకున్నారు. ఆంజనేయస్వామిని తలచుకొని ముందడుగు వేసారు సుబ్రహ్మణ్యం, శర్మాను.

గేటు దగ్గరే ఆపేసాడు బ్యాంకు వాచ్‌మన్ "టైమ్ అయిపోయిందంటూ."

"అబ్బే, మేము ఏజంటుగారితో అర్జంటుగా మాట్లాడాలి" అని ఇద్దరూ కలసి లోపలకి వెళ్ళారు. ఇంక ఎలాగో కష్టమర్లు ఎవ్వరూ రారు కనుక టీ తాగటానికి 'రాధాకృష్ణా హోటలు'కి పోయాడు బ్యాంకు వాచ్‌మన్.

అనుకొన్న ప్రకారం ఏజంటుని, మిగిలిన స్టాఫ్‌ని సుబ్రహ్మణ్యం కవరుచేసాడు. క్యాషియర్ దగ్గర పిస్తోలు పట్టుకొని ధైర్యంగా, ఠీవిగా నిలబడ్డాడు శర్మ. క్యాషియర్ డబ్బంతా శర్మ ఇచ్చిన సంచిలో సర్దేసాడు.

ముందు శర్మ డబ్బు సంచీతో బయటపడ్డాడు. ఆ తరువాత సుబ్రహ్మణ్యం బయటికి వస్తుంటే ఏజంటు కులకర్ణి ఒకతాపు తన్నాడు సుబ్రహ్మణ్యాన్ని. అసలే డబ్బు వచ్చిందన్న ఆనందంతో వున్న సుబ్రహ్మణ్యం ఈ వెనకపాటు దెబ్బ నుంచి కాచుకోలేక పోయాడు. కులకర్ణి కొట్టిన దెబ్బకి బొక్క బోర్లా పడ్డాడు. చేతిలోవున్న నకిలీ పిస్తోలు ఆ అదటుకి విసురుగా వెళ్ళి గుమ్మానికి తగిలి టంగ్‌మని శబ్దం చేస్తూ కిందపడిపోయింది. మిగిలిన స్టాఫ్ సుబ్రహ్మణ్యం మీద పడిపోయి గట్టిగా పట్టేసుకొన్నారు.

ఈ లోపల ఈ 'టంగ్' మన్న శబ్దానికి ఏమి జరిగిందా, అని వెనక్కి తిరిగి చూసిన శర్మకి, అందరూ కలిపి సుబ్రహ్మణ్యాన్ని పట్టుకోవటం కనబడింది.

వెనక్కి తిరిగి సుబ్రహ్మణ్యాన్ని విడిపించటమా, ముందుకు పారిపోవటమా అని ఆలోచించుకొని, వెనక్కి వెళ్ళి చేతిలో పిస్తోలు వుంది కాబట్టి సుబ్రహ్మణ్యాన్ని విడిపించటయే మంచిదని తలచి, భుజంమీద సంచిని గట్టిగా బట్టుకొని, వెనక్కి తిరిగి గుమ్మం దగ్గరికి వచ్చి, "హేండ్సప్" అన్నాడు శర్మ.

అందరూ సుబ్రహ్మణ్యాన్ని వదిలి లేవబోతున్నారు. ఈ లోపుల శర్మ బంతిలా దొర్లుకుంటూ వచ్చి సుబ్రహ్మణ్యం మీద పడ్డాడు. సుబ్రహ్మణ్యం అప్పుడే లేవబోతున్నాడు, శర్మ వచ్చి పడేసరికి మళ్ళీ కూలబడ్డాడు.

శర్మ వెనక్కి తిరిగి తనని తన్నిందెవరా అని చూస్తే,

ఎదురుగా 'గబ్బర్ సింగ్'లా నవ్వుతూ నిలుచున్న వాచ్ మెన్ కనిపించాడు.

శర్మని, సుబ్రహ్మణ్యాన్ని కట్టి పడేశారు బ్యాంకు స్టాఫ్. ఏజంటు కులకర్ణి పోలీసులకి ఫోన్ చేసాడు.

గట్టిగా కట్టేసినందుకు బ్యాంకు స్టాఫ్‌ని తిట్టుకొంటూ గింజుకొంటున్నాడు సుబ్రహ్మణ్యం.

"ఛ, ఛ నీవల్లే వచ్చింది ఇదంతా" అన్నాడు బాధగా శర్మ.

"ఏం, కాదు, నీవల్లే వచ్చింది. అపశకున పక్షిలా కూసావు ముందే దరిద్ర గొంతు పెట్టుకొని. తప్పదుగా నోటి మహిమ" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ప్లాను అలా ఏడిపించింది. అదృష్టం ఇలా కాలింది" అన్నాడు శర్మ.

"ప్లాను బాగానే వుంది. దానిని నెరవేర్చే చాకచక్యం నీకుండొద్దు. వెనకి నుంచి వాచ్‌మన్ తన్నుతుంటే, తన్నించుకోవటమే" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మరి నీ సంగతేమిటి. వాచ్‌మన్ చేత తన్నులు తిన ద్దొని నాకు చెప్పి ఏజంటు కులకర్ణి చేత తన్నులు నువ్వు తింటావా" అన్నాడు శర్మ.

సుబ్రహ్మణ్యం దవడ కండరం బిగుసుకొంది. గుర్రుగా శర్మవైపు చూసాడు సుబ్రహ్మణ్యం. ఒక సాలీడు సుబ్ర హ్మణ్యం గుర్రు శబ్దానికి స్థానభ్రంశం చెంది సురక్షిత స్థానాన్ని వెదుక్కొంటూ బయలుదేరింది. సుబ్రహ్మణ్యం చూపుల్లోంచి తన చూపుల్ని తప్పించి భూమి ఆకాశం కల పిన చోటువైపు చూడసాగాడు శర్మ.

ఇంతలో పోలీసులు బిలబిలమంటూ వచ్చేసారు. ఏజం టుని అడిగాడు సంగతేమిటని ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

ఏజంటు తెలుగు సినిమాకథ చెప్పినంత సులభంగా బ్యాంకు దోపిడీ కథ చెప్పాడు. బ్యాంకు స్టాఫ్‌గూడా వంతపాడారు. దొంగలు అక్కడే వున్నారు. సొమ్ము వుంది. ఇంకేం "అరెస్టు" అని అరిచాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్. అతను అరవటానికి అరగంటముందే బేడీలు వేసేసాడు ఎస్సై ముకుందరావు. జీపెక్కించారు సుబ్రహ్మణ్యాన్ని, శర్మని.

జీపు బయలుదేరింది. దారిలో గేదెలు అడ్డం వచ్చాయి. "ఛీ ఛీ దరిద్రపు గేదెలు. ఈ తణుకులో ఈ గేదెలు నడి రోడ్డుమీద తిరుగుతుంటే పట్టించుకొనేవారేలేరా" అన్నాడు ఎస్సై ముకుందరావు. జీపు ఆగిపోయింది.

"ఎవరు పట్టించుకొంటారు, మనమే పట్టించుకోవాలి. అయినా గేదెలని తిడతావేం. తెల్లారిలేస్తే వాటి పాలు తాకుండా వుండగలవా?" అన్నాడు యినస్పెక్టర్ శశి కాంత్.

ఇనస్పెక్టర్ శశికాంత్ వేసిన జోక్‌కి అందరూ నవ్వారు. నవ్వుతూ వెనక్కి తిరిగి చూసిన యినస్పెక్టర్ శశికాంత్ మొహం వాడిపోయింది. వెనక సుబ్రహ్మణ్యం, శర్మా ఇద్దరూ లేరు. ఆశ్చర్యంతో పోలీసులు నోళ్ళు వెళ్ళ బెట్టారు.

3

"మిమ్మల్ని ఎందుకు పోలీసుల చేతుల్లోంచి తప్పించానో తెలుసా" అన్నాడు దారాసింగ్. అతని అసలుపేరు శంక ర్రావు.

సుబ్రహ్మణ్యం. శర్మలలాగే శంకర్రావుకూడా నిరు ద్యోగే. ఉద్యోగం దొరక్క సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ క్రింద ఈ దొంగతనాలు చేయిస్తున్నాడు. అతని చేతిక్రింద పదిమంది వున్నారు. శంకర్రావు ఇన్‌ఫర్మేషన్

పట్టుకొచ్చి యెవరెవరు ఏం చేయాలో చెబుతాడు. యెవరి కిచ్చిన పని వాళ్ళు చేసి డబ్బుతెచ్చి శంకర్రావు కిస్తారు. అందులోంచి న్యాయంగా తనకి రావలసిన వాటా తాను తీసుకొని ఎవరి డబ్బు వాళ్ళకి అందచేస్తాడు శంకర్రావు.

కొందరికి స్మగ్లింగ్ పని, కొందరికి బ్లాక్ మెయిల్ పని, మరికొందరికి దోపిడీ పని. ఇలా యెవరికి ఏ పని సులభంగా వస్తుందో ఆ పనివారిచేత చేయిస్తాడు శంకర్రావు. వాళ్ళు గూడా శంకర్రావు చెప్పిన పని తుచా తప్పకుండా పాటిస్తూ శంకర్రావుకే కాక, తోటిదొంగలకి గూడా ఆదర్శ ప్రాయముగా మెలుగుతున్నారు. ఆ విధంగా శంకర్రావు పని మూడు బ్లాకుమెయిల్లూ ఆరు స్మగ్లింగ్‌లుగా వుంది.

"చెప్పందే మాకెలా తెలుస్తుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నేను మీవంటి దొంగనే కాని నేను దొంగలకి నాయకుడ్ని" అన్నాడు శంకర్రావు.

"ఆ సంగతి మొహం చూడగానే తెలిసింది. కాని మాకు తెలియాలిసింది మమ్మల్ని యిక్కడికి యెందుకు పోలీసుల చేతిల్లోంచి తప్పించుకొని తీసికొని వచ్చారని" అన్నారు శర్మ.

"అదే చెబుతున్నా, మీ సిన్సియారిటీ నాకు నచ్చింది. మీరు ఓవర్ బ్రిడ్జిమీద ప్లానువేయటం దగ్గరనుంచి నాకు తెలుసు. అందుకే పోలీసుల చేతిల్లోంచి మిమ్మల్ని గేదెల సాయంతో విడిపించా" అన్నాడు శంకర్రావు మళ్ళీ.

"అదిసరే. అసలు మమ్మల్ని తీసుకొచ్చిన పనేమిటని?" అన్నాడు శర్మ విసుగ్గా.

"ఏయ్! బాస్‌తో తిన్నగా మాట్లాడలేవు" అన్నాడు శంకర్రావు అనుచరుడు.

"నీ బొంద, బాసు నీకుగాని మాకు కాదుగదా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అదే, నేను మీకు బాసుగా వుందామనుకొంటున్నాను" అన్నాడు శంకర్రావు.

"నీ ఇష్టమే నేమిటి?" అన్నాడు శర్మ.

"అయినా అదేం కోరిక నీకు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అనవసర ప్రసంగం కట్టిపెట్టి చెప్పింది వినండి. మీరు నాతో కలిస్తే మీరు సంపాదించిన దాంట్లో ఫిఫ్టీ మీకు, ఫిఫ్టీ నాకు" అన్నాడు శంకర్రావు.

"బాగానే వుంది, మేం సంపాదించిన దాంట్లో సగం నీకా" అన్నాడు శర్మ.

"ముష్టిలో ముష్టి వీరముష్టిలా వుంది నీ పని" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ప్లాను నాది, వర్కు మీది, తెలివి నాది, పని మీది" అన్నాడు శంకర్రావు.

"ఆః ఈ సుబ్బిగాడు వేసిన ప్లానుతో పోలీసుల చేతికి చిక్కాం, ఇక నువ్వేసే ప్లానుతో ఏ యములాళ్ళ చేతికో చిక్కుతాం" అన్నాడు శర్మ.

శర్మవైపు గుర్రుగా చూసాడు సుబ్రహ్మణ్యం. అతని దవడ కండరం బిగుసుకొంది. శర్మ అతని చూపుల్ని పట్టించుకోలేదు.

"మా బాసు ప్లాను వేస్తే దానికి తిరుగులేదు" అన్నాడు అనుచరుడు.

"నేను మీకు పని చెబుతాను, చేస్తారాలేదా" అన్నాడు శంకర్రావు.

"ఏం, పని ముందు చెప్పు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఏం, నీకు నీ మనుషులు సరిపోరా" అన్నాడు విసుగ్గా శర్మ.

"నా మనుషులు సరిపోక కాదు. మీ బ్యాంకు దోపిడీ చాకచక్యం చూశాను. మీకు అనుభవంలేదు. కొంతకాలం బ్లాక్‌మెయిలింగ్‌లో అనుభవం గడించాక, మీకు బ్యాంకు దోపిడీ, వజ్రాల దొంగతనాలు చెబుతాను. నా మనుషులను చాలాసార్లు వుపయోగించాను కనుక ఈ తణుకులో ప్రజ లందరికీ నా అనుచరుల గురించి తెలుసు. పోలీసు రికార్డుల్లో కూడా వీళ్ళ పేర్లు ఉన్నాయి. అందుకే కొత్త ముఖాల కోసం చూస్తుంటే మీరు తగిలారు. నేను పార్టీని బెదిరించటం అన్నీ జరిగిపోయాయి. ఇవాళ రాత్రి పది గంట లకి మీరు ఈ ఫోటోలు తీసుకొని వెళ్ళి, పార్టీ ఇచ్చే డబ్బు తేవాలి. జాగ్రత్త! పోలీసుల వాసన తగిలిన మరు క్షణం అక్కడ వుండొద్దు నెగటివ్‌లు, ఫోటోలు జాగ్రత్తగా ఇచ్చి, డబ్బులు తెండి, ఆ మరిచా ఒక కోడ్ వర్డ్ వుంది. వాళ్ళు 'ఓవర్ బ్రిడ్జి తణుకుకే అందం' అంటారు, మీరు 'పిండాల చెరువు కాకినాడకే వన్నె' అనండి. గుర్తుందిగా రాత్రి పదిగంటలకి, ఓవర్ బ్రిడ్జి మీద. జాగ్రత్తగా మసలుకోండి" అని ఫోటోలు యిచ్చాడు శంకర్రావు.

"సరే, ఓకే, మరి మా వాటా ఎంత? అవతలివాళ్ళు ఎవరు?" అన్నాడు శర్మ.

"అవతలివాళ్ళు యెవరో మీకు అనవసరం. మీ వాటా పదివేలు. సూటుకేస్ నా కిచ్చిన మరుక్షణం మీకు పదివేలు యిచ్చేసి, మరొక పని యిస్తాను" అన్నాడు శంకర్రావు.

4

"ఇప్పుడు మనం జాగ్రత్తగా ప్రవర్తిస్తే లక్షలు సంపాదించవచ్చు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఎలా, ఈ డబ్బు కొట్టేసా" అన్నాడు శర్మ.

ఇద్దరూ ఓవర్ బ్రిడ్జి దగ్గరకు వెళ్ళటం. కోడ్ వర్డ్ చెప్పి ఫోటోలు యిచ్చి, డబ్బు సంపాదించటం జరిగిపోయాయి. ఇద్దరూ మళ్ళీ శంకర్రావు వుండే స్థలానికి వస్తున్నారు.

"అబ్బే, ఈ డబ్బు యిచ్చేసి. మన పదివేలు మనం తీసేసుకొంటాం నేను వాళ్ళకి ఫోటోలు ఇచ్చేటప్పుడు, ఒక ఫోటో కాజేసాను.అందులో ఒక అమ్మాయి నగ్నంగా వుంది. ఆ ఫోటో యిచ్చేస్తామని చెప్పి ఒక పాతికవేలు అడుగుదాం. ఇచ్చితీరుతారు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మరి వాళ్ళ ఎడ్రసు యెలా తెలుస్తుంది?" అన్నాడు దిగులుగా శర్మ.

"ఎలా, ఏమిటి? ఆ అమ్మాయి ఫోటో మన దగ్గర వుందిగా. తణుకు అంతా వలవేద్దాం. బీదవాళ్ళు, మధ్య తరగతివాళ్ళూ కాదు. ధనవంతులూ, ఒక మాదిరిగా హెచ్చు మధ్యతరగతివాళ్ళను గమినించాను. ఈ సూటు కేస్‌మీద 'గోల్‌మాల్' బట్టలకొట్టు లేబిల్ చూసావా? అంటే ఆ అమ్మాయి తండ్రి ఆ షాపు ఓనరు అయి వుంటారు. ముందు ఆ దారిలో ప్రయత్నిద్దాం" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మరి లక్షలు వస్తాయి అన్నావు, పాతికవేలే లెక్క చెప్పావు" అన్నాడు శర్మ.

"చెబుతా మనం బ్యాంకికి వెళ్ళేముందే నేను పిస్తోలు శబ్దాలు రికార్డు చేసిన టేప్‌రికార్డర్ తెచ్చా గుర్తుందా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఆ, గుర్తులేకేం. దాని అవసరం లేదు గదా, మళ్ళీ ఆ పాకెట్ టేప్‌రికార్డర్ ఎక్కడ నుంచి అద్దెకి తెచ్చావో అక్కడ యివ్వలేదా, కొంపతీసి" అన్నాడు శర్మ.

"ఛీ! అదికాదు, విను. మనని శంకర్రావు పట్టుకెళ్ళి నప్పుడు ఆది నా జేబులోనేగా వుంది. వెంటనే శంకర్రావు మాటలు రికార్డు చేసా. ఇప్పుడు పోలీసులకి ఆ కేసెట్ యిస్తానని చెప్పి, శంకర్రావు ద్వారా, లక్షో రెండున్నర లక్షలో యిమ్మనవచ్చు. చచ్చినట్టు యిస్తాడు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"చచ్చినట్టు యిస్తాడా, మనల్ని చంపుతాడా" అన్నాడు శర్మ.

"ఇచ్చితీరుతాడు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఏమని బెదిరిద్దాం ఆ శంకర్రావును...." అన్నాడు శర్మ.

"ఒరే శంకర్రావు, నీ మాటలు కేసెటు యింటిదగ్గర వుంది. ఇప్పుడుగాని, మాకు మేం అడిగిన రెండు లక్షలు యివ్వకపోయావా, ఆ కేసెట్టు మా మనిషి పోలీసులకి ఇస్తాడు. మేం యిక్కడ నుండి ఆరు గంటలలోగా వెళ్ళక పోతే, ఆరుగంటల ఐదునిముషాలకి పోలీసుల చేతిలోన చిలకపలుకుల కేసెట్టు వుంటుంది. ఇప్పటిదాకా పెద్ద మనిషిగా చెలామణి అయిన నీ బతుకు బట్టబయలవుతుంది" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నమ్ముతాడా, ఆ సచ్చినోడు" అన్నాడు శర్మ.

"మరి నే చదివిన అన్ని పుస్తకాల్లోను ఇలా బెదిరిస్తే అలా డబ్బులొచ్చేవి, బెదిరించిన వాళ్ళకి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మరి యింక ఆలస్యం ఎందుకు,నడు,"అన్నాడు శర్మ.

ఇద్దరూ శంకర్రావు దగ్గరకి వెళ్ళి సూటుకేస్ యిచ్చి, వాళ్ళకి రావలసిన పదివేలు తీసుకొని, ముందు ఎలా బెది

రిద్దామనుకొన్నారో అలానే బెదిరించారు.

ముందు శంకర్రావు ఖంగుతిన్నాడు. ఆ తరువాత "రేపు రండి, డబ్బు యిస్తాను" అన్నాడు. "ఇవ్వకేం చేస్తాడు. చస్తాడా, బ్రదర్. ఉప్పరికార్డరుతో వాడి లెదరు వలిచే లాంటి మాటన్నాం" అని చంకలు గుద్దుకొంటూ 'గోల్ మాల్' షాపుకి వెళ్ళి, ప్రొప్రాయిటరుకు ఫోటోల విషయం చెప్పి, పాతికవేలు యివ్వమన్నారు సుబ్రహ్మణ్యం, శర్మలు. ఆ ఫోటోలోని నగ్నసుందరి ఆయన కూతురేనని ముందుగానే నిర్ధారణ చేసుకున్నారు.

'రేపు రమ్మన్నాడు' ఆ వ్యక్తి బెదురుగా.

మర్నాడు యిద్దరూ వెళ్ళి ఫోటో యిచ్చేసి, గోల్‌మాల్ బట్టల కొట్లో ప్రొప్రయిటరు నుంచి పాతికవేలు తీసుకొన్నారు సుబ్రహ్మణ్యం, శర్మలు.

ఆ ఆనందంతో హుషారుగా శంకర్రావు దగ్గరకి వెళ్ళారు ఇద్దరూ.

"ఇది మీకు న్యాయం కాదు. నన్ను ఇలా బెదిరించకూడదు" అన్నాడు శంకర్రావు.

"అదేమన్నా రూలా, నోరు మూసుకొని డబ్బియ్యి" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఇవ్వకుండా, నా అనుచరులతో మిమ్మల్ని తన్నిస్తే యెలా వుంటుందని ఆలోచిస్తున్నాను" అన్నాడు శంకర్రావు.

"తన్నించి చూడు, మా తడాఖా తెలుస్తుంది" అన్నాడు శర్మ ధీమాగా.

"మేం కనుక డబ్బు తీసుకొని యిక్కడ నుంచి వెళ్ళకపోతే, మరొక అరగంటలో ఆ కేసెట్టు మా మనిషి

పోలీసులకి యిస్తాడు'' అన్నాడు సుబ్రహ్మణ్యం.

'ఇక తప్పేటట్టు లేదు' అనుకొని డబ్బుతీసి సుబ్రహ్మణ్యం చేతికి అందించబోతుంటే, పోలీసు విజిల్ వినిపించింది. అందరూ కంగారుపడుతుంటే పోలీసులు లోపలికి వచ్చేసారు. వారి వెనుక గోల్‌మాల్ షాపు అతను వచ్చాడు.

సుబ్రహ్మణ్యానికి, శర్మకి, శంకరావుకి, అతని అనుచరులకి బేడీలు వేసారు ఇన్‌స్పెక్టర్ శశికాంత్, ఎస్సై ముకుందరావులు.

ఎలా తెలిసిందా పోలీసులకి అని చూస్తున్నారు అందరూ.

ఇన్‌స్పెక్టర్ శశికాంత్ దగ్గి గొంతు సవరించుకొని ఇలా చెప్పసాగాడు:

''మీరు ఫోటో తీసుకొని గోల్‌మాల్ షాపుకి వచ్చి ఆ యజమానిని బెదిరించినపుడే, ఆ షాపు యజమాని మాకు ఫోన్ చేసి చెప్పాడు మిస్టర్ సుబ్రహ్మణ్యం, శర్మా. ముందు ఒక బ్లాక్‌మెయిలర్‌కి డబ్బు యిచ్చి, ఆ ఫోటోలు విడిపించుకొన్నాట్ట రాత్రి పదిగంటలకి! మళ్ళీ మీరు వచ్చి 'ఒక ఫోటో మా దగ్గర వుంది. పాతికవేలు ఇవ్వ'మన్నారు. ఇలా ఇస్తూవుంటే ఇంక ఇలా అడుగుతూనే వుంటారు'' అని మాకు చెప్పాడు ఆ యజమాని.

'సరే. డబ్బులకోసం రేపు వస్తారు కదా వాళ్ళు. మేం మీ షాపు దగ్గర కాపుకాసి పట్టుకొంటాం,' అని వారికి హామీ ఇచ్చాం.

అదేమాదిరిగా మేం మీ కోసం షాపుబయట దూరంగా

కాపు వేషాం. మీరు వచ్చి డబ్బు పట్టుకెళ్ళగానే ఆ షాపు యజమాని మాకు కను సైగ చేసాడు. అప్పుడే మిమ్మల్ని పట్టేద్దామనుకొన్నాను. కాని మీ వెనుక వున్న ముఠా గురించి తెలుసుకొందామని, మీ దగ్గర యింకా యేవన్నా ఫోటోలు వున్నాయో తెలుసుకుందామని మిమ్మల్ని ఫాలో అయ్యాం. మీ వునికి తెలిపింది, పట్టేసాం" అన్నాడు ఆనందంగా.

"ఎన్నాళ్ళనుంచో దొరక్కుండా పెద్దమనిషిలా తిరుగుతున్న ఈ శంకరావు కూడా మీ మూలంగా దొరికాడు" అన్నాడు ఎస్సై ముకుందరావు.

"ప్లాను ప్లాను అన్నాం, ఇప్పుడు చూడు జైల్లో కూర్చొని నీవు వస్తాయన్న లక్షలకోసం తపస్సు చేద్దాం" అన్నాడు శర్మ.

"నీలాంటి అపశకునపక్షిలాంటి స్నేహితుడు నా పక్కనుంటే చెప్పాగా లక్షలు కాదు లెక్క పెట్టాల్సింది మనం, జైలు ఊచలు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నమ్మకద్రోహం చేసారు మీరు. హాయిగా నా కింద పని చేయండిరా, అంటే నన్నే ముంచారు" అన్నాడు బాధగా శంకర్రావు,

శంకర్రావు అనుచరులు గుర్రుగా సుబ్రహ్మణ్యంవైపు, శర్మవైపు చూడసాగారు.

"నమ్మకద్రోహమో, అతితెలివో పోలీసు స్టేషన్లో తెలుసుకోనచ్చు. నడవండి పోలీస్‌స్టేషన్‌కి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ శశికాంత్.

అందరినీ ఎక్కించుకొని వేన్ భారంగా కదిలిపోయింది పోలీస్‌స్టేషన్ వైపు. □

శ్రీవాలి దోపిడి

కె వి రమణ

విశాఖపట్నం—విజయనగరం ఎక్స్‌ప్రెస్ బస్ విశాఖపట్నం విడిచి అరగంట గడిచింది. అమావాస్య రాత్రి. కుండపోతగా వర్షం సమయం పది గంటలు.

వర్షం నీరు రోడ్డు కిరువైపులా వాగు మాదిరి ప్రవహి

స్తోంది. హెడ్‌లైట్ల వెలుతురులో ఏకదీక్షగా బస్సు నడుపుతున్నాడు డ్రైవరు. ఫ్రంట్ అద్దాలమీద ఏకధాటిగా పడుతున్న నీటి తెరలను తుడుస్తూ అద్దాలకు బిగించివున్న వైపర్సు నిర్విరామంగా పని చేస్తున్నాయి.

బస్ మధురవాడ దాటి ముందుకు పరుగు తీస్తోంది. రోడ్డుకు ఇరువైపులా వున్న రాక్షసుల్లాంటి పర్వతాలు వుండుండి తళుక్కుమనే మెరుపు వెలుగులో విచిత్రంగా అగుపిస్తున్నాయి.

వర్షంనీరు లోనికి రాకుండా అద్దాలను పూర్తిగా మూసేశారు. ఒకటో అరో తప్ప దాదాపుగా సీట్లన్నీ నిండి పోయాయి. ప్రయాణీకులు ప్రక్కవాళ్ళతో బాతాఖానీలో పడ్డారు. బస్‌లో సగానికి పైగా ప్రయాణీకులు పెళ్ళిళ్ళకు సంబంధించి ప్రయాణం చేస్తున్నవారే!

వర్షాన్ని చీలుస్తూ శరవేగంతో ముందుకు పోతోంది ఎక్స్‌ప్రెస్. తదేకంగా రోడ్డునే గమనిస్తూ బస్సు నడుపుతున్న డ్రైవరు రోడ్డుప్రక్కగా వినపడిన పెద్ద చప్పుడుకు వులిక్కిపడుతూ బ్రేకు వేసేందుకు వుద్యుక్తుడయ్యాడు. కానీ ఆ సరికి జరగాల్సింది జరిగిపోయింది.

బ్రహ్మాండమైన కొండరాయి ఒకటి దడదడ శబ్దంచేస్తూ కొండ పైనుండి దొర్లి ఎక్స్‌ప్రెస్‌ను ముందు భాగంలో ఢీ కొన్నది. ఆ తాకిడికి బస్సు మొత్తం తలక్రిందులవుతూ రోడ్డు ప్రక్కగా సుమారు ఇరవై అడుగుల పల్లంలోకి జారి పోయింది.

ప్రయాణీకులకు ఏదీ అర్థం కాకమునుపే అంతా జరిగి పోయింది. ఏదో పిడుగు అమాంతం తమ బస్సుపై పడినట్టుగా, భూకంపం సంభవించి తామంతా పాతాళానికి దిగి

పోతున్నట్టుగా భావించి వారంతా భయభ్రాంతులై హాహా కారాలు చేశారు.

పెళ్ళికూతురు శోభతో తళతళలాడే ఎక్స్‌ప్రెస్ బస్సు తుత్తునియలయింది.

అంతా చీకటి. ఆకాశం చిల్లులుపడిందా అనిపించే వర్షపుధారలు. ఎవరికి యెవరూ తెలియని పరిస్థితి. కాళ్ళూ చేతులూ పచ్చడయినవారు బాధతో అరుస్తున్నారు. స్త్రీ పురుషులు యెలా పడివున్నవారు అలాగే వుండిపోయారు. స్పృహతప్పిపోయారో ప్రాణాలే కోల్పోయారో ఏదీ అర్థం కాని పరిస్థితి.

బాగా దెబ్బలు తగిలినా నిలబడి నడవగలిగేవారు సహాయంకోసమని బస్సును వదలి రోడ్డును చేరే ప్రయత్నం చేస్తున్నారు.

కాని, కుండపోత వర్షంలో దాదాపు ఇరవై అడుగుల ఎత్తులో వున్న రోడ్డును చేరేందుకు ఆ ప్రదేశం అనువుగా లేదు. మరి కొంత దూరం నడిచి ఏదో దిక్కుకు వెళ్ళేందుకైనా వారి చుట్టూ వర్షంనీరు ప్రవాహంలా వుంది. ఆ స్థితిలో రోడ్డుచేరే ప్రయత్నాన్ని వాయిదావేసి బస్సులో వుండిపోయిన బాధితులకు సహాయపడేందుకు వారంతా వుద్యుక్తులయ్యారు.

వారంతా ఆ నరకంలో ఇలా దాదాపు ఒకగంట గడిపారు. వర్షం దాదాపు తగ్గుముఖం పట్టింది. తీవ్రమైన దెబ్బలతో కదలలేని స్థితిలో వున్న వారందరినీ ఒక చోట చేర్చారు. ఉలుకూ పలుకూ లేని శవాల్లా పడివున్నవారిని ఒకచోట నేలమీద వేసారు.

ఇంతలో రోడ్డుమీద నుండి వారికి పోలీసు విజిల్సూ కేకలూ వినిపించాయి. పెద్దపెద్ద సెర్చిలైట్లూ, టార్చిలైట్లూ

వారివైపు కాంతిని ప్రసరిస్తూ వెలిగాయి. తమకు సహాయం అందబోతున్నదనే ఆశతో ప్రయాణీకులంతా తమ బాధను మరచి ఆనందంతో కేకలు వేశారు.

"మీకేం భయంలేదు, మీకు సహాయపడేందుకు పోలీసులూ, డాక్టర్లూ వచ్చారు" యిన్స్పెక్టర్ షరీఫ్ కంఠం కంచుగంటలా ఆ ప్రదేశమంతా మారుమ్రోగింది. వెను వెంటనే బిలబిలలాడుతూ పోలీసులు త్రాళ్ళ సహాయంతో పల్లంలోకి దిగారు. ప్రయాణీకు లందర్నీ రోడ్డుపైకి చేర్చారు. డాక్టర్లూ, నర్సులూ అక్కడికక్కడే హడావుడిగా ప్రథమ చికిత్స ప్రారంభించారు.

ప్రమాదంతో ప్రాణాలు కోల్పోయినవారిని పోలీసులు ఒక్కొక్కరినీ రోడ్డుపైకి చేర్చసాగారు. ప్రయాణీకుల్లో ఒకడు సెర్చిలైట్ల కాంతిలో వరసగా పేర్చబడ్డ శవాలలో ఒకదానిని చేరి "సుశీలా!" అంటూ బిగ్గరగా ఏడుస్తూ అంతలోనే త్రుళ్ళిపడి పైకిలేచాడు. "మోసం! దగా! నా భార్య ఒంటిమీది నగలెవరో దోచేసారు" అంటూ కేకలు వేయసాగాడు.

తమ ఆత్మీయుల శవాలవద్ద బాధతో విలపిస్తున్న మిగిలిన ప్రయాణీకులు కూడా ఆ కేకలతో వులిక్కిపడుతూ, తమ ముందున్న శవాలను చూసి మరింతగా ఘొల్లుమన్నారు. స్త్రీ శవాలు అన్నీ దాదాపుగా మెడలకూ చేతులకూ వున్న బంగారాన్ని కోల్పోయి బోడిగా వున్నాయి.

సహాయ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న ఇన్స్పెక్టర్ షరీఫ్ ఆ కబురు తెచ్చిన హెడ్ కానిస్టబుల్ ఐరావతం వంక అయోమయంగా చూస్తూ "వ్వాట్! శవాల దోపిడీయా!" అన్నాడు.

"అవున్సార్! దొంగనాయాళ్ళు చచ్చిన ఆడాళ్ళ ఒంటి

మీద ఒక్క నగ కూడా లేకుండా దోచేసారు. చూడగా ఇదేదో పగడ్బందీగా జరిగిన వ్యవహారంలా వుంది" అన్నాడు ఆయాసంతో వగరుస్తూ.

ఇన్‌స్పెక్టర్ షరీఫ్ పరుగులాంటి నడకతో శవాలను వుంచిన చోటు చేరాడు. చనిపోయిన వారిలో ఎనమండుగురు స్త్రీలూ, నలుగురు పురుషులూ, ముగ్గురు పిల్లలూ వున్నారు. స్త్రీల ఒంటిమీద తొందరగా ఊడిరాని ఏ ముక్కుపుడకలాంటి చిన్న వస్తువులో తప్ప మరింకేం లేవు.

మరణించిన స్త్రీలకు సంబంధించిన వారి ఆప్తులు చెప్పిన వివరాలనుబట్టి దాదాపు నూటయాభై తులాల బంగారం దోచబడినట్టు లెక్క తేలింది.

షరీఫ్ ప్రయాణీకు లందరినీ ఒకచోట చేర్చాడు. చనిపోయినవారిలో బస్సు డ్రైవరూ వున్నాడు. కండక్టరు తీవ్రమైన గాయాలతో కదలలేని స్థితిలో వున్నా మాట్లాడగలుగుతున్నాడు. కండక్టరు చెప్పిన దానిని బట్టి బస్సు ప్రమాదానికి గురైన సమయానికి ప్రయాణీకులు నలభై ఏడు మంది.

పోలీసులు ప్రయాణీకులను లెక్కపెట్టారు. మరణించిన వారు పదిహేనుమంది. దెబ్బలు తగిలి కదలలేని స్థితిలో వున్నవారు ఇరవైమంది. కాగా మిగిలిన వారు పన్నెండుమంది. వారిలో ఆరుగురు పురుషులూ. ముగ్గురు స్త్రీలూ, ఇద్దరు పిల్లలూ లెక్కకు తేలారు. అంటే నలభై ఏడుకూ ఒకరు తక్కువ.

ఆ ఒక్కరు యెవరు? స్త్రీయా పురుషుడా?

కొండమీద నుండి ఆ రాతిని కావాలని యెవరైనా బస్సు మీదకు దొర్లించారా? అది అసాధ్యమని ఆ రాతిని చూస్తేనే తెలుస్తుంది. పాతికమంది కలిపి కట్టుగా కదిపినా ఒక్క

అంగుళం కూడా కదలనంత బ్రహ్మాండమైన పాషాణ మది!

షరీఫ్ ప్రయాణీకుల్లోని నలభై ఏడో వ్యక్తి యెవరా అని విచారణ ప్రారంభించేంతలో ఒక వ్యక్తి ముందు కొచ్చి "ఆ వ్యక్తి నా ప్రక్కన కూర్చుని ప్రయాణం చేసినవాడు కావచ్చు సార్" అన్నాడు.

షరీఫ్ అతణ్ణి పరిశీలనగా చూస్తూ "మీ పేరేమిటి?" అన్నాడు.

అందుకు ఆ వ్యక్తి "నా పేరు సత్యనారాయణ సార్! కలెక్టరు ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తున్నాను" అన్నాడు.

షరీఫ్ తల వూపుతూ "మీకు తెలిసింది చెప్పండి" అన్నాడు.

"నేను చనిపోయిన వారిని, దెబ్బలు తిన్నవారిని, అందరినీ చూసాను సార్! అందరిలోనూ అతనొక్కడే కనపడడం లేదు" అన్నాడు సత్యనారాయణ.

షరీఫ్ సాలోచనగా అతణ్ణి చూస్తూ "బస్సు పల్లంలోకి దొర్లినపుడు పైకి విసిరివేయబడ్డాడేమో? చనిపోయో! ఒక వేళ అలా కాకపోయినా కదలలేని స్థితిలో ఏ మూలనో పడివున్నాడేమో" అన్నాడు.

సత్యనారాయణ ఆ మాటకు తల అడ్డంగా వూపుతూ "లేదు సార్! బస్సులో నేను సీటు కిందకు దొర్లి భయంతో దానికి అతుక్కుపోయివున్న స్థితిలో అతడే నన్ను పైకి లాగాడు. తర్వాత ఆ హడావుడిలో అతణ్ణి నేను గమనించ లేదు" అన్నాడు.

"అంటే అతడు ప్రమాదం నుండి సురక్షితంగా బైట పడి ఎవరి బాధల్లో వారుండగా చల్లగా శవాలను దోచు కుని, మా రాకకు ముందే ఇక్కణ్ణుంచి జారుకున్నాడన్న

మాట! ఆ అవకాశం అతనికి వుంది" అన్నాడు షరీఫ్ సత్యనారాయణ వంక చూస్తూ.

అతడు అయోమయంగా బుర్ర గోక్కుంటూ "ఏమో సార్! అ సంగతి నేను చెప్పలేను" అన్నాడు.

"ఆ సంగతి మేం తెలుసుకుంటాం! బస్సులో అతను మీ ప్రక్కనే కూర్చున్నాడు గనుక మాటల సందర్భంలో అతన్ని గూర్చి మీకు తెలిసిన విషయాలు జాగ్రత్తగా ఆలోచించి చెప్పండి. ప్రస్తుత పరిస్థితిలో అతనికి సంబంధించి మీరు చెప్పే ప్రతిమాటా యెంతో విలువైనది. ఆ విషయం మరచిపోకండి!" అన్నాడు షరీఫ్ పెన్నూ నోట్ బుక్కూ పైకి తీస్తూ.

సత్యనారాయణ తల వూపుతూ "మనిషి చామనఛాయ. ఎత్తుగా బలిష్టంగా వున్నాడు. మాటల్లో ఏదో స్కూల్లో ప్యూనుగా పని చేస్తున్నానని చెప్పాడు. ఏ స్కూల్లో పని చేస్తున్నాడో అతని పేరేమిటో నేను అడగలేదు. అయితే సిగరెట్ వెలిగించుకోవడానికని నేను అగ్గిపెట్టెకోసం జేబులు తడుముకున్నంతలో ఈ సిగార్ లైటరును అతనే నాకు యిచ్చాడు. మాటల్లో పరధ్యానంగా దానిని నా జేబులో వేసుకున్నాను" అంటూ సత్యనారాయణ షరీఫ్ చేతికి ఒక సరికొత్త సిగార్ లైటరు ఇచ్చాడు.

షరీఫ్ లైటరును జాగ్రత్తగా జేబులో భద్రపరచి మాయమైన ఆ ప్రయాణీకుణ్ణి గూర్చి మిగిలిన ప్రయాణీకులను అడిగాడు. వారు మాకేం తెలియదన్నారు.

అంతటితో ఆ విచారణ ఆపుచేసి, ఎందుకైనా మంచిదని ప్రయాణీకులందరి సామాన్లూ తనిఖీ చేయించమని ఐరావతానికి పురమాయించాడు. ఐరావతం ఆధ్వర్యంలో పోలీసులు ప్రయాణీకుల పెట్టే బెడ్డింగులతోబాటు పీలైనంత

మేర ఆ చుట్టుప్రక్క ప్రదేశాలను కూడా గాలించి వది లారు. పోయిన నగల జాడలేమీ వారికి అగుపించలేదు.

పోలీసువేన్లూ, అంబులెన్సులూ నగరంవేపు పరుగు తీశాయి.

2

మరుసటి రోజు సూర్యోదయానికి మునుపే ఇన్స్పెక్టర్ షరీఫ్ కొంత సిబ్బందితో తిరిగి ప్రమాదస్థలానికి వచ్చాడు. జీపు దిగుతూనే బండరాయి కొండమీద నుండి దొర్లిన ప్రదేశాన్ని వెదుకుతూ కొండ యెక్కసాగాడు షరీఫ్.

లాఠీతోబాటు తన భారీకాయాన్నీ మోపుకుంటూ తన శిష్యపరమాణువులైన 103, 301 లతో బాటు షరీఫ్‌ని అనుసరించాడు ఐరావతం. షరీఫ్ చకచక అడుగులు వేస్తూ పైకి పోతున్నాడు. అతడి వెంట కొండ యెక్కడం ఐరావతానికి ప్రాణం మీదకొచ్చినట్టుంది.

శ్వాస అధికమై ఐరావతానికి వూపిరి సరిగా అందడం లేదు. ఒళ్ళంతా చెమట. గురువుగారి అవస్థ చూసి 103, 301 లు వచ్చే నవ్వు ఆడుకోలేక మొహాలు ప్రక్కకు తిప్పి నవ్వుకోసాగారు.

బండరాయి పూర్వం నిలిచివున్న ప్రదేశాన్ని వెతికి పట్టుకొని ఆ స్థలాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు షరీఫ్. ఆ ప్రదేశానికి మరింత ఎత్తు నుండి వరదలా ప్రవహించిన నీరు బండరాయి క్రిందవున్న మట్టిని చాలామేరకు కోత పెట్టిన కారణంగా అదుపుతప్పిన రాయి కొండ వాలున వేగంగా దొర్లుతూపోయి సమయానికి అటుగా వస్తున్న బస్సును ఢీకొన్నది. ప్రమాదం దురదృష్టవశాత్తూ కాకతాళీయంగా జరిగినదే తప్ప కల్పితం కాదు.

ప్రమాదంలో గాయపడినవారికి సహాయపడుతున్న ఆ వ్యక్తిని మరణించిన స్త్రీల ఒంటిపై వున్న నగలు ఆకర్షించి వుంటాయి. ప్రయాణీకులంతా ఎవరి బాధల్లో వారున్నారు. ఆ స్థితిలో తనను పట్టించుకునే వారెవ్వరులేరు. ఊహించని అవకాశం అతడిలో దురాశను రేకెత్తించి నేరానికి పురిగొల్పింది:

షరీఫ్ ప్రమాదస్థలాన్ని మరోసారి పరిశీలించి, తన సిబ్బందితో పోలీసుస్టేషనుకు చేరుకున్నాడు.

షరీఫ్ తన సీట్లో ఆసీనుడౌతుండగా ఐరావతం పరుగుతో వచ్చి "చూడండి సార్! ఈ పేపరోళ్ళు చేసిన పని" అంటూ ఆవేళ్టి దినపత్రిక నొకదానిని షరీఫ్ ముందుంచాడు.

ఫ్రంట్ పేజీలో బండి చక్రాలంతేసి అక్షరాలతో ఉన్న శీర్షిక నొకదానిని చూడడంతోనే షరీఫ్ మొహం నల్లగా మాడిపోయింది.

"శవాల దోపిడీ" అనే హెడ్డింగుతో ప్రారంభమైన ఆ వార్తలో "నగరంలో సరికొత్త పంథాలో దోపిడీలు ప్రారంభమయ్యాయి. గతరాత్రి ప్రయాణీకులతో వెళుతున్న ఒక బస్సుకు పథకం ప్రకారం ప్రమాదాన్ని సృష్టించి కొందరు దుండగులు శవాల మీదున్న బంగారం నగలూ విలువైన వస్తువులూ దోచుకున్నారు.

అని రాస్తూ ఆ దినపత్రిక పోలీసులనూ, పెరిగిపోతున్న నేరాలను అరికట్టడంలో వారి వైఫల్యాలనూ నిశితంగా విమర్శిస్తూ తీవ్రమైన ఆరోపణలు చేసింది.

ఇన్స్పెక్టర్ షరీఫ్ అంతా చదివి తల పట్టుకున్నాడు.

ఇంతలో షరీఫ్ ముందున్న ఫోను ట్రింగ్ మంటూ మ్రోగింది. ప్రక్కనే నిలబడి వున్న ఐరావతం ఫోనందు

కొని "హలో దిసీజ్ పోలీస్ స్టేషన్" అన్నాడు చిరాగ్గా

అవతల నుండి మాట వినపడడంతోనే అటెన్షన్‌లో కొయ్యలా బిగుసుకుపోతూ "గు....గుడ్‌మార్నింగ్ సార్. వున్నారు సార్!" అంటూ షరీఫ్‌కు ఫోనందిస్తూ "డి.ఐ.జి! సాబ్ సార్" అన్నాడు ఐరావతం.

షరీఫ్ చటుక్కున ఫోనందుకొని "గుడ్‌మార్నింగ్ సార్" అన్నాడు వినయంగా "తెల్లారే ఎవడి మొహం. చూసానో దండకం తప్పేట్టు లేదు" అనుకుంటూ.

"ఇన్‌స్పెక్టర్ షరీఫ్! ఇవాల్టి పేపరు చూసారా!" డి.ఐ జి. కంఠం సౌమ్యంగానే వున్నా ప్రశ్న సూటిగా వినిపించింది.

"ఇప్పుడే చూసాను సర్! బట్! అందులో మేటరు పూర్తిగా" అంటూ షరీఫ్ ఇంకా ఏదో అనేంతలో డి.ఐ జి దానిని మధ్యలోనే తుంచేస్తూ.

"ఇన్‌స్పెక్టర్! ఏది ఏమైనా నేరం జరిగింది. డు యు అగ్రీ!"

"ఎస్ సార్!" సీళ్ళు నమిలాడు షరీఫ్.

"ఇన్‌స్పెక్టర్! హోమ్ మినిష్టరు ప్రస్తుతం నగరంలో వున్న విషయం మీకూ తెలుసు. తెల్లారక ముందే ఆయన ఫోనులో నా తలమీద అక్షింతలు వేసారు. మనం సాధ్యమైనంత తొందరలో నేరస్థుల్ని బంధించాలి. హోమ్ మినిష్టరు వూళ్ళో మరి నాలుగు రోజులుంటారు. ఈలోగా ఆ పని జరగాలి. ఓ.కే." అన్నారు డి ఐ.జి. గట్టిగా.

"ఓ.కే. డన్ సార్!"

"దట్స్ గుడ్!" క్లిక్‌మంది ఫోను.

షరీఫ్ రిసీవరు ఫోనుమీదుంచి జేబులో వున్న సిగార్ లైటర్ తీసాడు. లైటరు కొని ఐదారు రోజులకు మించి

వుండదు. తళతళలాడిపోతోంది. కేస్‌మీద కె.యస్. రావు అనే అక్షరాలు యింగ్లీషులో చెక్కి వున్నాయి. లైటరు అడుగుభాగంలో శక్తి అనే పేరు యింగ్లీషులో ప్రింటయి వుంది. బహుశా శక్తి అనేది లైటరు పేరో దానిని తయారుచేసిన కంపెనీ పేరో కావచ్చు

కె.యస్. రావు అన్నది నేరస్థుడి పేరేనా? కానూవచ్చు కాకపోనూ వచ్చు. లైటరు అతనికి యెవరైనా బహూకరించి వుంటే అప్పుడు ఈ పేరు బహూకరించిన వ్యక్తిదీ అయే అవకాశం వుంది.

"ఐరావతం! కే.యస్ రావుతో వచ్చే పేర్లు నీకు తెలిసినవి చెప్పు!" అన్నాడు షరీఫ్.

ఐరావతం తడుముకోకుండా "సుబ్బారావు, శ్రీనివాసరావు, శంకర్రావు, సుందర్రావు, సత్యారావు, శివరావు, శ్యామ్లావు!" అని చెప్పి "ఇంకా ఆలోచిస్తే మరికొన్ని పేర్లు దొరకొచ్చు సార్!" అన్నాడు.

షరీఫ్ "ప్రస్తుతానికి కె యస్. రావు. అనే పేరు నేరస్తుడిదేనని అనుకుందాం. కె యస్. రావు నగరంలో వున్న ఏదో స్కూల్లో ప్యూనుగా పనిచేస్తున్నాడు. మనిషి చామన చాయ. ఎత్తుగా బలంగా వుంటాడు. ఇదీ ప్రస్తుతం అతన్ని గూర్చి మనకు తెలిసిన విషయాలు. ఇక ఈ లైటరు ఈ మధ్య కొన్నట్టుంది గనక ఎక్కడ కొన్నదీ తెలుసుకో గలిగితే మరికొన్ని విషయాలు తెలియొచ్చు! మన అదృష్టం బాగుంది దీనిని ఈ వూర్లో కొనివుంటే!" అన్నాడు.

ఐరావతం "ఆ పని నేను చూస్తాను సార్! ఈ వూర్లో లైటర్లమ్మే కొట్లన్నీ గాలించి మరీ వదులుతాను" అన్నాడు హుషారుగా.

షరీఫ్ లైటర్ని ఐరావతం చేతిలో వుంచుతూ "శుభం" అన్నాడు చిరునవ్వు మొగంతో.

3

ఐరావతం, 103, 301 లను వెంటబెట్టుకొని అదేపనిగా కొట్టు కొట్టుకీ తిరగసాగాడు. ప్రతివాడూ లైటర్ని చూడగానే "అబ్బే! ఈ తరహా లైటర్ని చూడడం యిదే ప్రథమం సార్!" అనేస్తున్నారు వినయంగా.

అన్ని రోడ్లూ తిరిగీ తిరిగీ ముగ్గురికీ కాళ్ళు తిమ్మిర్లు పట్టాయి. ఎండ మరీ తీక్షణంగా వుందేమో ఐరావతం వరసగా పది పందాలు నెగ్గిన కోడిపుంజులా నోరు వెళ్ళబెట్టేస్తున్నాడు. దారి పొడుగునా సోడాలు తాగి ఐరావతం పొట్ట బానలా తయారయింది.

ఐరావతం రోడ్డు ప్రక్కనే వున్న బస్ షెల్టరులో కూలబడిపోతూ, "ఒరేయ్! ఇక నా వల్ల కాదురా! చూస్తూంటే ఈ నా కొడుకు లైటర్ని ఏ జాలరి పేటలోనో కొన్నట్టున్నాడు. దొంగనాయాలు దొరికితే స్మగ్లింగ్ కేసులో గూడా యిరికించందే వదలిపెట్టను" అన్నాడు కె. యస్. రావును తిట్టిన తిట్టు తిట్టకుండా వెయ్యిన్నొక్క తిట్లు తిడుతూ.

103, 301 లు కష్టపడి ఎలాగయితేనేం ఐరావతాన్ని లేపి, ఒక షాపులో దూర్చారు.

ఐరావతం కొట్టుయజమానితో "ఏమయ్యా మీ షాపులో సిగార్ లైటర్లు...." అంటుండగానే షాపు యజమాని చటుక్కున ఒక సొరుగు లాగి డజన్లకొద్దీ రక రకాలైన లైటర్లను కౌంటరుమీద పడేసాడు.

వాటిలో ఆకుపచ్చ రంగుతో తళ తళ లాడుతున్న లైటర్ని చూడగానే గభాల్న వంగి దానిని తీస్తూ అడుగు

భాగంలో శక్తి అన్న అక్షరాలను చూపి సంతోషంతో నిట్టూర్చాడు ఐరావతం.

జేబులోవున్న లైటర్ని తీసి టేబిలుమీదుంచుతూ "డొంకతిరుగుళ్ళు లేని సమాధానం కావాలి! ఈ లైటరు మీ కొట్టులో అమ్మిందేనా?" అన్నాడు ఐరావతం పోలీసు హొందాతో.

కొట్టు యజమాని లైటర్ని ఎగాదిగా చూపి "ఇది మా కొట్టులోనిదే. ఇంతకూ ఏం జరిగింది సార్!" అన్నాడు భయంగా.

"నువు మాతో సహకరిస్తే ఏం కాదు. లేకుంటే కొట్టు మూయించి నిన్ను స్టేషనుకు లాక్కెళ్లాల్సొంటుంది మరి" ఆమాత్రం దబాయింపు లేందే పోలీసు నిజం రాబట్టలేడని ఐరావతం గట్టి నమ్మకం.

షాపు యజమాని ఏం మాట్లాడితే యెలా వుంటుందో ననే జంకుతో వెర్రి నవ్వొకటి నవ్వి "చెప్పండి సార్! మీ మాటలు మేం కాదంటామా!" అన్నాడు.

"అదిసరే! లైటర్ని చూడగానే మా కొట్లోదే అన్నావు. ఏమిటంత గ్యారంటీ? ఇలాంటివి మరెక్కడా లేవా?" అన్నాడు ఐరావతం.

షాపు యజమాని చిరునవ్వుతో "ప్రస్తుతానికి లేవు సార్! శక్తి లైటర్లు మార్కెట్‌కి కొత్త. రాష్ట్రం మొత్తానికి మొట్టమొదటగా వీటిని అమ్మకానికి పెట్టింది మేమే" అన్నాడు గర్వంగా.

లైటర్ ఆచూకీ దొరకడానికి తాము అంతగా ఎందుకు శ్రమ పడాల్సి వచ్చిందో అప్పు డర్థమయ్యింది ఐరావతానికి.

ఐరావతం తలెగరేస్తూ "అలాగా! మరి ఈ లైటర్లు

అమ్మకానికి పెట్టి యెన్నింటిని అమ్మారో యెవరెవరికి అమ్మారో ఏమయినా చెప్పగలవా?...." ప్రశ్నించాడు ఐరావతం.

కొట్టు యజమాని బుర్ర గోక్కుంటూ "శక్తిలైటర్ల అమ్మకం ప్రారంభించి వారంరోజులే అయింది గనక స్టాకు లిస్టు చూపి ఎన్ని అమ్మిందీ చెప్పగలను గానీ కొన్న వారి పేరూ అడ్రసూ చెప్పడం కష్టం సార్!" అన్నాడు.

"అదెలా? సామాను కొన్నవాళ్ళకు బిల్లు ఇచ్చేటప్పుడు పేరూ అడ్రసూ రాస్తారు కదా!" అడిగాడు ఐరావతం పెద్ద డిటెక్టివ్‌లా.

కొట్టు యజమాని ఆ మాటకు ఠకీమని "అబ్బే! సాధారణంగా ఎవరూ బిల్లు అడగరు సార్!" అని చెప్పి ఆ మాట యెందుకన్నానా అని నాలుక్కరుచుకున్నాడు.

అతడు వూహించినట్టుగానే ఐరావతం చిందులు తొక్కుతూ "అంటే కష్టమరడుగందే నువ్వు బిల్లివ్వవన్నమాట. నువు బుర్ర బద్దలు కొట్టుకునైనా సరే లైటర్లు అమ్మిన ఎడ్రసులు మాకు చెప్పాలి. లేదంటే చీకటికొట్లో చుక్కలు లెక్కపెడతావు" అన్నాడు.

షాపు యజమాని "ఇదెక్కడి పీడరా భగవంతుడా" అని మనసులో తిట్టుకుంటూ "అంతమాట అనకండి సార్! మీరలా క్షణం విశ్రాంతి తీసుకోండి" అని చెప్పి కుర్రాణ్ణి పంపి మూడు డ్రింకులు తెప్పించి ముగ్గురికీ యిచ్చాడు.

స్టాకు లిస్టుతీపి లెక్కవేసి "శక్తి లైటర్లు ఈ వారం రోజుల్లోనూ రెండే అమ్మాం సార్! అవి కొన్నవాళ్ళు ...." అంటూ తీవ్రంగా ఆలోచిస్తున్నవాడికిమల్లే రెండు చేతులతోనూ తలను పట్టుకొని మోచేతులు బల్లమీద ఆన్చి

అలాగే వుండిపోయాడు.

ఐరావతం బృందం కూల్ డ్రింక్స్ పూర్తిచేసి సిగరెట్లు ముట్టించారు. వేళ్ళు చురుక్కుమనేంతవరకూ వాటిని కాల్చి పీకలు యాష్ ట్రేలో కుక్కారు. షాపు ఓనరు అప్పటికీ అదే పోజులో కళ్ళు మూసుకొని వున్నాడు.

ఐరావతం షాపు ఓనరు మొహంలోకి కొద్దిసేపు అనుమానంగా చూసి 103, 301 లతో "ఒరేయ్! కొంపదీసి వీడు మనల్నిలా వదలి హాయిగా నిద్రపోవడం లేదుకదా!" అన్నాడు నెమ్మదిగా.

103, 301 లకు ఆ అనుమానం ఎప్పుడో బలపడిపోగా "మేమూ అదే ఆలోచిస్తున్నాం గురూ!" అన్నారు సీరియస్‌గా.

"ఏడిసారుగానీ! ముందు వీణ్ణి లేపండి. లేకపోతే ఇదే పోజులో కుంభకర్ణుడిలా ఏ ఆరునెలలకో గాని లేవడు" అన్నాడు ఐరావతం చిరాగ్గా.

103, 301 లు షాపు ఓనర్ని లేపేందుకు అతనికి బాగా చేరువగా వెళ్ళి భుజంమీద చేయి వేసేంతలో అతను ఒక్కసారిగా రైలింజనులా కూత వేశాడు.

ఆ అరుపుతో వారిద్దరూ అదిరిపోతూ, పిచ్చివాళ్ళలా అరుస్తూ వచ్చి ఐరావతాన్ని కావలించేసుకున్నారు గట్టిగా. ఆ పట్టునుండి విడివడేందుకు ఐరావతానికి బ్రహ్మప్రళయమైపోయింది.

శిష్యు లిద్దరినీ విదలించుకొని, "పిరికి నా కొడుకుల్లారా! ఇంత చచ్చునాయాళ్ళు పోలీసులెలా అయ్యార్రా" అని గదమాయిస్తూ షాపు ఓనరుకేసి తిరిగి "దయ్యం పట్టిన వాడిలా ఆ అరుపు లేంటి?...." అన్నాడు గట్టిగా.

షాపు ఓనరు ఐరావతం మాటలకు చిన్నబుచ్చుకొని

"అదేంటి సార్ మీ కోసమని బుర్ర బద్దలు కొట్టుకొని నేను ఆ కష్టమర్లను గుర్తు చేసుకుంటే మీరిలా అనడం ఏం బావోలేదు" అన్నాడు.

ఆ మాటకు ఐరావతం చిరాకు ఇట్టే ఎగిరిపోయింది.

షాపు ఓనరు గొంతు సవరించుకొని "మా దగ్గర శక్తి లైటర్లు కొన్న ఇద్దరిలోనూ మొదటి వ్యక్తి బాగా సన్నగా వుండి ఎర్రగా వుంటాడు. మాటల్నిబట్టి తెలుగువాడు కాదని నా అనుమానం. పొడవూ పొట్టీ కాని ఎత్తు. మన రాష్ట్రంలో శక్తి లైటరు వాడుతున్న మొదటి వ్యక్తి మీరేసార్ అని నేనంటే పై వరసలో ముందున్న బంగారపు పన్ను కన్పించేటట్టుగా నవ్వాడతను" అని చెప్పి ఐరావతం మొహంలోకి చూసాడు.

ఐరావతం తమకు కావాల్సిన వ్యక్తి అతడు కాదన్నట్టుగా తలాడిస్తూ "రెండో మనిషి ఎలా వుంటాడు?" అని అడిగాడు.

"రెండో మనిషి చేయెత్తు పొడవు. బందోబస్తుగా వున్నాడు. చామనఛాయ. లైటరు కొని వంద నోటిచ్చాడు. మా దగ్గర చిల్లరలేదు. ప్రక్క కొట్లలో ఎక్కడైనా చిల్లర తెప్పిద్దామన్నా ఆ సమయానికి కుర్రాళ్ళెవరూ లేరు. ఆ మాటే అతనితో అంటే అంతెత్తున ఎగిరాడు. 'మీ దగ్గిర సామాను కొన్న నేరానికి మాకిదొక శిక్ష' అంటూ కేక లేపి తనే చిల్లర మార్చి తెచ్చాడు. అందుకే అతని రూపం నాకింకా బాగా గుర్తున్నది" అన్నాడు షాపు యజమాని.

ఐరావతం ఆత్రంగా కౌంటరు మీదకు వంగి "మాకు కావలసిన మనిషి అతనే. అతని ఎడ్రసు తెలిసే వివరం ఏదన్నా వుంటే చెప్పండి" అన్నాడు.

షాపు ఓనరు పెదవి విరుస్తూ "అంతకు మించి అతని విషయాలేమీ మాకు తెలియవు" అన్నాడు.

ఐరావతం నిరుత్సాహపడిపోయాడు. ఎంతో శ్రమపడి చేసిన ప్రయత్నం దాదాపు వృధా! తమకు తెలియని విషయాలేవీ కొత్తగా తెలియలేదు ఇక్కడ.

రోడ్డుమీద శిష్యులతో బాటు కాళ్ళీడ్చుకుంటూపోతున్న ఐరావతం "గురూ, షాపువాడు దేనికో మనల్ని పిలుస్తూ వస్తున్నాడు" అన్న 103 మాటలకు ఆత్రంగా వెను తిరిగాడు.

షాపు యజమాని ఐరావతం దగ్గరకు వచ్చి "సార్! ఈ విషయం మీకు పనికొస్తుందో, లేదోగానీ.... రెండో కష్టమరు మా షాపు నుండి బయటకు వెళ్ళబోయేంతలో గుమ్మం వద్ద అతనికి పూజారిలా వున్న ఒక ముసలాయన యెదురయ్యాడు. కష్టమరే అతణ్ణి "ఏమండీ పంతులుగారూ బావున్నారా? ఈ మధ్య కోవెలలో ప్రతిరోజూ మీ అబ్బాయిగారే కనిపిస్తున్నారు. మీ రేదన్నా వూరెళ్ళారా?" అని ప్రశ్నించాడు.

అందుకు పూజారి తనకు ఒంట్లో బాగులేక ఆలయానికి రావడంలేదని చెప్పాడు.

"అదా సంగతి! నేనూ అలాంటిదేదో జరిగుంటుందనే అనుకున్నాను. పాపం మీ అబ్బాయి ఒక్కడే అన్నిటికీ పరుగులు తీస్తూ తెగబాధపడ్డాడు" అన్నాడతను.

పూజారి చిరునవ్వు నవ్వుతూ "కార్తీకమాసం గదా రద్దీగానే వుంటుంది మరి" అన్నాడు. వారిద్దరూ మరికాసేపు మాటాడుకున్నారుగానీ నా పనిలో పడి అదేమీ గమనించ లేదు" అన్నాడు షాపు ఓనరు....

ఐరావతం చెప్పిన విషయాలన్నీ విని "ఐరావతం! ఇన్ఫర్మేషను గాదర్ చెయ్యడంలో ఎలాగైనా నువ్వు ఘటికుడవోయ్" అన్నాడు షరీఫ్.

ఐరావతం ఆ మాటకు వుబ్బి తబ్బిబ్బయ్యాడు.

"పూజారితో ఆ వ్యక్తి మాట్లాడిన దాని వలన మనకు కొన్ని విషయాలు తెలుస్తున్నాయి. ఆ వ్యక్తి వూళ్లో వున్న ఏదో ఒక స్కూల్లో ప్యూనుగా పనిచేస్తున్నాడని మనకు తెలుసు. ఆ స్కూలు కోవెల ప్రక్కగా వుండి వుండాలి. కార్తీకమాసంలో సాధారణంగా రద్దీగా వుండేవి శివ కోవిల్లే గనక అది శివాలయం కావచ్చు. అంతే కాదు! ఆ ఆలయం స్కూలుకన్నా ఎత్తులోవుండి వుంటుంది" అన్నాడు షరీఫ్.

ఐరావతం బుర్ర గోక్కుంటూ "మీరు చెప్పినదంతా బాగానే వుంది. కానీ స్కూలుకన్నా ఆలయం ఎత్తులో వుందని మీ రెలా చెప్పగలుగుతున్నారు" అన్నాడు.

షరీఫ్ నవ్వుతూ "ఇందులో పెద్దగా అర్థం కానిదేం లేదు. పూజారి కోవెలకు రావడం లేదనీ, అతని కొడుకే కోవెలలో అన్ని పనులూ చూసుకుంటున్నాడనీ మన నేస్తానికెలా తెలిసింది? అంటే ఈ విషయాన్ని అతడు ప్రతి రోజు పత్యక్షంగా గమనిస్తున్నాడన్న మాట. స్కూలు కోవెలకన్నా ఎత్తులో వున్నప్పుడే అది సాధ్యం" అన్నాడు.

"అతను ప్రతిరోజూ కోవెలకు వెడుతున్నాడనుకోండి. అప్పుడు తనకీ విషయాలు తెలిసే అవకాశం వుంది కదా?" ప్రశ్నించాడు ఐరావతం.

షరీఫ్ తన అడ్డంగా వూపుతూ "ప్రతిరోజూ కోవెలకు వెళ్ళడం సాధారణంగా జరిగే పనికాదు. ఒకవేళ అలా వెళుతున్నాడనే అనుకుంటే పూజారి కోవెలకు యెందుకు

రావడంలేదో అతనికి తెలిసివుండేది. అలాకాక ఆ ప్రశ్న వేసాడూ అంటే అతను కోవెలకు వెళ్ళకుండానే కోవెల సంగతులు తెలుసుకోగలుగుతున్నాడన్న మాట. స్కూలు కోవెలకన్నా యెత్తులో వున్నపుడే అది సాధ్యం'' అన్నాడు.

ఐరావతం అంగీకారంగా తల వూపుతూ ''ఇప్పుడు మన కర్తవ్యం?'' అని అడిగాడు.

''ఆ వ్యక్తి దోపిడీ చేసాడనేది కేవలం మన అంచనా. అంతకు మించి మన దగ్గర సరైన రుజువులేం లేవు. ఆ రోజు జరిగిన ప్రమాదంలో తాను బ్రతికి బయటపడి యెలాగోలా రోడ్డుచేరి ఏ లారీ మీదనో వూరు చేరుకున్నానని అతడంటే మనం చేయగలిగేది వుండదు. అందుకని ప్రస్తుతం అతని ఆచూకీ తెలుసుకొని అనుక్షణం నీడలా అనుసరించండి. ప్యూను వుద్యోగం అంటే ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే వుంటుంది. ఎక్కడ దాచబడినా బంగారం అవసరాలకు నేనున్నానంటూ జ్ఞప్తికి వస్తుంది. బంగారంతోబాటు నేరస్థుణ్ణి పట్టుకోగల అవకాశం వున్నపుడే మీరు బయటపడాల్సింది'' అన్నాడు షరీఫ్.

ఐరావతం అర్థమైందన్నట్టు తలాడించాడు.

పోలీసులు స్కూలు యెక్కడ వుండేదీ తొందరగానే తెలుసుకోగలిగారు. ఆ విషయంలో షరీఫ్ అంచనా తప్పలేదు. ఐరావతం సాధారణ దుస్తులు ధరించి పిల్లల్ని స్కూల్లో జాయిన్‌చేసే నెపంతో ప్రిన్సిపాల్ రంగాచారిని కలిసాడు. అతనికి తానెవరో తెలియజేసి తన రాకకు కారణం చెప్పాడు.

తమ స్కూల్లో కె. సుబ్బారావు అనే పేరుగల ప్యూను వున్నట్టు ప్రిన్సిపాలు అంగీకరించాడు. సరిగ్గా బస్సు ప్రమాదం జరిగిన రోజున పనిమీద విజయనగరం వెళ్ళా

లంటూ సుబ్బారావు రెండ్రోజులు సెలవు అడిగి తీసుకున్నాడనీ, గడువు ముగిసినా ఇంకా స్కూలుకు రాలేదని ప్రిన్సిపాలు రంగాచారి చెప్పాడు.

ప్రిన్సిపాలు వద్ద సుబ్బారావు ఇంటి ఎడ్రసు తీసుకొని "సుబ్బారావు ఫోటో ఏదన్నా ఇక్కడుందా?" అని అడిగాడు ఐరావతం ప్రిన్సిపాల్‌ని.

రంగాచారి ఇంకో ప్యూన్‌ని పిలవబోయాడు. ఐరావతం ఆయన్ని వారిస్తూ "పూర్తిగా తేలేవరకూ దయచేసి ఈ విషయం రహస్యంగా వుంచండి" అన్నాడు.

ప్యూన్‌ని పిలిచే ప్రయత్నం విరమించుకొని సుబ్బారావు ఫోటో చూపించేందుకు ప్రిన్సిపాలే స్వయంగా బయల్దేరాడు. విశాలమైన స్కూలు వరండాలో వార్షికోత్సవాలకు సంబంధించినవి చాలా ఫోటోలు వున్నాయి. ఆ ఫోటోల్లో వివిధ భంగిమలలో వున్న సుబ్బావును ఐరావతం స్పష్టంగానే గుర్తించి జ్ఞాపకం పెట్టుకున్నాడు.

ఐరావతం ఆధ్వర్యంతో సుబ్బారావు వేసే ప్రతి అడుగూ గమనించేందుకు పోలీసు వలయం నిర్మించబడింది. పోలీసులు ఎంతో ఓపికతో రోజంతా యెవరికీ అనుమానం కలగని రీతిలో మామూలు దుస్తుల్లో సుబ్బారావు ఇంటి చుట్టూ ప్రదక్షిణలు చేయసాగారు.

సాయంత్రం చీకటి పడుతున్న వేళకు సుబ్బారావు టిప్‌టాప్‌గా తయారై యింటి నుండి బయల్దేరాడు.

సుబ్బారావు అపుడపుడూ చూసీ చూడనట్టూ వెనక్కి తిరిగి చూస్తూ నెమ్మదిగా నడవసాగాడు.

"నా కొడుకు జాగ్రత్తపడుతున్నాడు" అనుకున్నాడు ఐరావతం.

ఇటువంటి విషయాలలో పోలీసులకున్న ప్లాను పోలీసు లకూ వున్నాయి. తనను కంటిన్యూగా యెవరూ అనుస రించడం లేదని సుబ్బారావు సంతృప్తి పడుతూ ముందుకు అడుగేస్తున్నాడు. ఒక పల్లెటూరి బైతూ, ఒక పంజాబీ, ఒక ముసలివాడూ ఒక్కొక్కరే దళలవారీగా తనను అనుసరించారనీ, ప్రస్తుతం తనకు యాభై గజాల దూరంలో ఒక కూలీ ఓరగా తననే చూస్తూ తల వంచుకొని నడుస్తూ నెమ్మదిగా తనలో తానే ఏదో గొణుక్కుంటున్నాడనీ, ఆ గొణుగుడు అతడి జేబులో వున్న అతిశక్తివంతమైన వైర్‌లెస్ సాధనం ద్వారా అతనికి వెనుకగా ఫర్లాంగు దూరంలో నెమ్మదిగా వస్తున్న లారీలో వున్న వ్యక్తులకు చేరుతోందనీ సుబ్బారావు గ్రహించనేలేదు.

సుబ్బారావు తిన్నగా పాతమార్కెట్టు దాటి బంగారు కొట్లున్న ప్రాంతాన్ని చేరాడు. కాసేపు రోడ్డుమీద అటూ ఇటూ తచ్చాడి ఒక బంగారం షాపులోకి దూరాడు. షాపులో మరికొద్దిసేపు వెయిట్ చేసి అంతా సవ్యంగా వుందను కున్నాక జేబులో నుండి ఒక వస్తువు తీసి షాపు యజమాని ముందుంచబోయాడు.

ఇంతలో సుబ్బారావు చేయి ఒక వుక్కుపిడికిలి మధ్య ఇరుక్కుపోయింది. ఆ పట్టు విడిపించుకునేందుకు సుబ్బా రావు విశ్వప్రయత్నం చేశాడు.

"నాయనా సుబ్బారావూ నీది వృథాప్రయాస! ఆ రెక్క అలా వూడిపోవాలే తప్ప మా గురూగారి పట్టు వదిలించు కోవడం అసాధ్యం" అంటూ 103, 301 లు తమ చేతుల్లో వున్న లాఠీలతో సుబ్బారావు నడుంమీద చెరో దెబ్బా వేసారు. కిక్కురు మనకుండా సుబ్బారావు పోలీసులకు లొంగిపోయాడు.

స్టేషన్లో తన నేరాన్ని అంగీకరిస్తూ బంగారాన్ని పోలీసుల పరం చేసాడు సుబ్బారావు.

ఆనాడు తను చేసిన నేరంమీద స్టేట్‌మెంటు యిస్తూ "నిజానికి నేను ఎన్నడూ యెక్కడా నేరం చేయలేదు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించే ఉద్దేశంతోనే నేను సహాయ కార్యక్రమంలో పాల్గొన్నాను. బస్సులో వున్న స్త్రీ శవాలను బయటకు చేరవేస్తుండగా వారి ఒంటిపై వున్న బంగారు నగలు నాలో యుక్తాయుక్త జ్ఞానాన్ని నశింపజేసాయి.

ఆ సమయంలో ఎవరి బాధల్లో వారు కొట్టుమిట్టాడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా స్త్రీ శవాల మీదున్న బంగారాన్ని ఒలిచి మూటకట్టుకున్నాను. దొరికిన లారీ పట్టుకొని వూరు చేరాను.

మిగిలినవారు కూడా ఏదోలా రోడ్డుచేరి యెవరి దారిన వారు పోతారనీ. అందరూ తలొక దిక్కుకుపోతే తర్వాత పోలీసులకు ఎవరెక్కడో, ఏమిటో తెలియక కేసు అంతటితో ముగుస్తుందని భావించాను. కానీ ఆ సమయానికి పోలీసులు అక్కడికి యెలా వచ్చారో మరి. నా ఊహంతా తలక్రిందు లయింది" అంటూ నిట్టూర్చాడు సుబ్బారావు.

సుబ్బారావు మాటలకు చిరునవ్వు నవ్వుతూ "ఆ సమనికి కారులో వైజాగు వస్తున్న ఒక వ్యక్తి ప్రత్యక్ష్యంగా ఆ ప్రమాదాన్ని చూడడం జరిగింది. అందుబాటులో ఫోను వున్నఒక యింటిని చేరి ప్రమాదం జరిగిన స్థలం తెలియజేస్తూ మాకు ఫోన్‌చేసి. తన దారిన చక్కగా పోయాడా వ్యక్తి. ఆ ఫోను అందుకుని క్షణాల మీద ప్రమాద స్థలాన్నిచేరుకున్నాం. అదీ విషయం" అన్నాడు యిన్స్పెక్టర్ షరీఫ్. □

ఆపదలో అబల

బి. రాజేశ్వరి

"హలో, వాసు అండ్ శేష డిటెక్టివ్ ఏజెన్సీయేనాండీ!"

అవతలి కంఠం ఆదుర్దాగా అడిగింది.

"అవునమ్మా!, మీరెవరు?" శేష అడిగాడు.

"నా పేరు సుమ. ఓ ఆపదలో చిక్కుకున్నాను. నన్ను మీరే రక్షించాలి!"

"తప్పకుండా! మీరిక్కడికి రాగలరా?"

"దయచేసి మీరే యిక్కడికి రండి."

"మీరెక్కడ్నుంచి మాట్లాడుతున్నారు?"

"మలక్ పేట మున్సిపల్ కాలనీ నుంచి."

"ఫోన్ నంబరు. వివరాలు చెప్పండి!"

ఆమె చెప్పింది. ఫోన్ నంబరు కూడా నోట్ చేశాడు.

"సరే, బానే వుంది. మీకొచ్చిన కష్టమేమిటో చెపుతారా?"

"అది ఫోన్‌లో చెప్పుకునేది కాదు. అందుకే మిమ్మల్ని యిక్కడికి రమ్మని కోర్తున్నాను."

"తప్పకుండా వస్తాం. డిటెక్టివ్ వాసు ఓ పనిమీద బయటికి వెళ్ళాడు. ఆయన రాగానే యిద్దరం కలిసొస్తాం."

"మీరొక్కరైనా ఫరవాలేదు. రండి!"

"ఎంతసేపు? ఓ అరగంటలో ఆయన తిరిగొస్తాడు. రాగానే వచ్చేస్తాం!"

"మీ రాకకోసం ఎదురు చూస్తుంటాను. చాలా అర్జంటు!"

"ఓ కే! మీరు ధైర్యంగా, నిశ్చింతగా వుండండి! .... మీ పేరు?"

"చెప్పాను కదండీ, సుమ!"

"అవును చెప్పారు, చెప్పారు గుర్తుంది."

"ఉంటానండి! గమ్మున వస్తారు కదూ!"

"ఆ, అం! వస్తాం!"

అవతల ఫోన్ పెట్టేసిన చప్పుడు.

శేష ఫోన్ క్రెడిల్ చేసి ఆలోచనలో పడ్డాడు.

చూడగా ఆడకూతురు! ఏం కష్టాల్లో వుండి ఫోన్ చేసిందో ఏమో! వాసు చూడబోతే యింకా తిరిగిరాలేదు. తను లేకుండా ఎక్కడికీ వెళ్ళొద్దనీ, ఏ కేసూ ఒప్పుకో

వద్దనీ గట్టిగా వార్నింగిచ్చాడు వాసు 'సకల గుణాభి రాముడు' కేసులో తననే హంతకుడుగా పోలీసులు పట్టు కున్నప్పుడు, విడిపించాక చాలా గట్టిగానే చివాట్లు వేశాడు వాసు. వాసు కృషివల్లనే తను నిర్దోషిగా విడుదల కాగలిగాడు!

శేషు మనసు యిది తలచుకున్నప్పుడల్లా వాసుపట్ల కృతజ్ఞతతో నిండిపోతుంది!

"ఏమైనా కేసులొచ్చాయా?" వాసు ఆఫీసు రూంలోకి అడుగు పెడుతూనే అడిగాడు.

శేషు చెప్పాడు.

"ఓ.కే!, వెళ్దాం పద. ఆలస్యం దేనికి?" వాసు కూచో బోయిన వాడల్లా లేచి సిద్ధమయ్యాడు.

2

పది నిమిషాల తర్వాత వాసు శేషు ఆటో దిగి మున్సి పల్ కాలనీలో సుమ చెప్పిన యింటి ముందాగి తలుపు పక్కనున్న కాలింగ్ బెల్ నొక్కారు

తలుపులు తీసిన యువతి డిటెక్టివ్ లిద్దరి వంకా చూసి "ఎవరు కావాలండీ!" అన్నది.

వాసు, శేషు ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు. పాకెట్ నోట్ బుక్ తీసి యింటి నెంబరు వెరిఫై చేసుకుని తలాడించాడు.

"నా పేరు శేషు, ఈయన పేరు వాసు డిటెక్టివ్ లం! మీ పేరు సుమగారు కాదా?" అన్నాడు శేషు.

"ఇక్కడ సుమ అనే పేరుగల వాళ్ళెవరూ లేరండి!"

"పోనీ, మా గురించి మరొకరెవరైనా మీ ఇంటి నుంచి ఫోన్ చేశారా?" వాసు అడిగాడు.

"మాకు పోలీసులతోను, డిటెక్టివ్ లతోను ఏం పని

లేదండి! ఎవరూ మీకు ఫోన్ చెయ్యలేదు."

వాసు శేషు వంక కోపంగా చూశాడు.

శేషు ఏదో సమాధానం చెప్పేలోపలే ఆమె తలుపులు మూసేసింది.

శేషుకి ఉక్రోషం వచ్చేసింది. అయినా నిగ్రహించుకున్నాడు.

"నిజం వాసూ! ఆమె చాలా తొందర తొందరగా మాట్లాడింది. గొంతులో ఏదో ఆందోళన, ఆత్రుత ధ్వనించాయి. ఏదో కష్టంలో వుందని నా దృఢ నమ్మకం. ఈమె ఏదో దాచిపెడుతోంది. ఖచ్చితంగా యిదే యింటి నంబరు. ఆమె పేరు రెండుసార్లు అడిగాను. సుమ అని రెండోసారి కూడా పేరు చెప్పింది. నేను పొరబడే అవకాశం ఏ మాత్రం లేదు!"

"మరి యీామె ఎవరూ ఫోన్ చెయ్యలేదనీ, ఆ పేరుగల వాళ్ళే లేరని ఎందుకంటున్నట్టు?"

"అదే మనం తెలుసుకోవాలి ఇప్పుడు!"

"నాకో ఆలోచన వస్తోంది."

"ఏమిటి?"

"చెపుతాను. ముందు టెలిఫోన్ డైరెక్టరీలో ఈ ఫోన్ నంబరు యెవరిదో కనుక్కుంటే కొన్ని వివరాలు తెలుస్తాయి."

"ఎవరి నంబరు యిది?"

"సుమ చెప్పిన నంబరు వీళ్ళదే అయుండాలి!"

"అయితే యీ నంబరుకి రింగ్ చేసి చూద్దాం. మళ్ళీ సుమ పలికితే యింటి నంబరు అవునో, కాదో, కన్ఫర్మ్ చేసుకోవచ్చు!"

"అందుకే ఫోన్ చేసి చూద్దాం. ఈ ఇంట్లో ఫోన్

వున్నమాట గ్యారంటీ ఇదిగో టెలిఫోన్ కనెక్షన్"
బయట నుంచి కనెక్ట్ చేయబడ్డ టెలిఫోన్ తీగెలు చూపిస్తూ అన్నాడు శేషు.

"ఓ కే. పబ్లిక్ బూత్ నుంచి చేద్దామా?"

ఇద్దరు పబ్లిక్ బూత్ చేరుకున్నారు.

శేషు నంబరు రింగ్‌చేసి అర్ధరూపాయి కాయిను వేశాడు—అవతల 'హల్లో' అన్నాక.

నంబరు చెప్పి, అదే నంబరని అవతలి వ్యక్తి ఒప్పుకున్నాక "సుమగారు కావాలండీ?" అన్నాడు.

ఆ పేరు గలవాళ్ళిక్కడ యెవరూ లేరు. ఇంతకీ మీరెవరు?"

"ఆమెకు కావలసినవాడి నండీ! ఆమె ఈ యింట్లోనే వున్న సంగతి నాకు తెలుసండీ! కాస్త ఫోన్ దగ్గరికి పిలవండి."

"ఎవరయ్యా నువ్వు? తీరిగ్గా కూచుని ఆడపిల్లలకు ఫోను చెయ్యటమేనా నీ పని? పైగా నన్ను మీడియేటర్‌గా చేసి, వార్తలు మొయ్యమంటావా? నీ కెంత ధైర్యం?"

"ఒక్కసారి పిలిస్తే పోయేదానికి యింత దండకం దేనికి సార్! దయచేసి సుమగార్ని ఒక్క నిమిషం పిలవండి, ఫోను దగ్గరికి!"

"మరోసారి చెపుతున్నాను. ఈ యింట్లో ఆ పేరు గలవాళ్ళెవరూ లేరు, ఫోను పెట్టెయ్యి!" అంటూ విసురుగా ఫోను పెట్టేశాడా వ్యక్తి.

శేషు ఫోను క్రెడిల్ చేశాడు. వాసుకి కొంత అర్థమయింది

"ఇంతకీ సుమవాళ్ళ యిల్లేనా అది?" అన్నాడు.

"అదే అర్థంకావటంలేదు. మొగతను ఫోను ఎత్తాడు.

ఆ పేరు గలవాళ్ళెవరూ లేరంటాడు. పైగా ఆడపిల్లలకు ఫోన్‌లు చేసే వాళ్ళంటే తనకున్నంత అసహ్యాన్నంతా ఫోన్‌లో కక్కేశాడు."

"ఆడగొంతుతో ఫోను చెయ్యాల్సింది. సుమ స్నేహితురాలినని చెప్పివుంటే కొంత యిన్ఫర్మేషన్ దొరికేది. సుమ యింట్లో వుండి వుండాలి. కావాలనేవాళ్ళు చెప్పటంలేదు. దీన్నిబట్టి ఆమెను ఏదో ఆపద తరుముతోందని నాకు నమ్మకం కలుగుతోంది."

"ఈ మొగతను, యిందాకటి ఆడస్త్రీ సుమకి ఏమవుతారు? సుమకి వచ్చిన కష్టమేమిటి? ఎందుకు వీళ్ళిద్దరు సుమ గురించి అబద్ధాలు చెప్పారు? ఈ విషయాలన్నీ మనం ఎంక్వయిరీ చెయ్యాలి."

"ఆఫీసులో మాట్లాడుకుందాం!"

3

"ఇదిగో యీ ఫోన్ నంబరున్న యింటి నంబరు సుమ చెప్పిన యింటి నంబర్‌తో టాలీ అయింది. అదే ఇంటికి మనం వెళ్ళొచ్చాం!" అన్నాడు శేషు టెలిఫోను డైరెక్టరీ వాసు ముందుకి తోసి.

"ఎన్. రామచంద్రరావు పేర్న వుంది ఫోన్! కరెక్టే. బయట గోడకి వున్న నేమ్‌బోర్డు నేనూ చూశాను. ఇదే పేరు."

"సో, సుమ కచ్చితంగా ఏదో కష్టాల్లో వున్న మాట నిర్వివాదాంశం! ఎలాగైనా ఆమెకి ఆ కష్టాల్లోంచి విముక్తి కల్పించాలి మనల్ని రక్షణ కోరింది కాబట్టి మనం ఫీజు కోసం చూసుకోకుండా స్వంత డబ్బు ఖర్చయినా ఈ కేసు సాధించాలి!"

"అదిసరే! ముందు ఆ యింట్లో సుమ వుందో లేదో,

ఆమెని యెక్కడయినా దాచారో దాచవలసిన అవసరం ఏముందో, ఆ మగపురుషుడు, మగనాలి ఎవరో, సుమకు ఏమవుతారో తెలుసుకోవాలి!"

"అందుకు నేనో వుపాయం ఆలోచించాను."

"ఏమిటది?"

"నేను టెలిఫోన్ రిపేరర్‌గా వేషం మార్చుకుంటాను. ఫోన్ బాగుచేస్తున్నట్టు నటిస్తూ, పరిసరాలన్నీ బాగా పరిశీలిస్తాను....సుమ గొంతు నాకు బాగా గుర్తే. ఆమె మాట్లాడటానికి అవకాశంలేని పరిస్థితిలో వుండివుంటే ఆ యింట్లో ఆమెను దాచి వుంచటానికి యెక్కడ అవకాశముందో నేను పరిశీలనగా గాలిస్తాను."

"ఆమె మనిద్దర్నీ చూసింది కదా! మనది దొంగ వేషమని గుర్తించి పోలీసుల కప్పగించెయ్యడు కదా! ఆ మొగుడెవరో నువ్వు వెళ్ళిన సమయానికి అక్కడే వుంటే నీకు దేహశుద్ధి చేయించినా ఆశ్చర్యం లేదు."

"నీ దృష్టిలో మరీ యింత అర్భకుడిగా ముద్ర పడిపోవటం నా దురదృష్టం. సరేలే, మారువేషం గుర్తుపట్టడానికి వీల్లేకుండానే వేస్తాను. చూస్తావుగా!...."

"సరే, మరి నా పని?...."

"నువ్వు నాకు సలహా చెప్పాల్సినవాడివి నా సలహా కోరటం నా అదృష్టం కాదు, నా గ్రహచారం!"

"సలహా శిష్యుడిచ్చినా, గురువిచ్చినా, అది పాటించటానికి వీలుగా వుంటే ఫరవాలేదు."

"ముందు నేను పోయివచ్చాక పరిస్థితినిబట్టి నువ్వు ఏ అవతారం ఎత్తాలో నిర్ణయిద్దాం!"

"ఆల్‌రైట్! జాగ్రత్తగా పోయిరా!"

"మన టెలిఫోన్ డిస్కనెక్టు చేసి తీసుకుపోతాను."

"ఎందుకు!"

"ఎందు కేమిటి? రిపేరర్ వెంట టెలిఫోన్, వైర్లు, స్క్రూడ్రైవర్లు. కటింగ్ ప్లేయర్ వగయిరా సరంజామా వుండాలి కదా!"

"అవునవును. రిపేరర్ ఒక్కడే పోడు సాధారణంగా యిద్దరు వెళ్తుంటారు, నేనూ రానా?"

"నువ్వొస్తే మొత్తం కథ చెడిపోతుంది. ఆ మహా తల్లి యిద్దర్నీ జమిలిగా దేహశుద్ధి చేయిస్తే....కబురు చెప్పేవాళ్ళు కూడా వుండరు గదా!"

"కరెక్టు! నువ్వొచ్చేవరకు ఆ వీధి చివర్లో రేషన్ షాపు దగ్గిర కూచుని వెయిట్ చేస్తుంటాను. ఓ అర గంటలో రాకపోతే నీకేదయినా అయిందని అనుకో వచ్చా....?"

"ఏదో కావాలని నీ కోరిక కాబోలు!"

"ఛ. ఛ! నీ కేదయినా అయితే అది నాక్కాదూ...."

"ఐ నో యిట్! వస్తా!"

4

"ఏమయింది? కాయా. పండా?" అడిగాడు వాసు.

"పండూ కాదు, కాయా కాదు."

"అదేమిటి?"

"అసలు నన్ను లోపలికి రానివ్వలేదా మహాతల్లి!"

"అదేమిటి? గుర్తుపట్టేసిందా?"

"గుర్తుపట్టలేదు గాని. మా ఫోన్‌కి ఎలాంటి రిపేరు రాలేదు పొమ్మంది. మేమసలు కంప్లైంట్ చెయ్యంది ఎలా వచ్చావంది. ఫోన్ పాడయి వారాలు గడిచినా రారుగాని, బావున్న ఫోన్‌ను ఖరాబు చెయ్యటానికి మటుకు మీ దిక్కు మాలిన టెలిఫోనువాళ్ళు తయారవుతారని టోకున అందర్నీ

తిట్టిపోసింది. సరే, అవి మనకు తగలవు కదా అని బాగా తిట్టనిచ్చాను. ఇంకా నేను పట్టుబడితే మొదటికే మోసం వచ్చేలావుందని వచ్చేశాను....''అన్నాడు శేషు విచారంగా.

"అరె. మన ప్లాన్ తలకిందులయిందే! నా అనుమానం యేమిటంటే సుమని వాళ్ళు లోపల గదుల్లో యెక్కడో బంధించారు. ఆ సంగతి పై వాళ్ళెవరికీ తెలియకుండా బాగా జాగ్రత్తపడ్తున్నారు. నా అనుమానమే నిజమయితే ఫోన్ వున్న గదిలోనే సుమను బంధించి వుండొచ్చు!''

"ఎలా చెప్పగలం? నన్ను ఫోను చూడొద్దని అభ్యంతర పెట్టిందని ఫోను సుమ వున్న గదిలోనే వుందని ఎందు కనుకోవాలి? వాళ్ళకి ఫోనుతో పని వుంటుంది కదా! క్షణ క్షణానికి సుమని బంధించిన గదిలోకి వెళ్ళటం కష్టం కదా! అది సరైన కారణం కాదు!''

"సరే, నేను కరెంటుమీటరు రీడింగు చూసే వుద్యోగి నని చెప్పుకుని వెళ్తాను. అన్నీ పరిశీలనగా చూపి వస్తాను....''

"వద్దు. మీటరు మొదటి గదిలోనే వుంది. దానివలన ప్రయోజన మేమిటి?''

వాసు బుర్ర గోక్కున్నాడు.

"మరెలాగ? సుమ సంగతి తెల్సుకునే అవకాశమే లేదా?''

"ఉంది?''

"ఏమిటది? త్వరగా చెప్పు!''

"సివిల్ సప్లయిస్ నుంచి వస్తున్నానని చెప్పు. సరిగ్గా వాళ్ళింటి దగ్గర్నుంచి కాకుండా నాలుగిళ్ళు అవతల నుంచి నీ సర్వే మొదలెట్టు వాళ్ళింట్లో ఎంతమంది మెంబర్లున్నారో, వాళ్ళ పేర్లు ఏమిటో వివరంగా రాసుకో! రేషను

కోసమని మెంబర్స్‌ని యెక్కువ చెపుతారు యిలాంటి సందర్భాల్లో! సుమ పేరు తప్పకుండా చెపుతారు. ఆమెను కుటుంబ సభ్యులతో వున్న రిలేషన్ షిప్‌కూడా చెపుతారు! అది మనకు చాలా అవసరం."

"ఆల్ రైట్.... అలాగే చేద్దాం.... అయితే ఓ చిన్న సందేహం...."

"ఏమిటది?"

"నెల క్రితమే కదా కొత్త రేషన్‌కార్డ్సు యిష్యూ చేశారు. మళ్ళీ యీ సర్వే దేనికని అడిగితే సమర్థించు కోవటం కష్టమవుతుందేమో!"

"ఏం ఫరవాలేదు. చెకింగ్ ఇన్‌స్పెక్టర్నని చెప్పు. రేషనుకార్డుల అవకతవకల్ని సరిచెయ్యటానికి వచ్చానని చెప్పు. ఈ మధ్య దొంగ రేషనుకార్డుల్ని టోకున పట్టుకొం టున్నారు కదా! అందుకోసమే ననుకుంటారు."

"సరే, వెళ్తున్నాను మరి!"

"ఇలాగేనా? చిన్న పిల్లిగడ్డం తగిలించుకో! మీసం పూర్తిగా తీసెయ్యాలి! చెంపలు బాగా పెంచుకోవాలి— అంటే మేకప్‌ద్వారా! ఇన్‌షర్టు చెయ్యాలి, పక్క పాపిట బదులు నిలువుపాపిట తియ్యాలి. ఆ చిట్టితల్లికి ఏ మాత్రం అనుమానం రానివ్వకుండా మాటలు చేష్టలు బాగా మార్చాలి!"

"అలాగే! నువ్వే చూస్తావుగా."

"గుడ్. ఎంతయినా నాకు గురుతుల్యుడివి కదా!"

5

"ఏమయింది?" అడిగాడు శేషు.

"ఏం కాలేదు! తల వాచేలా చివాట్లు మాత్రం దొరి కాయి!"

"వివరాలు చెప్పలేదా?"

"చెప్పటమా? అసలు గుమ్మం దిగేవరకు చెండుకు తిన్నది. మీ రేషను డిపార్టుమెంటు చేసేవన్నీ అపకతవక పనులే నన్నది. టెలిఫోన్ను ఎలా తిట్టివుంటుందో, నన్ను తిట్టిన తిట్లనిబట్టి తేలిగ్గా వూహించుకున్నాను. 'ఎంతో మందీ దొంగ రేషనుకార్డులమీద యిష్టమొచ్చినట్టు సరుకులు తీసుకుంటుంటే కళ్ళు మూసుకుంటున్నారా? అలాంటి వాళ్ళకి కార్డులు యెలా యిచ్చారు మొదట? లంచాలు బాగా మేశారా?' అంటూ లెఫ్ట్ రైట్ యిచ్చేపింది...."

"ఇస్తే యిచ్చింది గాని, అసలు పేర్లు అన్నీ నోట్ చేసుకున్నారా లేదా యింతకూ?...."

"చెపితే కదా చేసుకోవటానికి!"

"అదేం!"

"మాకు నీ రేషనూ వద్దు, నువ్వూ వద్దు అవతలికి పొమ్మంది. ఇంకో అయిదునిమిషాలు యిక్కడే నించుంటే న్యూసెన్సుకేస్ బుక్ చేయిస్తానంది. నాకు తెలీకడుగు తానూ, కమిషనర్లు న్యూసెన్సు కేస్‌లు బుక్ చెయ్యటం ఎప్పట్నుంచి మొదలెట్టారు?"

"ఉష్ ...! పోలీసుల గొడవ మనకెందుకు? మనం చెయ్యాల్సిన పనొదిలేసి పక్కదోవ పట్టడం బాగోలేదు. నువ్వు నేను కూడా చిన్న ఇన్ఫర్మేషను లాగటంలో ఘోరంగా ఫెయిలయ్యాం!"

"మన గీత బావుండలేదు, ఏం చేస్తాం?"

"గీతాకాదు, రాతాకాదు—చేతకాలేదు సరే, ఇప్పటి కయినా మించిపోయింది లేదు. వాళ్ళ ఇంట్లో ఇద్దరు పిల్లలున్నారు గమనించావా?"

"ఆఁ! గమనించాను. ఓ పాప, బాబు!"

"రైట్! మనం యీ సాయంత్రం వాళ్ళిద్దర్ని కిడ్నాప్ చెయ్యబోతున్నాం"

"కిడ్నాపింగా? సుఖంగా బతకాలని లేదా? కిడ్నాపింగ్ చేసింతర్వాత అడుగడుగునా మనకి కష్టాలు, అడ్డంకులు ఎదురవుతాయి. అయినా, కిడ్నాపింగ్ వల్ల ప్రయోజనం? ..."

"సుమని వాళ్ళు బంధించారు. మనం వాళ్ళ బిడ్డల్ని బంధిస్తాం. సుమని వదలిపెట్టమంటాం. అప్పుడే వాళ్ళ పిల్లల్ని వదుల్తామని బేరం పెడుతాం. లొంగివస్తారు."

"సరే. యీ సాయంత్రమే పిల్లలవేట...."

"ఓ.కే! నేనూ సిద్ధం!"

6

"ఇది మా యిల్లు కాదు. మా నాన్నగారు రమన్నారని అబద్ధాలు చెప్పి మమ్మల్ని మోసంచేసి తెచ్చారు. మాతో మీకేం పని?" ఇద్దరిలోను పెద్దవాడయిన బాబు సూటిగా అడిగాడు.

"మోసం చెయ్యలేదు. మేము ఓ ప్రశ్నకు జవాబు కావాలని మీ యిద్దర్నీ తీసుకొచ్చాం. కరెక్టుగా చెపితే మిమ్మల్ని జాగ్రత్తగా వదిలేస్తాం!"

"ఏమిటది?" బాబు నడుంకి చేతులు చేర్చి వాళ్ళిద్దరి వంకా ధైర్యంగా చూస్తూ అడిగాడు.

పోజు చూసి వాళ్ళిద్దరికీ నవ్వొచ్చింది.

"నాకు ఐస్క్రీం కావాలి!" పాప మారాం.

"ఏడవకమ్మా, ఒకటి కాదు రెండు ఐస్క్రీంలు కొంటాను, సరేనా!" వాసు ఊరడించాడు.

"నా కిప్పుడే కావాలి!"

"బజారుకి వెళ్ళి తేవాలి కదా! కొంచెం టైం కావాలి!"

"మా చెల్లెలు ఏది అడిగినా మా నాన్నగారు వెంటనే తెచ్చియిస్తారు. మీఇద్దర్లో ఎవరోకరు బజారుకుపోయి ఐస్ కాండీలు తీసుకురండి!" బాబు అథార్టీ చూసి, ఇద్దరికి అరికాలి మంట నెత్తికెక్కింది.

"ఎందుకు తేవాలి? మీ తాతగారి సొమ్మేదయినా మా దగ్గిర దాచారా?...." శేష ఉక్రోషం ఆపుకోలేక అరిచాడు.

"అదంతా మా కనవసరం. మమ్మల్ని ఎందుకు బంధించి తెచ్చారు? తెచ్చినందుకు మా క్కావలసిన అవసరాలు చూడాల్సిందే!" వేలెడంత బొట్టికాయ తమకు రూల్సు చెప్పటం చూసి వాళ్ళిద్దరికి వళ్ళు మండుకొచ్చింది.

"సరే, కొనితెస్తాంలే! ముందు మేమడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలి నువ్వు?"

"అడగండి. చెపుతాను!"

"మీ ఇంట్లో ఎంతమందుంటున్నారు?"

"నలుగురం."

"ఎవరెవరు?"

"నాన్నగారు, అమ్మ, నేను, మా చెల్లెలు...."

"ఇంకా....?"

"నీకు లెక్కలు రావా? నలుగురం అని చెప్పాను కదా! సరిపోలేదా?"

వాసు శేష ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

"నాకు ఐస్...." పాప మారాం కొనసాగించింది. శేష గుర్రుగా చూశా డా పిల్లవంక.

వాసు "సరే, చేసేదేముంది? ఈ పిల్ల గొంతెమ్మ కోరి

కలు తీర్చివస్తాను....” అంటూ బయల్దేరాడు, పాపను తీసుకుని.

“జాగ్రత్తగా వెళ్ళిరా! నేను మళ్ళీ లోపల్నుంచి గడియవేసుకుంటాను” వాసు వెనకనే వస్తూ అంతలోనే యేదో గుర్తొచ్చినట్టు, “నన్నడిగితే ఆ పిల్లని బయటికి తీసుకెళ్ళటం మంచిదికాదు. వాళ్ళ అమ్మో నాన్నో చూస్తే వెంటనే రెడ్‌హాండెడ్‌గా పట్టుకుని పోలీసులకి అప్పగించేస్తారు” అన్నాడు శేషు.

“నిజమే సుమా! అయితే యీ పిల్లని యిక్కడే వుంచి వెళ్తాను....” అని ఆ పాప వంక తిరిగి, “నీకేం కావాలో వరసగా చెప్పెయ్యి. ఒకేసారి తెచ్చి పడేస్తాను” అన్నాడు వాసు.

ఆ పాప వరసగా తనక్కావలసిన తినుబండారాలన్నీ ఏకరవు పెట్టేసింది. వాసు ఓపిగ్గా విన్నాడు.

తర్వాత ఆ బాబువంక చూసి, “నీకూ్కడా యేం కావాలో చెప్పెయ్యి చిట్టితండ్రీ! ఓ మిఠాయి దుకాణం హోల్‌సేల్‌గా ఖరీదుచేసి తెచ్చి పడేస్తాను....” అన్నాడు వాసు.

“నాకేం అక్కర్లేదులే! మా చెల్లాయి చెప్పినివన్నీ మర్చిపోకుండా తీసుకురా! మేమిద్దరం ఎలాగో అడ్జస్టు అయిపోతాంలే!” అన్నా డా కుర్రాడు దయ తలచినట్టు.

వస్తున్న కోపాన్ని అణచుకుని వాసు బయటికి వెళ్ళాడు. శేషు లోపల్నుంచి ఆఫీస్‌గదికి గడియ పెట్టేశాడు. ఇంకెక్కడయినా అయితే విషయం బయటికి పొక్కిపోతుందని ఆఫీసుగదిలోనే పిల్లలిద్దర్నీ పెట్టి వుంచారు.

శేషు మళ్ళీ ఎంక్వయిరీ కొనసాగించాడు.

"ఈ మధ్య మీ యింటికి ఆంటీ వచ్చింది కదూ? సుమ ఆంటీ, ఆమె వెళ్ళిపోయిందా?"

"సుమ ఆంటీనా....? ఎక్కడ్నుంచి వచ్చింది? రాలేదే! అయినా నాకు ఆంటీలు ఎవరూ లేరు!" కుర్రాడు చాలా కచ్చితంగా చెప్పేశాడు.

శేషు ఫోన్ ముందు కూచున్నాడు. ఓ నంబర్ డయల్ చేశాడు.

అవతల ఫోను ఎవరో ఎత్తారు. "హల్లో, ఎవరు కావాలండీ...." అంటూ అడుగుతున్నారు.

"మీ పిల్లల విషయం తెలియచేద్దామని...."

అవతలి వ్యక్తి కంఠంలో ఆత్రుత, సంభ్రమం వినిపించాయి. "ఏమిటి మీరంటున్నది? మా పిల్లలు కనిపించారా? ఏ పోలీస్ స్టేషన్నుంచి మాట్లాడుతున్నారు మీరు? ఎస్సైగారా, సూపర్నెంటుగారా?"

శేషు ఆ గొంతు గుర్తించాడు. మహాతల్లి భర్త. ఈ గడుగ్గాయిల తండ్రి!

"నేను పోలీస్‌స్టేషనుంచి కాదు మాట్లాడేది! నేను పోలీసువాడ్ని కూడా కాదు. మీ శ్రేయోభిలాషిని. మీ పిల్లలిద్దరూ నా దగ్గిర క్షేమంగా వున్నారు."

"ఎవరు నువ్వు? ఎందుకు వాళ్ళని కిడ్నాప్ చేశావు? డబ్బు కోసమా? ఎంత కావాలి?...."

"ఎంతిస్తావు?"

"నువ్వెంత కావాలో అడుగు...."

"నాకు నీ డబ్బేమీ అక్కర్లేదు."

"అవతల నుంచి కొద్దిక్షణాల వరకు రెస్పాన్స్‌లేదు. అతను బాగా ఆశ్చర్యపోయి వుంటాడని శేషు ఊహించాడు.

"ఎంత కావాలో అడుగు! అసలు నువ్వెవరు?"

"అవన్నీ నీ కనవసరం. నాకు మీ యింట్లోని ఓ వ్యక్తిని అప్పగించాలి...."

"ఏమిటి నువ్వు మాట్లాడేది? ఇంట్లో వున్నది నేనుగాక మా ఆవిడ ఒక్కతే! నువ్వు యెవర్ని అప్పగించమంటున్నట్టు...." అతని కంఠంలోంచి దూకుడుగా వినిపించింది.

"మీ యిద్దరి సంగతి కాదు....మూడో వ్యక్తిని. తెలీకుండా మీ యింటి గదుల్లో బంధించివుంచిన అమ్మాయి సంగతి నేనడుగుతున్నది...."

"రామ రామ! మేం ఏమిటి, యెవరో అమ్మాయిని బంధించట మేమిటి? మీరేదో పొరపడుతున్నారు. మేం యెవర్నీ బంధించలేదు. కావాలంటే మా యిల్లు సోదా చేసుకోవచ్చు."

"ఎందుకు బుకాయించాలని చూస్తావు? సుమని బంధించారు మీ భార్యాభర్త లిద్దరు. ఎందుకు బంధించారో, ఆమెని ఏం చెయ్యదలచుకున్నారో చెప్పు!"

"నేను నిజమే చెపుతున్నాను. అయితే సుమ అనే పేరుగల వాళ్ళ నిదివరలో యెక్కడో చూసిన గుర్తు!"

"ఇది మరో నాటకమా?"

"నాటకం కాదు నిజమే!....ఆఁ! యిప్పుడు గుర్తొచ్చింది. మా యింటి పక్క వున్న వాళ్ళమ్మాయి పేరు సుమయే! సుమలత!!"

గతుక్కుమన్నాడు శేషు.

"వాళ్ళింట్లో ఫోనుందా?" అడిగాడు.

"ఫోనా? అలాంటిదేం లేదు. ఏదైనా అవసరమొచ్చినపుడు మా ఫోనే వుపయోగించుకుంటారు!"

శేషుకి ఎక్కడో ముడి అందుతోంది.

"ఒక్కసారి నా బిడ్డలచేత మాట్లాడించు, ఫోన్‌లో"
అతని అభ్యర్థనను కాదనలేకపోయాడు శేషు.

పిల్లలిద్దర్నీ పిలిచి "మీ నాన్న మాట్లాడతాడట, మీరు మాట్లాడండి!" అన్నాడు.

ఇద్దరూ ఒక్కసారిగా ఫోన్‌మీద దండయాత్ర చేసి, శేషు చేతిలోనుంచి ఫోన్ లాగేసుకున్నారు. వాళ్ళకి ఫోన్ వదిలితే ప్రమాదమని తమ గొంతులు తండ్రికి వినిపించిన వెంటనే ఫోను లాగేసుకున్నాడు.

ఈసారి గొంతు తండ్రిది కాదు, తల్లిది!

"బాబూ కాసేపు నా బిడ్డలతో మాట్లాడనివ్వు. దయచేసి వాళ్ళనేం చెయ్యొద్దు. నీకేం కావాలో చెప్పు, యిస్తాం!" దీనంగా వుంది ఆమె కంఠం.

తనని వాసుని అదిలించిన గొంతు యిదేనా అనిపించింది. తమ ఇద్దర్నీ చీవాట్లువేసి మందలించిన గొంతేనా అనిపించింది. ఆ మనిషి వేరు. ఇప్పుడు పిల్లల క్షేమం కోసం ఆరాటపడుతున్న మాతృమూర్తి వేరు!

శేషు ఓ క్షణం ఆలోచించి, "త్వరలోనే మీ బిడ్డల్ని మీకు అప్పగిస్తాం!" అంటూ ఫోను పెట్టేశాడు.

7

తలుపు చప్పుడయింది శేషు తలుపు సందులోనుంచి చూశాడు. వాసు నిలబడి వున్నాడు తీశాడు.

"అబ్బబ్బ, బజారంతా గాలించి మరీ యీ బిడ్డల కోరికలు తీర్చటానికి సరంజామా తెచ్చాను ఇదుగో పిల్లలూ.... రండి. తినండి" అంటూ వచ్చాడు వాసు.

వెంటనే తలుపు మూపి గడియపెట్టాడు శేషు

"ఓ కొత్త సంగతి తెలిసింది" అంటూ ఫోను సమా

చారం వాసుతో చెప్పాడు.

వాసు అది విని దీర్ఘాలోచనలో పడిపోయాడు కాసేపు.

"అయితే ఆ సుపు యెవరో చాలా గడుగ్గాయి అయి వుండాలి —పోయి ఆ సంగతి అవునో, కాదో తేల్చుకొని వద్దామా?" అన్నాడు వాసు.

"మరి ఈ పిల్లలు" అర్ధోక్తిలో ఆగిపోయాడు శేషు.

"మనం వచ్చేవరకు అప్పచ్చులు తింటూ యిక్కడే వుంటారు. యేం పిల్లలూ..........యిప్పుడే వచ్చేస్తాం వుండండి!"

బాబూ సూటిగా చూస్తూ, "మమ్మల్ని మా యింట్లో దింపుతారా, లేదా!" అన్నాడు.

"అయిడియా?"

"ఏమిటది?"

"మనం ఈ రాత్రిపూట యెక్కడికీ పోనక్కర్లేదు. మన మెవరమో యెవరికీ తెలియకుండా పని జరిగిపోయే మార్గముంది."

"గమ్మున చెప్పు అదేమిటో?"

"ఫోనులో కాంటాక్టు చేసి యీ కేస్ ఫైనలైజ్ చేసేద్దాం!"

"ఓకే?"

"ఈ బొట్టికాయల బాబుకి మళ్ళీ రింగ్ చెయ్యి" అన్నాడు వాసు రిలాక్సింగా కుర్చీలో వాలి.

శేషు రింగ్ చేశాడు. వెంటనే అవతల ఫోన్ యెత్తబడింది.

"హల్లో!" అన్నాడు శేషు.

"ఆ, ఆఁ! మీరు కిడ్నాపర్‌గారు కదూ!" అన్నాడు అవతలనుంచి మహాతల్లి భర్త.

"అవును, నేనే! మీ పిల్లల్ని ఓ అరగంటలో మీ యింటికి చేరుస్తాను. అయితే మీరో పని చెయ్యాలి!"

"ఏమిటది?"

"మీ పక్కింటమ్మాయి సుమలతని ఫోన్‌మీదికి పిల వండి. ఎవరో పిలుస్తున్నారని పిలవండి. వాళ్ళింట్లో మరెవ రికీ యీ సంగతి తెలియకూడదు. మీరు కూడా ఆ అమ్మాయి మాట్లాడుతుండగా ఆ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా వుండకూడదు."

"అలాగే బాబూ, మీరు చెప్పినట్టే చేస్తాను. లైనులో వుండండి...."

ఓ అయిదునిమిషాల తర్వాత ఓ స్త్రీ కంఠం ఫోన్‌లో వినిపించింది. "హలో, నేను సుమను మాట్లాడుతున్నాను. ఎవరండీ మాట్లాడేదీ?" అన్నది.

శేషు ఆ కంఠాన్ని గుర్తుపట్టాడు. తమ ఏజన్సీకి ఫోను చేసిన అమ్మాయే, అనుమానం లేదు.

"నేనెవరో చెపుతాను. ఫోను పెట్టెయ్యకు. నీ మూలాన్నే యిద్దరు పిల్లలు—నువు ఫోను పట్టుకున్న యింటి పిల్లలు—ఆపదలో పడ్డారు. వింటున్నావా? ఫోన్ పెట్టేస్తే వాళ్ళు ఫోనుగలవాళ్ళకి దక్కరు. కాబట్టి బుద్ధిగా ఫోను పట్టుకో! నీ చుట్టుపక్కల ఫోను తాలూకు మనుష లున్నారా?"

ఆ అమ్మాయి తడబాటుని కప్పిపుచ్చుకోవటానికి వ్యర్థ ప్రయత్నం చేస్తూ "లేరు, లేరు....చెప్పండి, పూర్తిగా వింటాను ఫోను పెట్టెయ్యను. ఆ పిల్లల్ని మాత్రం యేం చెయ్యకండి. పాపం వీళ్ళ దుఃఖం చూడలేకపోతున్నాను. నాకు అడిగినప్పుడల్లా ఫోను యిస్తుంటారు, పాపం!" అన్నది.

"ఫోను ఇస్తున్నారని అడ్డమైన కూతలు ఫోనులో కూస్తావా? డిటెక్టివ్ ఏజన్సీకి ఫోనుచేసి ఆపదలో వున్నానని, వెంటనే వచ్చి రక్షించమనీ జోక్ చేస్తావా? డిటెక్టివ్‌లు నీ కంటికి మరీ అంత పనిరానివాళ్ళు, పనిలేనివాళ్ళలా కనిపించారా?"

"అబ్బెబ్బె. నా ఉద్దేశం అదికాదండి. నాకు డిటెక్టివ్ కథలన్నా, అడ్వెంచరన్నా చచ్చేంత ఇష్టమండి. అందుకని సరదాగా ఏదో ప్రయోగం చెయ్యబోయానండి....మీరు డిటెక్టివ్ శేషుగారు కదండీ. గొంతు గుర్తుపట్టాను...."

"వెంటనే మర్చిపో! నేను ఫలానా అని ఎవరికయినా చెప్పావో, ఆ పిల్లలు వాళ్ళకు దక్కరు!"

"అంతపని వద్దండీ! నే నెవరికీ చెప్పనండి. ఆ పిల్లల్ని మాత్రం క్షేమంగా వదిలెయ్యండి."

"వాళ్ళు మా దగ్గిరున్నట్టు కూడా నువ్వు ఎవరికీ చెప్పకూడదు."

"చెప్పనండి. చెపితే అందుకు నేనే కారణమని అంతా నన్నే తిడతారండి!"

"సరే, పాయింటుకు రా! మాతో ఎందుకు ఆటలాడుతున్నావు, కారణం చెప్పు!"

"అదేనండి, అలా ఆపదలో వున్నట్టు చెపితే వెంటనే వస్తారో, రారోనని చిన్న ప్రయోగం చేశానండి. కావాలనే వీళ్ళ యింటి నంబరిచ్చానండి. అయితే నా పేరే చెప్పేశానండి కంగారులో. మీరు రావటం ఎంక్వయిరీ చెయ్యటం మా యింట్లోంచి అంతా గమనించానండి! డిటెక్టివ్‌లు యెలా వుంటారో చూద్దామని నాకు యెన్నాళ్ళుగానో మనసుందండి. అదీగాక వాళ్ళు ఆపదలో వున్నవాళ్ళని యెలా రక్షిస్తారో చూద్దామనీ యింకా మనసయిందండి.

మీరు రావటం ఎంక్వయిరీ చేసి వెళ్ళిపోవటం అంతా చూశానండి! మిమ్మల్ని ఆటపట్టించాలని నా వుద్దేశం కాదండి. నాకు 'అపరాధ పరిశోధన' రెగ్యులర్‌గా చదివే అలవాటుందండి. అందులో మీరు పరిశోధించిన కేసులు గురించి ఆనందం పట్టలేక పోతుంటానండి....పొరపాటయి పోయింది, క్షమించండి!"

"అలాంటి మంచి పత్రిక చదివే పేస్తున్న నువ్వు నీ తార్కిక జ్ఞానాన్ని, ఆలోచనా శక్తిని పెంపొందించుకోవాలే గాని ప్రాక్టికల్ జోకర్‌గా ప్రయోగాలు చెయ్యకూడదు. ఇంకెప్పుడూ అలా చెయ్యకు. మరో అరగంటలో పిల్లలిద్దర్నీ భద్రంగా అప్పచెపుతున్నాం. మా పేర్లు బయటకి రానివ్వద్దని నిన్ను మరోసారి హెచ్చరిస్తున్నాను" అంటూ ఫోన్ పెట్టేశాడు డిటెక్టివ్ శేష. □

బుట్టలో లగేజి?



గోడలకు చెవులుంటాయ్!

ప్రతాప రవిశంకర్

అప్పుడే తెల్లవారుతోంది రోడ్డుమీద జనసంచారం అంతగా లేదు. నున్నటి తారురోడ్డుమీద ఆటోరిక్షా రివ్వున దూసుకుపోతోంది. గాలికి నా జుట్టు ఎగురుతోంది.

పది నిముషాల క్రితమే—విజయాటాకీస్ దగ్గర ఓ శవం పడివున్నట్టుగా వార్త వచ్చిందనీ, వెంటనే బయల్దేరి

రమ్మనీ యిన్‌స్పెక్టర్ మహేష్ ఫోన్‌చేశాడు—నేను బస చేసిన హోటల్‌కి.

రెండు రోజుల క్రితమే ఓ ముఖ్యమైన పనిమీద గుంటూరు వచ్చాను. హోటల్ శంకర్‌లో దిగాను.

ఆటోరిక్షా ఆగింది.

మహేష్ అప్పటికే అక్కడ నిల్చుని వున్నాడు. శవం చుట్టూ పోలీసులు, జనం నిలుచుని వున్నారు.

వాళ్ళను తప్పుకుని కొంచెం ముందుకు నడిచాను.

మహేష్ నన్ను చూడగానే విష్‌చేసి "ఎవరో దారుణంగా హత్యచేశారు" అన్నాడు.

వెల్లికిలా పడవున్నది శవం....గుండెల్లో కత్తి పిడి వరకూ దిగిపోయి వున్నది.

షర్టంతా రక్తంతో తడిసిపోయి వున్నది. అతనికి పాతికేళ్ళు దాటివుండవు. పైకి దువ్వుకున్న క్రాపు—కొంచెం ఖరీదైన దుస్తులు వేసుకున్నాడు. కాలి చెప్పులు దూరంగా పడివున్నాయి.

"ఈ శవం గురించి నీకు ఎలా తెలిసింది?" మహేష్‌ని అడిగాను.

"మా కానిస్టేబుల్ ఈ దారినే వెళుతూ రోడ్డుపక్కనే పడివున్న శవాన్ని చూశాడుట. ఎవరో మనిషితో స్టేషన్‌కు కబురు పంపించాడు" చెప్పాడు.

పోలీసు డాక్టరు శవాన్ని చూసి "హత్య రాత్రి ఒంటిగంట సమయంలో జరిగి వుండవచ్చు" అన్నాడు.

ఫోటోగ్రాఫరు శవాన్ని వివిధ కోణాలలో ఫోటోలు తీస్తున్నాడు.

"కత్తి పిడిమీద వేలిముద్రలు వున్నాయి" అన్నాడు ఫింగర్ ప్రింట్సు ఎక్స్‌పర్టు.

తర్వాత నేను హతుడి జేబులు వెతికాను.

షర్టుకు వున్న ఒక జేబులో ఒక రూపాయి చిల్లర దొరికింది.

రెండో జేబులో ఒక మడతపెట్టి వున్న ఇన్లాండు కవరు కనిపించింది. దానితో ఓ లాడ్జి రిసీటు, ఏవో డబ్బులెక్క రాసుకున్న కాయితాలు కనిపించాయి.

శవాన్ని మార్చ్యురీకి తరలించారు.

ఆ కవర్ని విప్పాను. ఆ ఉత్తరం చదివిన తర్వాత అతను ఆ వూరికి చెందిన వాడు కాదని సులభంగా తెలిసిపోయింది.

అతడి పేరు నరేష్‌కుమార్. బియ్యే పాసైనాడు. చలపతి అనే వ్యక్తి అతనికి గుంటూర్లో వున్న సూర్యారావు ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానని తీసుకువచ్చాడు. ఆ ఉత్తరం సూర్యారావు, చలపతికి రాసినదే.

నరేష్‌కుమార్ నంద్యాలనించి వచ్చాడు. ఊరికే రాలేదు. నాలుగువేల రూపాయలతో వచ్చాడు.

నన్ను చూస్తూ మహేష్ అడిగాడు "ఏదయినా క్లూ దొరికిందా?"

"అవును. ఈ ఉత్తరం చదువు" అన్నాను కవరు అందిస్తూ—

తర్వాత ఆ లాడ్జింగ్ రిసీట్ తీశాను.

'మధుబాల లాడ్జింగ్'

అంటే నరేష్‌కుమార్ మధుబాల లాడ్జింగ్‌లో బసచేశాడన్న మాట.

"ఇప్పుడు మనం మధుబాల లాడ్జింగ్‌కు వెళ్ళాలి" అన్నాను మహేష్‌తో—

"ఒక పని చెయ్యి....నువ్వు ఒక్కడివే వెళ్ళు....నన్ను

చూశారంటే ఎవ్వరూ సరయిన ఇన్ఫర్మేషన్ యివ్వరు" అన్నాడు మహేష్.

"అదీ నిజమే....మనం అనుమానిస్తున్నట్టు నరేష్ కుమార్‌ను వెంట తీసుకువచ్చిన చలపతి ఈ హత్య చేసి వుండొచ్చు....అతను దొరికితే నీకు ఫోన్ చేస్తాను" అన్నాను.

సరేనన్నాడు మహేష్.

మళ్ళీ ఆటోరిక్షాలో బయల్దేరాను.

కేసు చాలా సులభమైనదిగానే కనపడుతోంది.

నంద్యాలనించి నరేష్‌కుమార్‌ను చలపతి సూర్యారావు ద్వారా ఉద్యోగం ఇప్పిస్తానని నాలుగువేలతో తనతో తీసుకుని బయల్దేరాడు. ఇక్కడకు వచ్చిన తర్వాత అతన్ని విజయాటాకీస్ దగ్గరకు తీసుకువచ్చి హత్యచేసి నాలుగు వేలు తీసుకుని ఎక్కడికో పారిపోయి వుంటాడు.

2

నన్ను పరిచయం చేసుకున్నాను, నా విజిటింగ్ కార్డు యిస్తూ.

"నమస్కారం....కూర్చోండి" అన్నాడు మేనేజర్.

"మీ లాడ్జింగ్‌లో బసచేసిన నరేష్‌కుమార్, చలపతి గదిలో వున్నారా?" అనడిగాను.

"లేరండీ....రాత్రి పది గంటల సమయంలో బయటకు వెళ్ళారు....మళ్ళీ తిరిగిరాలేదు."

"ఒక్కసారి వాళ్ళిద్దరు వున్న గదిని నాకు చూపిస్తారా?"

అప్పుడు మేనేజర్‌కు అనుమానం వచ్చింది.

"ఎందుకు సార్ వాళ్ళగురించి అడుగుతున్నారు?" అన్నాడు.

"నరేష్‌కుమార్ విజయాటాకీస్ దగ్గర హత్య చెయ్య

బడ్డాడు. ఎవరో అతన్ని కత్తితో పొడిచి హత్యచేశారు” చెప్పాను.

“మైగాడ్ .... నిజంగానా?” అన్నాడు షాక్ తిన్న వాడిలా—

“అవును. అతనిగురించి ఇంకా నాకు కొన్ని వివరాలు కావాలి. ముందు అతని గది చూపించండి.”

“పదండి” అంటూ నన్ను అతను నూట పన్నెండో నెంబరు గది దగ్గరకు తీసుకువెళ్ళాడు.

“ఇదే గది. డూప్లికేట్ కీ తీసుకు వస్తాను” అని రెండు నిముషాల తర్వాత వచ్చి గది తలుపు తెరిచాడు.

ఇద్దరం లోపలకు వెళ్ళాము.

గదిలో టేబిల్‌మీద ఒక నల్లరంగు సూట్కేసు, ఓ జిప్ బ్యాగ్ వున్నాయి.

స్టాండుమీద ఒక పువ్వుల లుంగీ వేల్లాడుతోంది.

సూట్కేసు లాక్ చేసి లేదు. తెరిచాను.

దాన్లో ఒక జత బట్టలు, ఒక చిన్న ఫైలు కనిపించాయి. ఫైల్లో పాసుపోర్టు సైజు ఫోటో, బియ్యే డిగ్రీ సర్టిఫికెట్లు వున్నాయి.

మేనేజర్ మవునంగా నిలుచుని వున్నాడు.

తర్వాత జిప్ బ్యాగ్ తెరిచాను. అందులో రెండు జతల బట్టలు, ఒక టవలు, లుంగీ వున్నాయి.

ఆ బ్యాగ్ చలపతిది అయి వుండాలి.

నల్ల సూట్కేసు నరేష్‌కుమార్‌ది. అందులో నాలుగు వేల రూపాయలకోసం వెతికాను. కనిపించలేదు.

“రాత్రి పది గంటలకు వాళ్ళిద్దరు వెళ్ళిపోయిన తర్వాత చలపతి మళ్ళీ తిరిగి వచ్చాడా?” అడిగాను.

“రాలేదండీ. ఇద్దర్లో యెవ్వరూ తిరిగిరాలేదు.”

అంటే—నరేష్‌కుమార్ బయటకు వెళ్ళేటప్పుడు నాలుగు వేలు తీసుకు వెళ్ళాడు.

"నరేష్‌కుమార్‌కు వాచీ, ఉంగరం వున్నాయా?"

"ఉన్నాయండీ. చేతికి రికో గడియారం వుంది. వేలికి నీలంరాయి వుంగరం కూడా వున్నది."

నా అంచనా నిజమయ్యింది. కేవలం డబ్బు, ఆ వస్తువుల కోసమే హత్య జరిగింది.

ఇక ఆ గదిలో వెతకవలసింది ఏదీ లేదనిపించింది.

మే మిద్దరం గదిలో నించి బయటకు వస్తున్నప్పుడు ఒకతను హడావిడిగా మాకు ఎదురు వచ్చాడు.

"ఎవరు మా గది తలుపులు తెరిచిందీ" కోపంగా అరిచాడు రావటంతోనే—

అతనే చలపతి అని గ్రహించి ఆశ్చర్యపోయాను. నా అంచనా తారుమారయింది.

"ఇతనే చలపతి" అన్నాడు మేనేజర్.

తల వూపి మేనేజర్‌ని వెళ్ళమని చెప్పాను.

"రండి. మీతో మాట్లాడాలి" అని చలపతిని లోపలకు తీసుకువచ్చాను.

అతను లావుగా—పొడుగ్గా వున్నాడు. ముప్పయ్ అయిదేళ్ళ వరకు వుండొచ్చు. నల్లగా వున్నాడు.

"ఇప్పుడు మీరు ఎక్కడినించి వస్తున్నారు?" అడిగాను.

"ఇంతకీ మీరెవరు?" అన్నాడు చలపతి సందేహంగా.

నా విజిటింగ్ కార్డు ఇచ్చాను.

"నా తోటి మీ కేమిటి పని?" అన్నాడు కంగారుగా—

"ముందు నే నడిగిన ప్రశ్నకు జవాబు చెప్పండి. ఇప్పుడు మీరు ఎక్కడినించి వస్తున్నారు?" అన్నాను.

"విజయవాడ నించి వస్తున్నాను."

"ఎప్పుడు వెళ్ళారు?"

"రాత్రి పదిన్నరకు?"

"నరేష్‌కుమార్‌ని యెక్కడ వదిలి వెళ్ళిపోయారు."

"ఆర్టీసి బస్టాండ్ దగ్గర."

"మీరు విజయవాడ యెందుకు వెళ్ళారు?"

"సూర్యారావు కోసం. అతను నాలుగువేల రూపాయలు తీసుకుని వస్తే నరేష్‌కుమార్‌కు వుద్యోగం ఇప్పిస్తానని లెటర్ రాశాడు. రాత్రి పది గంటలకు నేను, నరేష్‌కుమార్ సూర్యారావు కోసం అతని ఇంటికి వెళ్ళాము. అతను విజయవాడ వెళ్ళాడనీ రెండు రోజుల వరకు రాకపోవచ్చు ననీ చెప్పారు అతనింట్లో. అప్పుడు నేను అతని కోసం విజయవాడ వెళ్ళాను" చెప్పాడతను.

"మీరిద్దరు బయటకు వెళ్ళేటప్పుడు నరేష్‌కుమార్ దగ్గర నాలుగువేల రూపాయలూ వున్నాయా?" అడిగాను.

అతను ఉలిక్కిపడి "ఈ విషయాలు మీకెలా తెలుసు?" అని అడిగాడు.

"చెబుతాను. అతని దగ్గర డబ్బు వుంది కదూ."

"అవును. ఒకవేళ సూర్యారావు ఇంట్లోనే వుంటే అతనికి యివ్వటానికి నేనే తీసుకురమ్మన్నాను. అంతేకాదు. ఆ లాడ్జింగ్‌లో అంత డబ్బు వుంచటానికి నాకు మనస్కరించలేదు" అన్నాడు.

"అంత డబ్బు అతని దగ్గర వున్నట్టుగా ఇంకెవరికయినా తెలుసా?"

"ఏమో? నాకు తెలీదు. ఎందుకీ ప్రశ్నలన్నీ అడుగుతున్నారు. నరేష్‌కుమార్‌కు ఏమయ్యింది?" అనడిగాడు ఆత్రంగా—

అతను నిజమే చెబుతున్నాడని నాకు అనిపించింది. అతని ప్రవర్తన అనుమానస్పదంగా లేదు.

నరేష్‌కుమార్ హత్య చెయ్యబడినట్లు చెప్పాను.

అతను పిచ్చిగా నావైపు చూశాడు. ఆ వార్తను నమ్మలేకపోయాడు.

"ఎప్పుడు?" అన్నాడు కొంచెం సేపటి తర్వాత.

"రాత్రి పన్నెండు గంటల తర్వాత యెవరో కత్తితో పొడిచి చంపేశారు. అతని దగ్గర వున్న నాలుగువేలతో అతని గడియారం వుంగరం కూడా తీసుకుపోయారు."

చలపతికి ఏడుపు వచ్చింది.

బలవంతంగా కన్నీటిని ఆపుకుంటూ "దారుణం. అతను నిరుద్యోగి. ఉద్యోగం వస్తుందనే ఆశతో నాతో వచ్చి ఇలా ప్రాణాలు పోగొట్టుకున్నాడా?" అన్నాడు బాధగా.

"అవును. ఇప్పుడు మీరు ఇక్కడకు రాకుండా వున్నట్లయితే మా అనుమానం మీ మీదకు మళ్ళివుండేది. హంతకుడి వేలిముద్రలు కత్తి పిడిమీద వున్నాయి. వాటితో మీ వేలిముద్రలను పోల్చిచూస్తే మీరు నిర్దోషని సులభంగానే తేలిపోవచ్చు. కాని ఇప్పుడు మనం అసలు హంతకుడిని పట్టుకోవటానికి కొంచెం టైము తీసుకుంటుంది. కాని ఒకటి మాత్రం నిజం. ఈ లాడ్జింగ్‌లో వున్న మనిషి యెవరో అతన్ని హత్య చేసివుండాలి. ఏ రూమ్ సర్వీసింగ్ బాయో మీ మాటలు వినివుండవచ్చు. బాగా గుర్తు చేసుకోండి" అన్నాను.

"కాదు. రూమ్ సర్వీసింగ్ బాయ్ కాదు నేను బస్సులో వెళుతూ చూశాను. కూల్‌డ్రింక్ షాపు దగ్గర నరేష్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఓ మనిషిని చూశాను" అన్నాడు చలపతి.

"ఎవరా మనిషి?" ఆత్రంగా అడిగాను.

చెప్పాడు అతను.

3

"హల్లో. జగదీష్‌ను మాట్లాడుతున్నాను. నరేష్ కుమార్‌ను హత్యచేసిన హంతకుడు ఇక్కడే ఈ లాడ్జింగ్ లోనే వున్నాడు. నువ్వు నీ అనుచరులతో బేడీలు కూడా తీసుకుని వెంటనే వచ్చెయ్యి" అని ఫోన్ పెట్టేశాను.

మేనేజర్ ఆశ్చర్యంగా "ఏమిటీ హంతకుడు మా లాడ్జింగ్‌లో వున్నాడా!" అన్నాడు.

"అవును. ఇంకో ఐదు నిముషాల్లో మీరే చూస్తారు" అన్నాను.

ఐదు నిముషాలు తర్వాత పోలీసు జీపు వచ్చి బయట ఆగింది.

ఇన్‌స్పెక్టర్ మహేష్, పోలీసులు లోపలకు వచ్చారు.

"ఎక్కడ హంతకుడు?" అన్నాడు మహేష్ మీసాలు దువ్వుకుంటూ.

వాళ్ళందరినీ నూట పన్నెండో నెంబరు గది ఎదురుగా వున్న గది దగ్గరకు తీసుకువెళ్ళాను.

పది నిముషాలు తలుపుమీద తట్టిన తర్వాత "ఎవరూ?" అంటూ యెవరో వచ్చి తలుపు తెరిచారు.

మా ఎదురుగా నల్లగా, పొట్టిగా వున్న మనిషి గళ్ళ లుంగీ కట్టుకుని నిల్చునివున్నాడు. అతని వంటిమీద షర్టు లేదు. అతనికి ముప్పయ్యేళ్ళు వుండొచ్చు. అతని కళ్ళు ఎర్రగా, ఉబ్బివున్నాయి. ఆ గదిలో బ్రాందీ కంపు బాగా కొడుతోంది.

"ఇతనే" అన్నాడు చలపతి.

అతను పోలీసులను చూడటంతోనే కంగారుపడి

పోయాడు. మత్తు దిగిపోయినట్లుంది. ఎటయినా పరిగెత్తి పోవాలనే ప్రయత్నం చెయ్యబోయాడు.

"ఇతనే హంతకుడు. ఈ గదిని సోదా చెయ్యండి...." అన్నాను.

పోలీసులు గదిలో జొరబడినారు.

గదిలో టేబిల్‌కింద ఒక బ్రాందీ సీసా, గ్లాసు కనిపించాయి. బెడ్ కింద నాలుగువేల రూపాయలూ, వాచీ ఉంగరం దొరికాయి.

"మైగాడ్ ఇతను హంతకుడా!" అంటూ నోరు తెరిచాడు మేనేజర్.

తల వూపాను.

"ఇతని పేరు జోగిరాజు. అమలాపురంనించి వచ్చాడు" అన్నాడు మేనేజర్.

ఇన్‌స్పెక్టర్ మహేష్ హాండ్‌స్టిక్‌తో అతని డొక్కలో పొడిచి "చెప్పు. నరేష్‌కుమార్‌ను నువ్వే కదూ చంపింది" అన్నాడు.

తల వూపాడు అతను.

"అతన్నెలా హత్య చేశావ్?" అన్నాను.

"వాళ్ళిద్దరూ ఆ డబ్బుతో సూర్యారావును కలుసుకోటానికి వెళ్ళబోతున్నట్టు నా గది బయట నిలబడి మాట్లాడుకోవటం విన్నాను. నాకు డబ్బు అవసరంగా వుంది. కత్తితో ఇద్దర్నీ వెంటాడాను. చలపతి బస్సెక్కిన తర్వాత నరేష్‌కుమార్‌ని కలుసుకున్నాను. కబుర్లు చెప్పి పన్నెండు గంటలవరకూ తిప్పాను. చివరకు విజయాటాకీస్ దగ్గర చీకటిగా వున్న చోటుకి రాగానే అతని నోరు నొక్కి కత్తితో పొడచి డబ్బు వాచీ, ఉంగరం తీసుకుని వచ్చేశాను" అన్నాడు తల దించుకుంటూ. □

గుడ్డి దర్బారు

వసుంధర సీరియల్

(గత సంచిక తరువాయి)

రాంబాబు రమా నర్సింగ్ హోమ్‌ను కనుక్కోవటానికి గంటపైనే పట్టింది. డాక్టర్‌ను కలిపి మాట్లాడి రాంబాబు తిరుగు పయాణం కావడానికి కూడా ఇంచుమించు అంత సేపూ పట్టింది. మళ్ళీ రమా నర్సింగ్‌హోంను మరిచి

పోకుండా అతడు కొన్ని కొండ గుర్తులు కూడా పెట్టు కున్నాడు.

రాంబాబు. గౌరిని వదిలిన చోటుకు వచ్చి చేరాడు.

అక్కడ గౌరి లేదు!

రాంబాబుకు గుండె ఆగినట్లయింది. గౌరి ఏమయింది? ఎక్కడకు వెళ్ళింది? తనకు తానై ఎక్కడికేనా వెళ్ళిందా— లేక....

ఓ క్షణం తర్వాత రాంబాబు గుండెధైర్యం చిక్కబట్టు కుని పరిసరాలు గమనించాడు. పక్కనే ఓ టీ దుకాణం వుంది.

రాంబాబు దుకాణం సమీపించి యజమానితో— "బాబూ—నా చెల్లెలు గుడ్డిది. అడ్రస్ వెతకడం కోసం దాన్ని కొద్దిసేపటి క్రితం ఇక్కడ వదిలివెళ్ళాను. తీరా ఇప్పుడొచ్చి చూస్తే యిక్కడ లేదు. మీరు చూశారా?" అన్నాడు.

టీ దుకాణం యజమాని నవ్వి—"అరే భాయీ! ఇది మహాపట్నం. ఇక్కడ కళ్ళున్నవాళ్ళకే అటూ యిటూ మసలడం కష్టం. గుడ్డిదెక్కడికి పోతుంది?" అన్నాడు. తర్వాత రాంబాబు అమాయకమైన ముఖం చూస్తే జాలి కలిగిందో ఏమో—"నేను చూడలేదు భాయీ! ఇక్కడే ఎక్కడో కాస్త నీడచాటుకు చేరి వుంటుంది. జాగ్రత్తగా చూడు—" అన్నాడు.

రాంబాబు ఆ ప్రాంతాల నాలుగుపక్కలా వెతికాడు. ఉన్నట్లుండి అతడికి గౌరి కనబడింది. దాంతో అతడికి ప్రాణం లేచి వచ్చినట్లయింది.

ఫుట్‌పాత్ పక్కన కూర్చుని తనలోనే తనే నిశ్శబ్దంగా ఏడుస్తోందామె.

రాంబాబు ఆమెను సమీపించి—"అరే! నువ్విక్కడున్నావా? నీ కోసం ఇందాకట్నించీ వెదుకుతున్నాను?" అన్నాడు.

"ఎవర్నువ్వు?" అంది గౌరి.

"అదేమిటి—అలాగడుగుతావు—నేను నీ అన్నయ్య రాంబాబుని—" అంటూ రాంబాబు ఆమె చేయి పట్టుకున్నాడు.

గౌరి ఆ చేతిని బలంగా విదుల్చుకుని—"నువ్వు నా అన్నయ్యవైతే నా పేరు చెప్పు—" అంది.

రాంబాబు ఆశ్చర్యపోతూ—"గౌరి!" అన్నాడు.

"అమ్మ పేరు చెప్పు!" అంది గౌరి.

"సరస్వతి—"

"నాన్న పేరు—"

"రామదాసు—"

"మనూరి పేరు—"

"సింహపురి...." అని—"గౌరీ—ఏమిటీ పిచ్చి ప్రశ్నలు?" అన్నాడు రాంబాబు.

గౌరి అతడి ఛాతీపై తల వాల్చి—"అన్నయ్యా—" అంటూ ఏడ్వడం మొదలుపెట్టింది. రాంబాబు కొద్ది క్షణాల సేపు అప్రయత్నంగా ఆమె తల నిమిరాడు.

"ఎందుకే ఏడుస్తావు? ఆలస్యమయిందనేగా—అందుకు నేనేం చేయను చెప్పు—ఇదెంత పెద్ద పట్నమో కళ్ళతో చూస్తేనేకానీ తెలియదు. ఓ మైలు నడవాలంటే మూడు గంటలు పడుతుంది. ఇక్కడేవున్న డాక్టరుగారిల్లు తెలుసుకోడాని కింతసేపు పట్టింది—జనం మరీ పిచ్చివాళ్ళలా అటూ యిటూ పరుగెత్తడమే కానీ యెవరికీ సాయం చేయడం ఏమీలేదు—నీ కళ్ళు రాగానే అంతా నువ్వే

చూస్తావుగా—" అన్నాడు రాంబాబు.

"అన్నయ్యా—డాక్టర్‌గారితో మాట్లాడేవా?" అంది గౌరి నెమ్మదిగా.

"ఆఁ ఆయనెంత మంచివారో తెలుసా? చూడ్డానికి దొర బాబులాగున్నాడు? నన్ను చూసి మీరు, మీరు—అండీ, అండీ—అంటూ మన్నన మొదలుపెట్టాడు. నేనే దెబ్బలాడి మానిపించాను. ఆయన నీకు తప్పక చూపు తెప్పించగల డని నాకు నమ్మకం కలిగింది—" అన్నాడు రాంబాబు.

గౌరితో కలిపి రోడ్లు దాటడం కష్టమని అక్కడే ఓ రిక్షా మాట్లాడాడు రాంబాబు. ఇద్దరూ రిక్షాలో నర్సింగ్‌హోం చేరుకున్నారు.

రిసెప్షనిస్టు వారికి ఆరోనంబరు గది తాళంచెవి ఇచ్చింది. ఇద్దరూ ఆ గదిలోనే మకాంపెట్టారు. డాక్టర్ గౌరి కనులు పరీక్షించి — రెండు రోజుల్లో ఆపరేషన్ చేస్తానని అన్నాడు.

10

రెండురోజులు ఇట్టే గడిచిపోయాయి.

గౌరి ఆపరేషన్ థియేటర్లో వుంది.

డాక్టర్ ఆపరేషన్ థియేటర్లోనికి వెళ్ళడానికి ఆప్రాన్ వేసుకుంటూండగా రాంబాబు ఆయన్ను సమీపించి—"డాక్టర్‌గారూ—నా చెల్లికి నయమవుతుంది కదూ?" అనడిగాడు.

నవ్వుతూనే డాక్టరు సీతాపతిరావు అతని భుజం తట్టి లోనికి వెళ్ళాడు. రాంబాబు ఆపరేషన్ థియేటర్ వైపే శూన్యంలోకి చూస్తున్న వాడిలా చూస్తూ కూర్చున్నాడు.

అలా ఎంతసేపు కూర్చున్నాడో రాంబాబుకే తెలియదు. సీతాపతిరావే స్వయంగా వచ్చి "రాంబాబూ-ఆపరేషన్

జయప్రదంగా ముగిసింది” అనేదాకా అతడు వేరే ఏదో లోకంలో వున్నాడు.

“నిజమా డాక్టర్! నా చెల్లెలికి చూపొచ్చిందా?” రాంబాబు ఉలిక్కిపడి లేస్తూ అన్నాడు.

“వచ్చిందనే అనుకోవచ్చు. కానీ అప్పుడే కట్లు విప్పడానికి లేదు కొద్ది రోజులు ఆగాలి” అన్నాడు డాక్టరు.

సరిగ్గా వారం రోజుల అనంతరం గౌరి కళ్ళకున్న పట్టీ తొలగించబడింది. ఆమె నెమ్మదిగా కనులు తెరిచింది. ఏమీ కనబడలేదు.

రెప్పలు తటతట లాడించింది. ఈ పర్యాయం ఆమెకు అస్పష్టంగా ఏదో కనబడింది. అస్పష్టమైన ఆ ఆకారం క్రమంగా రూపురేఖలు దిద్దుకుంటూంటే “అన్నయ్యా” అంటూ కేకపెట్టింది గౌరి.

రాంబాబు ఆమె పక్కనే కూర్చుని “ఏమే నేను కనబడుతున్నానా? నిజంగా చెప్పు—నన్ను చూసే అరిచావు? లేక ఏమీ కనబడక సాయంకోసం పిలిచావా?” అని ఆత్రుతగా అడిగాడు.

“సాయంకోసం పిలిచినప్పుడు నువ్వు నా పక్కన లేవు. ఇప్పుడు నాకు ఎవరి సాయం అక్కర్లేదు. అన్నయ్యా నా కన్నీ కనబడుతున్నాయి” అంది గౌరి.

“పట్టీ ఇప్పుడే కదా విప్పాం-ఇప్పు డీమెకు విశ్రాంతి అవసరం” అన్నాడు డాక్టరు సీతాపతిరావు.

అంతా ఆ గదిలోంచి బయటకు వెళ్ళారు.

అప్పుడు గౌరి తన చీర కొసనవున్న ముడి విప్పింది. అందులోంచి ఒక వస్తువు బయటపడింది. చాలా రోజుల్నుంచి ప్రాణానికి ప్రాణంగా దాచుకుంటూ, కాపాడుకుంటూవస్తున్న వస్తువది.

అది ఒక పులిగోరు పతకం!

గౌరి దాని వంకనే సునిశితంగా చూస్తోంది. కాసేపలా చూసి మళ్ళీ దాన్ని చీరకొంగుకు ముడివేసి ఓసారి భారంగా నిట్టూర్చింది.

ఆ రోజుకు గౌరి నర్సింగ్ హోంలోనే వుండి పోయింది.

రాంబాబు డాక్టరుకు ఆ రోజే మొత్తం ఫీజు చెల్లించి "ఈ డబ్బుతో మీ ఋణం తీరిపోయిందని నేననుకోవడం లేదు. మీరు మాకు చేసిన మేలుకు జన్మ జన్మలకూ తీరని ఋణం పేరుకుపోయింది" అన్నాడు.

"రేపు మీరు బయల్దేరి వెళ్ళిపోవచ్చు. నీ చెల్లెలికి పట్నం చూపించాలనుకుంటే మాత్రం ఇక్కడ ఒకటి రెండు రోజులుండి వెళ్ళడానికి నాకే అభ్యంతరమూ లేదు" అంటూ డాక్టర్ సీతాపతిరావు ఆప్యాయంగా రాంబాబు వంక చూశాడు.

"లేదు డాక్టర్ ఇప్పుడు మేము పొందుతున్న ఆనందం దాన్ని మొత్తం ఊరు ఊరందరితో కలిపి పంచుకునేదాకా మాకు తృప్తి వుండదు. ఊళ్ళో అంతా ఆత్రంగా మా కోసం యెదురుచూస్తూంటారు" అన్నాడు రాంబాబు.

"సరే మీ యిష్టం" అన్నాడు సీతాపతిరావు.

11

మర్నాడు అన్నాచెల్లె లిద్దరూ గ్రామానికి తిరుగుప్రయాణ మయ్యారు.

బస్టాండుకు చేరేలోగా రాంబాబు గౌరికి పట్నం వింతను చూపించాడు. గౌరి అంతా ఉదాసీన భావంతో వింటున్నది. పట్నం చూస్తున్నానన్న ఉత్సాహంగానీ, తను చూడగలుగుతున్నానన్న సంతోషంగానీ ఆమె పొందడం

లేదని గ్రహించడానికి రాంబాబుకి కొంతసేపు పట్టింది

అతడు చెల్లెలి వంక అదోలా చూసి "అదేమిటీ పోయిన కళ్ళు మళ్ళీ రావడమంటే పోయిన ప్రాణం తిరిగిరావడం కన్న కష్టం. నీ అదృష్టం మాటల్లో అలా ఇలా అని చెప్పుకోలేనంత గొప్పది. కానీ నువ్వు అదోలా కనబడు తున్నావు. ఏమయిందో నాతో చెప్పకూడదూ?" అనడి గాడు.

గౌరి రాంబాబు వంక అదోలా చూసి "ఊహకందని అదృష్టం ఒకోసారి మనుషుల్ని మూగవాళ్ళని చేస్తోంది. పోగొట్టుకున్న చూపు మళ్ళీ వచ్చింది నాకు. కానీ నా గుడ్డి తనపు చీకటిలో చూపుకంటే విలువైన దేదైనా పోయిం దేమోననిపిస్తోంది నాకు. అన్నయ్యా! నేను పోగొట్టుకున్న వన్నీ మళ్ళీ దొరుకుతాయంటావా?" అంది.

"ఇంకేం పోగొట్టుకున్నావే? నీ వంటిమీద బంగారం లేదు. పట్నంలో ప్రమాదమని నీ గొలుసు, గాజులు అమ్మ ఇంటి దగ్గరే వుంచేసింది. మరి డబ్బంతా నా దగ్గరే ఉంచు కున్నాను" అన్నాడు రాంబాబు.

"నేనేం పోగొట్టుకున్నానో యెవరికే తెలియకపోతే అంతకంటే నాక్కావలసినదేముందన్నయ్యా?" అంది గౌరి అదోలా.

ఇద్దరూ బస్టాండు చేరారు. సరిగ్గా అప్పుడే సింహ పురి వెళ్ళే బస్సు బయల్దేరబోతోంది. రాంబాబు, గౌరి వెంటనే అందులో ఎక్కారు.

బస్సు సాయంత్రానికల్లా వాళ్ళను జగన్నాథపురం బస్సు స్టాండు చేర్చింది. బస్సుస్టాండు దగ్గర ఓ ఎడ్లబండి ఆగి వున్నది. గౌరి ఆ బండిని చూస్తూనే "అది సెట్టిబండి కదూ" అంది. అంటూనే ఆమె తనకు మామూలుగా అల

వాహైన పద్ధతిలో బస్సు దిగగానే చెంగు చెంగున యెగురు కుంటూ బండి దగ్గరకు వెళ్ళింది.

సెట్టి బండికి పక్కనే వున్నాడు. ఆయన గౌరిని చూపి ఉలిక్కిపడి "అరే—గౌరి!" అన్నాడు.

"అంతా కులాసాగా వున్నారా?" అంది గౌరి.

"ఏం తల్లీ—నీకు చూపొచ్చిందా?" అన్నాడు సెట్టి ఉత్సాహంగా.

ఈలోగా రాంబాబు అక్కడికి వచ్చి జరిగిందంతా చెప్పాడు.

సెట్టి ఉత్సాహానికి మేరలేదు. ఆయ నక్కడికి వచ్చిన పని వేరు. దుకాణానికి కొంత సరుకు తీసుకువెళ్ళవలసి వుంది. కానీ ఆయన ఆ పని వెంటనే వాయిదా వేసుకుని ప్రక్కనున్న హోటల్‌వాడితో "అబ్బాయ్ సరుకు నీ దగ్గరే వుంచు—రేపొచ్చి తీసుకుని వెడతాను" అని "పదండర్రా మనం ముందు ఊళ్ళోకి వెళ్ళాలి. నీకు చూపు రావడమంటే ఇలాంటలాంటి విశేషం కాదు" అన్నాడు.

గౌరికి చూపు వచ్చిందన్న వార్త గ్రామంలో పెద్ద సంచలనం కలిగించింది. అసలు సెట్టి బండివెనకే కొంత మంది పరుగెత్తుకుంటూ వచ్చారు. గౌరి ఇల్లు చేరగానే వాళ్ళింటి ముందు జనం తీర్థప్రజలా వున్నారు

అందరూ చూసి వెళ్ళడమయ్యాక గౌరి మిత్రబృందంలో కొందరు మాత్రం అక్కడ మిగిలారు. వారిలో మునసబు గారి మనుమడు ప్రసాద్ కూడా వున్నాడు. వాడికి గౌరి చూపు పోయినప్పుడు నమ్మకం కుదరలేదు. ఆ విషయం నమ్మడానికి అప్పుడు కొన్ని పరీక్షలు చేసి—ఆ తర్వాత స్థిరపర్చుకున్నాడు. అలాగే యిప్పుడు గౌరికి చూపు వచ్చిం దన్నా అతడికి నమ్మకం కుదరలేదు.

ప్రసాద్ గౌరికి కొంచెం దూరంగా నిలబడి "అక్కా నువ్వు నిజంగా చూడగలవా?" అనడిగాడు.

గౌరి రెండడుగులు ముందుకు వేసి మృదువుగా వాడి నుదుటిమీద చుంబించి "నీ చిన్నారి మోము నాకు ఎంచక్కా కనిపిస్తోంది" అంది.

అప్పుడు ప్రసాద్ తన కుడిచేతి రెండు వేళ్ళు చూపించి "ఆగు ఇవెన్నో చెబితేగానీ నీకు చూపు వచ్చిందని నేను నమ్మను. నేనంత సులభంగా మోసపోయేవాణ్ణి కాదు. తెలిసిందా?" అన్నాడు.

గౌరి వాణ్ణి పరీక్షగా చూపింది. గంభీరమైన వాడి ముఖం చూడగానే ఆమెకు వాడి నేడిపించాలనిపించి— "నాలుగు!" అంది.

ప్రసాద్ గర్వంగా నవ్వి అందరి వంకా గొప్పగా చూశాడు "మీరెవ్వరూ తెలుసుకోలేకపోయారు. అక్కను డాక్టరు మోసం చేశాడు. అప్పుడే డబ్బిచ్చేశారో ఏమో అక్కకు నిజంగా చూపు రాలేదు."

"అలాగనేయకురా ప్రసాద్ నా కింకో అవకాశమివ్వు" అంది గౌరి.

"సరేలే—ఈ సారితో నిజం పూర్తిగా తేలిపోతుంది" అంటూ ప్రసాద్ ఆమెకు నాలుగు వేళ్ళు చూపించాడు.

గౌరి ముఖం గంభీరంగా మారిపోయింది "ప్రసాద్ నువ్వు నీలం చొక్కా వేసుకున్నావు. అవునా?"

"అవునక్కా!"

"తెల్ల నిక్కరు వేసుకున్నావు."

"అవును".

"హవాయి జోళ్ళు తొడుక్కున్నావు."

"అవును."

"అరే—మరి నిక్కరుకు బొత్తాలు పెట్టుకోలేదేం?"

ప్రసాద్ ఉలిక్కిపడి చూసుకున్నాడు. నిజంగానే బొత్తాలు పెట్టుకోలేదు. వాడు సిగ్గుపడి బొత్తాలు గబగబా పెట్టుకుంటుంటే మిగతావాళ్ళంతా నవ్వేశారు.

"అరే నీ వేళ్ళెన్నో చెబుదామంటే కనబడ్డంలేదు. కానీ నీ ముక్కుపక్కన చీమిడి....ఛీఛీ...." అంది గౌరి.

ప్రసాద్ లేని చీమిడిని తుడుచుకుని "అక్కా—నీకు నిజంగా కళ్ళు వచ్చేశాయి. నన్నేడిపిస్తున్నావు. అంతే కదూ?" అన్నాడు.

గౌరి చటుక్కున వాడి నెత్తుకుని "నా తమ్ముడి కెన్ని తెలివితేటలో—అన్నీ ఇట్టే కనిపెట్టేస్తాడు" అంది.

అందులోని వ్యంగ్యానికి అక్కడున్న వారంతా నవ్వితే గౌరి తన్ను నిజంగానే పొగిడిందనుకుని ప్రసాద్ కూడా గర్వంగా నవ్వాడు.

12

చూపు వచ్చినప్పట్నించీ గౌరిలో మునుపటి ఉత్సాహం లేదు ఆ విషయాన్ని ఆమె అన్న తల్లి, మిత్రబృందం—అందరూ గుర్తించారు. అయితే యెవరడిగినా గౌరి ఏమీ చెప్పేదికాదు.

సరస్వతి మాత్రం రోజు కొక్కసారైనా అడిగేది "నువ్వు మునుపటి గౌరివి కాదు. ఎప్పుడైనా ఇంత కుదురుగా వున్నావా నువ్వు?"

"నేను కుదురుగా వుండడం నీ కిష్టమే కదమ్మా!"

"ఏమో యెలాంటి వాళ్ళు అలా వుండడమే నాకు నచ్చుతుంది. నా గౌరి అల్లరి చేస్తూ నన్నేడిపిస్తేనే నాకు బాగుంటుంది."

"ఇంకా ఎన్నాళ్ళిలాగమ్మా—నేను పెద్దదాన్నౌతున్నాను

కదా" అంది గౌరి ఆరిందాలా.

అవును. గౌరి పెద్దదవుతోంది. సరస్వతి వులిక్కిపడి "అవునే—నాకీ విషయం అనిపించనేలేదు సుమా!" అంది సరస్వతి.

"నాకూ అనిపించలేదమ్మా—పట్నం వెళ్ళి వచ్చేదాకా" అంది గౌరి.

ఆమె పెద్దరికం విషయంలో ఎవరి కెటువంటి సందేహా లున్నప్పటికీ రాంబాబు మాత్రం చెల్లెలి కోసం పెళ్ళి సంబం ధాలు చూస్తూనే వున్నాడు.

మొత్తం మీద ఓ మంచి సంబంధం దొరికింది. వియ్యపురాలు సరస్వతికి చిన్ననాటి స్నేహితురాలు. వియ్యంకుడు డాక్టరు. అబ్బాయికి బ్యాంకులో ఉద్యోగం. కుర్రాడు చూడ్డానికి చాలా బాగున్నాడు.

రాంబాబు కీ సంబంధం అన్ని విధాలా నచ్చడంతో పెళ్ళి చూపులకు ముహూర్తం పెట్టించుకుని వచ్చాడు.

పెళ్ళి చూపులనగానే గౌరి కలవరపడింది. అప్పుడే నా పెళ్ళికి ఏం తొందర—అంటూ గునిసింది.

రాంబాబు నవ్వి "ఆడపిల్లలంతా ఇలాగే అంటారు. పెళ్ళయ్యాక పుట్టింటికి పిలిస్తే ఆయనకు భోజనం కుదర దన్నయ్యా అంటూ కుంటి సాకులు చెబుతారు" అన్నాడు.

"నేను నిజంగానే చెబుతున్నాను. కొన్నాళ్ళాగు అన్నయ్యా—నాకేమిటో భయంగా వుంది" అంది గౌరి.

"అలాగే—సరిగ్గా పదిరోజులు ఆగుతాను. సరా?" అన్నాడు రాంబాబు.

పెళ్ళివా రొచ్చేది సరిగ్గా పది రోజుల తర్వాతనే!

గౌరి రోజూ ఉదయమే లేచి స్నానంచేసి దేవుడి ముందు దీపంపెట్టి ఓ అరగంటసేపు పూజలో వుంది

పోయేది.

గౌరి చూపించే ఈ భక్తి సరస్వతికి చాలా ఆశ్చర్యం కలిగించేది "ఏమిటే—ఈ మధ్య నీకు భక్తి యెక్కువై పోయింది?" అనడిగింది కూతుర్ని.

"ఒకోసారి మనిషిని దేవుడు తప్ప ఇంకెవ్వరూ రక్షించలేరమ్మా—దేవుడైతే మాత్రం—తన్నంత తాను రక్షించడు కదా—రోజూ పూజలు చేస్తున్నది అందుకే అంది గౌరి.

ఒకసారి కళ్ళుపోయి రావడంతో గౌరి మనసు చెదిరిందని సరస్వతి అనుకుంది—"పిచ్చిపిల్ల—ఆ దురదృష్టానికి చెదిరిపోయింది. ఈ అదృష్టానిక దీని మనసు చెదిరిపోయింది. పెళ్ళయితే కానీ యిది మామూలు మనిషి కాదు."

ముహూర్తం రోజు పెళ్ళివారు రానే వచ్చారు.

గౌరిని అలంకరించి చాపమీద కూర్చోబెట్టారు. ఆమె ముఖం ఎత్తకుండా అలా కూర్చుని వుంది.

వియ్యంకుడు, వియ్యపురాలు గౌరిని ఏవో ప్రశ్నలు వేశారు. ఆమె నెమ్మదిగా వాటికి సమాధానాలు చెప్పింది కానీ తలెత్తలేదు.

"అమ్మాయికి మరీ సిగ్గు ఎక్కువనుకుంటాను—" అంది వియ్యపురాలు.

"ఒక్కసారి మా అందరికీ ముఖం చూపిస్తే బాగుంటుంది—" అన్నాడు వియ్యంకుడు.

వరుడు ఆత్రుతగా చూస్తున్నాడు. ఇందాకా ఆమెను చూశాడు. మరొక్కసారి ఆమెను చూడాలని వుంది.

"గౌరి చాలా అందమైనది!" అనుకున్నాడతను. ఫోటో తీయడానికి సిద్ధంగావున్న కెమేరాలా వున్నాయతడి

కళ్ళు.

గౌరి తల ఎత్తలేదు. సరస్వతి తనే వెళ్ళి కూతురి ముఖం పైకి ఎత్తింది. అంతే—గౌరి రెండు చేతులతోటీ ముఖం కప్పుకుంది. ఎత్తిన తల చటుక్కున క్రిందకు దిగి పోయింది.

భళ్ళున డోక్కున్నదామె!

అక్కడ చేరినవారందరూ నిశ్చేష్టులైపోయారు.

"ఏమయింది?" అంది వియ్యపురాలు.

"కడుపులో తిప్పుతున్నట్లున్నదమ్మా—" అంది గౌరి తల్లితో. సరస్వతి చటుక్కున ఆమె పక్క గదిలోకి తీసుకుని వెళ్ళి మంచంవేసి పడుకోమంది.

వియ్యంకుడు అ గదిలోకి తనూ అడుగుపెట్టి—"నేను డాక్టర్నని తెలిపి—పెళ్ళి కాకుండానే నా కోడలు నాకు పని చెబుతోంది. ఒక్కక్షణం తప్పుకోండి—" అంటూ గౌరి చేయి పట్టుకుని నాడి పరీక్షించి చూశాడు.

గౌరి ఆయనవంక చూడడం లేదు ఆమె కళ్ళు మూసుకునే వుంది. మనిషి యెందుకో భయపడుతున్న దనిపిస్తోంది.

వియ్యంకుడు యెంత మృదువుగా ఆమె చేయిని పట్టుకున్నాడో అంత విసురుగానూ వదిలిపెట్టి హాల్లోకివచ్చాడు. ఆయనలోని మార్పు గమనించి రాంబాబు, సరస్వతి ఆయన్ను కంగారుగా అనుసరించారు.

"మీ రీ పెళ్ళిచూపులు ఎందుకు ఏర్పాట్లు చేసినట్లు?" అన్నాడాయన.

"అదేంటి బాబూ—అలా అడుగుతున్నారు—పెళ్ళిచూపు లెందుకేర్పాటు చేస్తారు—పిల్లలకు పెళ్ళి చేయడానికే

కదా—" అంది సరస్వతి.

"మీ పిల్లకు పెళ్ళయిపోయింది. మగడెవరో మీకు తెలియకపోతే ఆ పిల్లనే అడిగి తెలుసుకోండి." అని భార్యవంక తిరిగి - "స్నేహితురాలు స్నేహితురా లన్నావు-అయిందా? అదృష్టంకొద్దీ మోసం గ్రహించగలిగాం. ఇకముందు నీతో స్నేహంలేని వారింటికే-పెళ్ళిచూపులకు వెడదాం—" అని ఆ పక్కనే వున్న ప్రెసిడెంటువంక తిరిగి—"అయ్యా—ప్రెసిడెంటుగారూ—అమ్మాయి ఈ ఊరికే రత్నమన్నారు. మీ ఊరి రత్నా లెలాగుంటాయో మచ్చు చూశాం—ఇక ముందైనా మచ్చు చూపించేటప్పుడు జాగ్రత్తగా వుండకపోతే మీ ఊరికే చెడ్డపేరు వస్తుంది—" అని కొడుకు వంక చూసి—"ఉద్యోగాల్లో నిన్ను పూర్వానుభవం ఏదైనా వుందా అని అడిగారు కదా అని అదో గొప్ప అనుకోకు. పెళ్ళి విషయంలో మాత్రం పూర్వానుభవం వున్నవాళ్ళు పనికిరారు. తెలిసిందా పద—పోదాం—" అన్నాడు.

వాళ్ళు ముగ్గురూ అక్కడో ఫెనుతుఫాను సృష్టించి వెళ్ళిపోయారు. ఆయనన్న మాటలన్నీ గౌరిమీద తనకు కలిగిన అక్కసు ప్రదర్శించడానికేనని సరస్వతి అర్థం చేసుకుంది. ఆమె దీనంగా ప్రెసిడెంటువంక చూసి—"బాబూ! ఇలా జరిగిందేమిటి? ఇప్పుడేం చేయాలి? నా కేమీ పాలుపోవడంలేదు—" అంది.

ప్రెసిడెంటు నిరసనగా తల తిప్పుకుని అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

ఆ ఇంట్లో మళ్ళీ ముగ్గురే మిగిలారు.

పక్కనున్న గదిలోంచి గౌరి ఏడుపు వినిపిస్తున్నది.

సరస్వతి, రాంబాబు గౌరి వున్న గదిలోకి వెళ్ళారు.

గౌరి కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్నది.

సరస్వతి విసురుగా గౌరీని సమీపించి—"ఇప్పుడేడుస్తా వెందుకే? ఇంటి పరువంతా గంగలో కలిపావు. అయిన వాళ్ళను నాకు శత్రువుల్ని చేశావు. అసలేం జరిగింది? వాడెవరు?" అంటూ నిలదీసింది.

"నాకేమీ తెలియదమ్మా—ఇందులో నా తప్పేమీలేదు. అంతా నాకు తెలియకుండానే జరిగిపోయింది—" అంటూ గౌరి మళ్ళీ ఏడ్వసాగింది.

అంతవరకూ వియ్యంకుడు పొరబడ్డాడేమోనని సరస్వతికి ఏ మూలో ఆశ వుంది. కూతురి ఈ మాటలలో ఆమెకు ఈ ఆశకూడా పోయింది.—"అయితే అంతా నిజమే నన్నమాట—ఎంత పని చేశావే పాపిష్టిదానా—" అంటూ ఆమె కూతుర్ని సాచి లెంపకాయ కొట్టింది.

"నన్ను కొట్టద్దమ్మా—చంపెసేయ్—" అంది గౌరి.

రాంబాబు ఆ దృశ్యం చూడలేకపోయాడు అతనక్కణ్ణించి ఇంకో గదిలోకి వెళ్ళిపోయాడు. వెళ్ళగానే అతడికి కనిపించినది తండ్రి ఫొటో!

రాంబాబుకు ఏడుపు వస్తోంది.—"నాన్నా! నే నిప్పుడేం చేయాలి? నా కేమీ తోచడంలేదు. మీరే చెప్పండి—" అన్నాడతను ఏడుస్తూనే.

13

మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ భోజనాలు చేయలేదు. అసలు ఇంట్లో మనుషులున్న అలికిడే లేదు. గౌరి తన గదిలోంచి కదలడంలేదు.

సరస్వతి కాసేపటికి మామూలు మనిషి కాగలిగింది. ఊరికే గౌరిని నిందించి ఏం లాభం? అసలేం జరిగిందో గౌరిని లాలించి అడిగి తెలుసుకోవాలి. ఇంతకీ వాడెవరో?

గౌరి బుద్ధిమంతురాలు. అదిలాంటి తప్పెలా చేసింది?

సాయంత్రం సరస్వతి కంచంలో భోజనం తీసుకుని కూతురి గదిలోకి వెళ్ళింది. గౌరి భోంచేయనంది.

"నువ్వు భోంచేయనంటే నేను చచ్చిపోతాను—" అంది సరస్వతి.

"కానీ నాకు అన్నం తినాలని లేదమ్మా—"

"అసలేం జరిగిందో నీ అమ్మకు్కూడా చెప్పవా?" అంది సరస్వతి.

మళ్ళీ గౌరి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఈ వూళ్ళో నీ కింత ఘోరం తలపెట్టగల వారున్నారంటే నమ్మలేకపోతున్నాను. వాడెవరో చెప్పు!" అంది సరస్వతి.

గౌరి ఒక నిశ్చయానికి వచ్చి మంచంమీద తలగడ క్రిందనుంచి ఒక వస్తువు తీసింది. సరస్వతి ఆశ్చర్యంగా చూసింది అదో పులిగోరు పతకం!

"ఏమిటమ్మా ఇది!" అనడిగింది సరస్వతి.

"అంతా చెబుతానమ్మా!" అంది గౌరి. ఉన్నట్లుండి ఆమె కళ్ళు ఎర్రబడ్డాయి. పులిగోరు పతకంచుట్టూ ఆమె ఎడంచేతి పిడికిలి బిగిసింది.

* * *

పట్నంలో టీ దుకాణందగ్గర నిలబెట్టి రాంబాబు అలా వెళ్ళిన అయిదు నిముషాలకు చలం గౌరిని సమీపించి చేయి పట్టుకుని—"పద!" అన్నాడు.

సరిగ్గా అప్పుడే బస్సొకటి అలా వెళ్ళింది. ఆ శబ్దంతో కలిపి ఆ మాటలు విన్నది గౌరి.

"అన్నయ్యా! డాక్టర్‌గారిల్లు తెలిసిందా?" అనడిగిందామె ఆత్రుతగా.

"ఊఁ" ముక్తసరిగా అన్నాడు చలం.

చలం ఆమెను నడిపిస్తున్నాడు. ఆమె ఏమేమో అడుగుతూంటే ముక్తసరిగా సమాధానాలిస్తున్నాడు. కాస్త ఎక్కువగా మాట్లాడవలసి వచ్చినపుడు దగ్గడమో బస్సు వచ్చేదాకా ఆగడమో చేస్తున్నాడు. అలా ఇద్దరూ కొంతదూరం నడిచి ఓ పెద్ద భవంతి వెనకవైపుకు చేరారు.

అప్పుడే అక్కడే పక్కనవున్న ఆలయంలో గంటలు మ్రోగాయి.

"అన్నయా—అదే ఆలయం—శివాలయమా?" అంది గౌరి.

చలం దగ్గు నటిస్తూ—"ఏదో ఒకటి—నీ కెందుకూ?" అన్నాడు.

ఆమెను దొడ్డిదారిని తీసుకునివెళ్ళి ఒక హాల్లో కూర్చోపెట్టాడు. మళ్ళీ దగ్గుతూ—"డాక్టర్ని పిలుస్తాను?" అని అక్కణ్నుంచి బయటపడి — భవంతి ముందువైపుకు వెళ్ళాడు.

అదొక డ్రైక్లీనింగ్ దుకాణం. కౌంటర్లో యజమాని గోపాలకృష్ణ కూర్చుని వున్నాడు.

చలం గోపాలకృష్ణను సమీపించి నెమ్మదిగా—"కొత్త పిట్ట వచ్చింది బాస్!" అన్నాడు.

"గోపాలకృష్ణ చలంతో గుసగుసలాడాడు. తర్వాత జేబులోంచి ఓ వందరూపాయల నోటు తీసి ఇచ్చి—తను అక్కణ్ణించి బయల్దేరుతూ—"వీరయ్యా!...." అని పిలిచాడు.

లోపల్నుంచి ఓ మనిషి వచ్చాడు—"నేను ఓ గంటలో వస్తాను. అందాకా నువ్వు కౌంటర్లో కూర్చో!" అన్నాడు.

గోపాలకృష్ణ షాపులోంచి బయటపడి దొడ్డిదారిన హాల్లోకి ప్రవేశించి గౌరిని చూపి—"పిట్ట చాలా బాగుంది"

అనుకున్నాడు.

గౌరి అడుగుల చప్పుడు విని కుర్చీలోంచి లేచి నిల బడింది. తన అన్నయ్యే వచ్చివుండాలనుకుని "అన్నయ్యా!" అంది.

"అన్నయ్య కాదు—కన్నయ్యా—" అన్నాడు గోపాల కృష్ణ.

"కన్నయ్యంటే?" అనడిగింది గౌరి.

"కన్నయ్యంటే తెలియదూ? గోపాలకృష్ణుడికి గోపికలు ముద్దుగా పెట్టుకున్న పేరు—" అన్నాడు గోపాలకృష్ణ.

గౌరి కంగారుగా—"ఎవర్నువ్వు?" అంది.

"నీ వెలికాడిని—ఓ గంటసేపు మాత్రం!" అన్నా డతను. అతడామె చేయి పట్టుకున్నాడు. ఆమె విదుల్చు కొంది.

గౌరి బలానికి అతడాశ్చర్యపోయాడు—"అలా విది లించకు ప్రియా! నీ కౌగిలిలో నన్ను కరిగించు—" అంటూ కవిత్వం ప్రారంభించాడు.

"నీముదా—నోర్ముయ్!" అంది గౌరి.

"నా పెనాలతో నీ పెదాలు మూయాలనే వుంది నాకు. నీ అనుమతి లభిస్తే అంతకంటే కావలసినదేముంది?" అంటూ అతడామెను బలంగా కౌగలించుకొని ముద్దు పెట్టుకోబోయాడు.

అంతకంటె బలంగా గౌరి అతణ్ణి ఒక్కతోపు తోసింది. అతడు వెనక్కు పడబోతూ తమాయించుకుని మళ్ళీ ఆమె చేయి పట్టుకున్నాడు గౌరి విసురుగా యెడమచేయి ఎత్తింది. ఆ చేయి గోపాలకృష్ణను తాకలేదు పక్కనే బల్లమీద వున్న అందమైన ఖరీదైన ఫ్లవర్ వాజ్ ఒకటి ఆ చేతికి తగిలి క్రిందపడి ముక్కలయింది.

"బాప్‌రే—ఏం బలం నీది—" అనుకున్నాడు గోపాల కృష్ణ. అతను పగిలి నేలమీద వున్న పింగాణీ ముక్కల్ని చూస్తూ "ప్రియా-వాటంచూస్తే నువ్వటూ యిటూ పరుగు లెత్తేలా వున్నావు. ఇక్కడ పగిలిన పింగాణీ ముక్కలు నీ పాదాలకు బాధను కలిగిస్తేనే చూడలేను...." అంటూ చటుక్కున ఆమె నడుం పట్టుకుని పైకెత్తి మెరుపు వేగంతో ఓ గదిలోని మంచంమీదకు చేర్చాడు.

తాను అసహాయురాలైనట్లు గ్రహించింది గౌరి "బాబూ నువ్వెవరివో నాకు తెలియదు. నేను గుడ్డిదాన్ని. నన్ను న్యాయం చెయ్యకు" అంది.

గోపాలకృష్ణ నవ్వాడు—"ఇలాంటి సమయాల్లో కళ్ళెం దుకు? కళ్ళున్న వాళ్ళే పరవశంతో కళ్ళు మూసుకునే ఘడియలివి!"

"నన్ను వదిలిపెట్టు. నీకు సరదాలుంటే డబ్బున్న వాళ్ళతో తీర్చుకో. నేను పేదరాల్ని. నన్ను కనికరించు"

"ప్రియా — ఉన్నవాడు వున్నవాణ్ణి దోచుకుంటే అందులో సరదా ఏముంది? లేనివాళ్ళను దోచుకోవడంలోనే ఆనందం! నేను నిన్ను దోచుకోవడం లేదు. ప్రేమిస్తు న్నాను. ఉన్నవాడి ప్రేమను లేనివాళ్ళు కాదనడం పాపం. ఇది నీకు అపూర్వానుభవం. అనుభవించు. నాతోపాటు ఆనందించు" అంటూ అతడామెను బలంగా కౌగలించు కున్నాడు.

గౌరి పెనుగులాడుతోంది కానీ తన బలం చాలడం లేదని ఆమెకు తెలిసిపోయింది.

గదిలో ఏదో పెట్రోల్ వాసన వేస్తోంది. దూరంగా మళ్ళీ గుడిగంటలు మ్రోగుతున్నాయి. గౌరి బలం తరుగు తోంది. గోపాలకృష్ణ బలం పెరుగుతోంది.

గౌరికి తన శరీరంపై అదుపు తప్పింది. ఆమెకు స్పృహ కూడా తప్పినట్లే వుంది. ఏం జరుగుతుందో తెలియని దశలో ఆమె అక్కడ కొంతసేపుంది. ఆమెకు పూర్తిగా తెలివి వచ్చే సమయానికి అక్కడింకెవ్వరూ ఉన్నట్లు లేదు. ఆమె చేతిలో మాత్రం ఏదో వస్తువు వుంది. గౌరి కాసేపు తడిమితడిమి చూసి—చివరకు చెంగున ముడివేసుకుంది. పెనుగులాటలో అది తన చేతికి చిక్కినట్లామె ఊహించింది.

గౌరి నెమ్మదిగా మంచం దిగింది. తనకు చేతనైనంతలో ఆమె బట్టలు సవరించుకుంది. జుత్తు సవరించుకుంది. నెమ్మదిగా తడుముకుంటూ అక్కణ్ణించి బయటపడింది.

తానెక్కడికి వెడుతోందో, ఏం చేస్తోందో గౌరికి తెలియదు. హాల్లోంచీ వరండా చేరిందామె. ఒక్కక్షణం నిస్సత్తువగా అనిపించి చతికిల బడిపోయిందామె.

మళ్ళీ ఆమెకు గుడిగంటలు వినపడ్డాయి.

అప్పుడే అక్కడకు ఒక స్త్రీ వచ్చింది. ఆమెను గోపాలకృష్ణ పంపించాడన్న విషయం గౌరికి తెలియదు. ఆ స్త్రీ, గౌరిని సమీపించి—"ఎవరమ్మా నువ్వు! రోడ్డుపక్కన కూర్చున్నావు?" అంది.

"అరే—నేను రోడ్డుమీదకు వచ్చానన్న మాట" అనుకుంది గౌరి. ఆ స్త్రీని "ఎవర్నువ్వు?" అనడిగింది.

"కూరలమ్ముకునే దాన్ని!" అందామె

"అక్కా—నేను గుడ్డిదాన్ని. ఇల్లేదో, రోడ్డేదో నాకు తెలియదు. నన్ను కాస్త మూడు లాంతర్ల దగ్గరున్న టీ కొట్టు సమీపంలో దిగవిడుస్తావా?" అనడిగింది గౌరి.

"దానికేం భాగ్యం — నేనూ అటే వెడుతున్నాను" అందా స్త్రీ.

గౌరి లేచి నిలబడి కొద్దిగా తడబడుతూ—"అక్కా నా బట్టలు కాస్త సరిచేయవూ?" అంది.

ఆ స్త్రీ జాలిగా గౌరివంక చూసి ఆమె చెప్పినట్లే చేసింది.

"ఇలా ఒంటరిగా తిరుగుతున్నావేం? కూడా ఎవ్వరూ లేరా?" అని ఏమీ ఎరగనట్లడిగిందా స్త్రీ.

"లేకేం—అన్నయ్య వున్నాడు. త్వరగా వెళ్ళకపోతే నాకోసం వెతుక్కుంటాడు కూడా!" అంది గౌరి.

ఇద్దరూ కదిలారు.

"అక్కా—మనం బయల్దేరిన చోట ఎవరుంటున్నారు?" అనడిగింది గౌరి.

"నువ్వు వెర్రిదానిలాగున్నావు. అక్కడ రెండువేల మంది వుంటున్నారు. ఎవరి పేరని చెప్పను? అయినా నాకు మాత్రం అంతా తెలుసా, ఏమన్నానా?" అందా స్త్రీ. ఇద్దరూ నడుచుకుంటూ కొంత దూరం వచ్చాక—"అలా తిన్నగా నడుచుకుంటూ వెళ్ళావంటే టీ దుకాణం వస్తుంది" అని చెప్పి ఆ స్త్రీ వెళ్ళిపోయింది.

గౌరికి ముందడుగు పడలేదు. ఆమె అక్కడే చతికిల బడి ఏడ్వసాగింది.

ఆమె ఏడుస్తూండగానే అక్కడికి రాంబాబు వచ్చాడు.

* * *

"వాడిగురించి నాకు తెలపింది ఇదొక్కటే!" అంది గౌరి తన పిడికిలి విప్పి పతకాన్ని మరోసారి తల్లికి చూపిస్తూ.

"ఎంతపని జరిగిందమ్మా—ఇదంతా నాకు ముందే యెందుకు చెప్పలేదు?" అంది సరస్వతి బాధగా.

"దేవుడు రక్షించకపోతాడా అనుకున్నానమ్మా—ఆయన

రక్షించలేదు" అంది గౌరి.

"నీ కన్నతల్లిని కాబట్టి ఇదంతా నేను నమ్ముతున్నాను కానీ ఊళ్ళో యెవ్వరూ యిది నమ్మరమ్మా—ఆ దేవుడే నిన్ను కాపాడాలి!" అంది సరస్వతి.

ఆ రోజునుంచీ గౌరి పూజలు మానేసింది. సరస్వతి పూజలు ప్రారంభించింది. ఆమె పూజలు చేస్తూంటే గౌరికి నచ్చేది కాదు.

"అమ్మా—నాకోసం నేను చేసిన పూజలే ఫలించ లేదు. నా కోసం నువ్వు చేస్తే వింటాడంటావా ఆ దేవుడు?" అంది గౌరి తల్లితో నిరసనగా.

"ఇప్పుడాయన తప్ప మనకు వేరే ఆధారం ఎవ్వరూ లేరమ్మా—ఆయన్నుగూడ నమ్మకపోతే జీవితమే దుర్భర మైపోతుంది" అంది సరస్వతి.

అయితే మనసులో ఆమెకు బెంగగానే వుంది. కూతు రికి వచ్చిన కష్టం ఆమె జీవితం నాశనం కావడానికేనని సరస్వతికి అనిపిస్తోంది.

గౌరి మళ్ళీ మామూలుగా వుండడానికి ప్రయత్నిస్తోంది. జరిగింది తల్లికి చెప్పుకున్నాక ఆమె మనసు కాస్త తేలిక పడింది. రాంబాబుకూ తల్లిద్వారా జరిగిందేమిటో తెలిసింది. అయితే అతనీ విషయంలో తప్పెవరిదో తేల్చుకోలేకపోతూ- చెల్లెల్ని తప్పించుకుని తిరుగుతున్నాడు.

14

పద్మావతీదేవి పుట్టింటికి వచ్చినట్లు తెలిసింది గౌరికి. వచ్చి రెండ్రోజులయింది. వచ్చి పలకరిస్తుందేమోనని ఆశించింది గౌరి. కానీ ఆమె రాలేదు. తనే వెళ్ళి స్నేహితు రాలిని పలకరించాలనుకుంది గౌరి.

"వద్దమ్మా—వాళ్ళింటికి వెళ్ళొద్దు" అంది సరస్వతి.

అంతకు మించి ఎక్కువగా ఆమె కూతుర్ని వారించలేదు.

"లేదమ్మా—ఒకసారి దాన్ని పలకరించి వస్తేగానీ నా మనసు మనసులో వుండదు" అంటూ బయల్దేరింది గౌరి.

గుమ్మంలో వుండగానే ఆమెకు విమల కనబడింది.

"ఎక్కడికే విమలా—దేవి ఇంటికా?" అంది గౌరి.

"కాదే—దుకాణానికి" అంది విమల.

"సరే—పద—నేను దేవి యింటికి వెడుతున్నాను. దారిలోనే కదా—కలిసే వెడదాం" అంటూ మెట్లు దిగింది గౌరి.

విమల చటుక్కున ఏదో గుర్తుకొచ్చిన దానిలా—"నా మతిమరుపు మండినట్లే వుంది. దుకాణానికని బయల్దేరి డబ్బులు తెచ్చుకోవడం మర్చిపోయాను" అంటూ మరో మాట అనకుండా వెనక్కు తిరిగింది.

గౌరి వెళ్ళిపోతున్న విమలవంకే ఆశ్చర్యంగా చూపి మెట్లు దిగేలోగా—"నీ కింకా అర్థం కాలేదామ్మా — నీ స్నేహితులు నిన్ను వెలివేశారు. ప్రెసిడెంటుగారింటికి వెళ్ళకు. నా మాట విను" అంది సరస్వతి వెనుకనుంచి.

గౌరి క్షణం ఆగి — "దేవి అలాంటిది కాదు" అని ముందడుగు వేసింది. దారిలో ఆమెకు నాని ఎదురయ్యాడు.

"అరే—నానీ కనిపించడం లేదే—దీపావళి దగ్గరపడుతోంది. ఈసారి నీకు టాంబు లెవరు చేస్తార్రా?" అంది గౌరి.

"దుకాణంలో కొనుక్కొంటాలే!" అని వెళ్ళిపోయాడు వాడు క్షణమైనా ఆగకుండా.

గౌరికి చెంపదెబ్బ తగిలినట్లనిపించింది. నాని అలా ప్రవర్తిస్తాడని ఆమె అనుకోలేదు. ఆమె నడకలో వేగం తగ్గింది. ఉత్సాహం తగ్గిపోయింది.

దారిలో యిళ్ళ అరుగులమీద కూర్చున్న వారెవ్వరూ ఆమెను పలకరించడం లేదు. పైగా ఆమెను చూడగానే వారిలో ఏమేమో గుసగుసలు!

ఊళ్ళో తన హోదా దిగిపోయిందని గౌరికి అర్థమయింది. కానీ యిందులో తన తప్పేముంది? ఆలోచిస్తూనే ఆమె ప్రెసిడెంటుగారిల్లు చేరింది.

ప్రెసిడెంటు వీధి అరుగుమీదే వున్నాడు "చూడమ్మా దేవి కోసమనే నువ్వు వస్తే — అది నీతో మాట్లాడనని చెప్పమంది. ఇనుముతో చేరిన పాపానికి నిప్పుకు సుత్తి దెబ్బలు తగుల్తాయని అది భయపడుతోంది. ఇంకేమీ అడక్కుండా వెళ్ళు" అంటూ చటుక్కున లోపలకు వెళ్ళి తలుపులు మూసేసుకున్నాడు.

"గౌరి ఈ ఊరికి బిడ్డ కాదు. అమ్మ!" అన్న ప్రెసిడెంటు ఆయన ఈ రోజామెను తన యింట అడుగు పెట్టనివ్వడంలేదు.

గౌరికి ఏడుపు వచ్చింది. ఆమె పరుగెత్తుకుంటూ ఇల్లు చేరి నేలమీద కూలబడి కాసేపు ఏడ్చింది. ఆమె ఏడుస్తూండగా అక్కడికి సరస్వతి వచ్చింది. కూతురి ఏడుపును పట్టించుకోకుండా "దేవిని చూశావా?" అంది.

గౌరీ భోరున ఏడ్చి "అమ్మా—నాకింత విషమివ్వు" అంది.

"విషం నే నివ్వడమెందుకూ? నీకలా రాసిపెట్టి వుంటే ఆ భగవంతుడే తెచ్చి యిస్తాడు. అన్నింటికీ దేవుడిమీద భారం వేయి" అంది సరస్వతి.

"అమ్మా—ఊరు ఊరంతా నన్ను వెలివేసింది" అంది గౌరి.

"నిన్నే కాదు. నిన్ను కన్నందుకు నన్నూ వెలివేసింది"

అంది సరస్వతి.

"అమ్మా—ఇందులో మన తప్పేముంది? మనమేం పాపం చేశాం? ఊరంతా యిలా కక్ష కట్టడం న్యాయమేనా?" అంది గౌరి.

న్యాయాన్యాయాల గురించి గౌరికి సరస్వతి వంటి సామాన్యురాలేం చెప్పగలదు? ఆమె కూతుర్ని సమీపించింది. ఆమె తలపై చేయివేసింది. "ఈ సమాజం ఓ గుడ్డిదర్బారు లాంటిది. న్యాయస్థానాలకు మల్లే యీ సమాజానికి చెవులే కాని కళ్ళు లేవు. ఈ గుడ్డి సమాజంలో అత్యాచారాన్ని వహించి బ్రతకడంగూడా నేరమే! నీ అపరాధాన్ని దేవుడు మన్నించవచ్చు. చట్టం మన్నించవచ్చు. కానీ సమాజం మాత్రం వదిలిపెట్టదు. పొడిచి పొడిచి చచ్చేదాకా సాధిస్తుంది" అంది.

ఆమె మాటల్లో సమాజంపైన ద్వేషమున్నదో, కూతురికి సందేశమున్నదో ఆమెకే తెలియదు. కానీ ఆ మాటలు గౌరిని బాగా దెబ్బతీశాయి.

"అత్యాచారాన్ని సహించి బ్రతడంగూడా నేరమే!" అన్న తల్లి మాటలు అదేపనిగా గౌరి చెవిలో గింగురుమంటున్నాయి. తల్లి ఉద్దేశ్యమేమిటి? ఆమె తనను చావమని సూచిస్తున్నదా?

కన్నతల్లి కూతురితో ఎంత మాట అన్నది!

అవును మరి—తన కారణంగా తల్లికీ, అన్నకూ జీవితం దుర్భరమయింది. తనకెలాగూ భవిష్యత్తు లేదు. కానీ వారికి....

15

ఆ రాత్రి గౌరికి నిద్ర పట్టలేదు. ఇంట్లో సద్దుమణిగాక అంతా పడుకున్నాక ఆమె నిద్ర లేచింది.

గౌరి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది.

పెరట్లో బావి వుంది. అదామెను ఆహ్వానిస్తోంది.

గౌరి బావి సమీపించింది. మనసులో తల్లిని తల్చుకుంది.

"అమ్మా! అత్యాచారాన్ని సహించి బ్రతకను. ఈ సమాజం దృష్టిలోనూ, నీ దృష్టిలోనూ నేరస్థురాల్ని కాదల్చుకోలేదు."

గౌరి బావిలోనికి తొంగి చూసింది. బావి లోతుగా వుంది. నిశ్చలంగా వుంది. తను బావిలోకి దూకితే కాసేపు నీటిలో చలనం. ఆ తర్వాత ఆ నీటికీ తనకూ గూడా చలనం వుండదు. జీవితం ఎంత క్షణికమైనది? ఈ క్షణికమైన జీవితంలో ఎన్ని సమస్యలు?

గౌరి బావిలో దూకడం కోసం కొంగు బిగించింది. అప్పుడామెకు కొంగు చివర ముడివేసి వున్న పులిగోరు పతకం చేతికి తగిలి ఉలిక్కిపడింది.

తననీ స్థితిని తెచ్చినవాడి గురించి తనకు తెలిపిన ఒకే ఒక్క ఆధారమది! వాడి దుర్మార్గం తనను అపరాధిని చేసింది. తను చావబోతోంది.

మరి వాడేమౌతాడు?

వాడు మరో గౌరిని చెరబడతాడు బావివైపు తరుముతాడు.

వాడి పేరు చెప్పి కన్నెపిల్లలు చావులవైపు పరుగెడుతూంటే వాడు చిద్విలాసంగా కొత్త పిట్టలకోసం తిరుగుతూంటాడు.

వాడినెవరు పట్టుకుంటారు? వాడినెవరు శిక్షిస్తారు?

గౌరి కనులముందు తుపాకీతో గుర్రంమీద కూర్చుని

అపరాధ పరిశోధన పోటీ-183

[ఫలితాలు]

అక్టోబరు '83 నెల "అపరాధ పరిశోధన పోటీ—183"కి సరియైన సమాధానాలు:

1. ఆంధ్రప్రదేశ్.
2. ఆక్సిడెంటులు.
3. గ్రుడ్డు.
4. మురికివాడలు.
5. మనోనేత్రము.

పై జవాబుల ప్రకారం ఇద్దరు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జనవరి '84 నెల నుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీమతి జె. కనకతార,
D/o కొమరయ్య,
ఇంటి నెం. 1-4-52/3,
నియర్ క్రిష్ణమందిర్,
మెయిన్‌రోడ్, బెల్లంపల్లి-504 251,
(ఆదిలాబాదు జిల్లా)

(2) శ్రీ జి. అప్పారావు,
C/o వస్త్రులత,
పిఠాపురం-533 450, (తూ. గో. జిల్లా)

గ్రామస్థుల్ని అదిలిస్తున్న దొంగల నాయకుడు మెదిలాడు. కాస్త దూరంలో తన దాబా గది కిటికీకి తను తారాజువ్వ బాంబు కడుతున్న దృశ్యం మెదిలింది.

తను ఏం చేసింది?

నరరూప రాక్షసుడైన బందిపోటును ప్రాణాలకు తెగించి పట్టుకుంది. ఊరు ఊరంతా అందుకు తనను మెచ్చు కుంది. కానీ ఊరు మెచ్చుకుంటుందనే ఉద్దేశ్యంతో తనప్పుడా పని చేయలేదు.

తను ఆ ఘోర దృశ్యం చూస్తూ వుండలేకపోయింది.

అది తన రక్తంలో వుంది అది రామదాసు రక్తం. నీకు నువ్వుకాదు ముఖ్యం. నీ చుట్టూ వున్నవాళ్ళే నీకు ముఖ్యం. వాళ్ళకోసం నువ్వేమైనా చేయి. ఆ చేయడంలో నీవేమైపోతావన్న ఆలోచనే నీకుండకూడదు.

అదే గౌరి ఆశయం. ఆమెకు తెలియకుండానే ఆ ఆశయం ఉగ్గుపాలనుంచీ ఆమెలో జీర్ణించుకపోయింది.

అప్పుడు గౌరిని యెవరో "ఊరి కన్యాయం జరుగు తూంటే చూస్తూ ఊరుకోలేని నువ్వు నీ కన్యాయం జరి గితే ఏమీ చేతకానిదానిలా చేతులు ముడుచుకుని కూర్చుం టావా?" అని నిలదీసినట్లయింది.

గౌరి కొంగు విప్పింది. పులిగోరు పతకం తీసింది.

తనెలాగూ చావాలనుకుంది. అలాంటప్పుడు ఆ దుర్మా ర్గుణ్ణి చంపి చస్తే ప్రపంచానికి ఓ పీడ విరగడవుతుంది. ఈ ప్రయత్నంలో తనేమైపోయినా యెందరో కన్నెపిల్లలు రక్షించబడతారు!

గౌరి చేతిలో పులిగోరు పతకం నలిగింది. ఆమె పిడి కిలి దాని చుట్టూ బిగిసింది.

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 63 : మాధవరావుకు సంబంధించిన వస్తువులను బహిరంగ వేలంలో అమ్ముతున్నారని - రాధాక్రిష్ణ టాం టాం చేశాడు. అయితే అది అబద్ధం. అతని వస్తువులేవీ వేలం వేయటం జరుగలేదు.

రాధాక్రిష్ణ ప్రచారం వల్ల, తాను దివాళా తీసాననే భావాన్ని ప్రజల్లో కలిగించి, తన పరువు తీశాడనీ, రాధాక్రిష్ణ పై మాధవరావు కోర్టులో పరువు నష్టం దావా వేశాడు.

న్యాయమూర్తులుగా మీ తీర్పు ఏమిటి?

[పై కేసులో - మీ తీర్పు ఏమిటో ఒక పోస్టుకార్డుపై వ్రాసి 5-12-83 తేదీలోపల మాకు చేరేటట్లు పంపండి. అత్యుత్తమమైన తీర్పుకు 6 నెలలపాటు పత్రికను బహుమతిగా పంపుతాము. ఫలితాలు ఫిబ్రవరి '84 నెల సంచికలో చూడండి. —ఎడిటర్]

కేసు నెం. 61 (తీర్పు)

స్వరూపరాణి రిట్ చెల్లదు.

కేవలం డిగ్నిటీకి భంగం కలిగించి, ఫీజు, లాభాలు ఇలాటి విషయాలకు భంగం కలిగించని చర్యపై ఏ విధమైన దావాలు వేసే అవకాశం లేదు. ఇక్కడ హిస్టరీ పేపరు పోయింది. పోయిన పేపరును తిరిగి యూనివర్సిటీ తీసుకు రాలేదు. పేపర్ లేకుండా పరీక్ష ప్యాస్ చేయటమూ సాధ్యపడదు. స్వరూపరాణి రిట్ తిరస్కరించబడుతుంది.

ఈ నెల న్యాయనిర్ణేత: శ్రీ యస్. శివస్వామి, ఎం.ఏ., అగ్రహారం వీధి, బొబ్బిలి-532 558.

16

పట్నంలో మూడులాంతర్ల జంక్షన్ వద్ద రిక్షా దిగింది గౌరి. ఆ మహాపట్నాన్ని ఆమె ఆశ్చర్యంగానూ, భయంగానూ చూస్తోంది.

ఈ మహాపట్నంలో తానేం చేయాలని వచ్చింది? ఇక్కడ తాను ఏమైనా సాధించగలదా?

ఆ రోజు తనకు జరిగిన అనుభవాన్నిబట్టి ఆ దుర్మార్గుడి యిల్లు ఈ ప్రాంతాల్లోనే ఉండివుండాలి.

గౌరి నెమ్మదిగా నడిచి టీ దుకాణం చేరింది. అక్కడ ఆగి చుట్టూ చూడసాగింది.

ఆ కోలాహలం అదంతా ఏమిటో యెప్పుడో విన్నట్లుగానే అనిపిస్తున్నది. కానీ చూపులకు మాత్రం అంతా కొత్తగా వున్నది.

గౌరి కళ్ళు మూసుకుంది. అప్పుడామెకు పాత అనుభవం గుర్తుకు వచ్చి శరీరం వణికింది. మళ్ళీ కళ్ళు తెరిచింది.

చలం సాధారణంగా ఆ ప్రాంతాలే తిరుగుతూండి వుండాలి. లేదా అనుకోకుండా అక్కడికి వచ్చివుండాలి. అత డామెను చూశాడు. చూడగానే ఆశ్చర్యం కలిగింది.

"తగిలిన లాటరీయే మళ్ళీ తగిలినట్లు ఈ గుడ్డిది మళ్ళీ యిక్కడికి వచ్చిందే" అనుకున్నాడు.

ఆలోచించగా గౌరి ఆ అనుభవం రుచి మరిగిందేమోనని వాడికి అనుమానం వచ్చింది. కాసేపు వా డామెను సమీపించడానికి తలపటాయించాడు. కానీ అది కాసేపు మాత్రమే! ఆ కాసేపట్లోనూ గౌరి ఆ అనుభవాన్ని కోరే యిక్కడ నిలబడిందని వాడి పరిమిత మేధస్సుకు తోచింది. ఆమెను సమీపించాడు.

అపరాధ పరిశోధనపోటీ-185

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-12-83 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఫిబ్రవరి '84 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌లలో ప్రముఖ ఆటగాడు గవాస్కర్ అత్యధిక స్కోరు ఎంత—? (221, 293)
2. ఇటీవల ఇవి జాతీయం చేయబడినవి—? (జౌళి మిల్లులు, బ్యాంకులు)
3. స్త్రీలు ఎక్కువగా యీ ఉద్యోగాలపై ఆసక్తి చూపుతున్నారు—? (బ్యాంకు, టీచరు)
4. ఇవి వస్తే కుటుంబంలో అందరికీ మనశ్శాంతి కరువే—? (రోగాలు, కష్టాలు)
5. మీకు ఎక్కువగా ఏది ఇష్టం—? (కమ్మని సంగీతం, చిక్కటి తేనీరు)

గౌరి చలాన్ని చూడలేదు. ఆమె తన ఆలోచనల్లో మునిగి వుంది.

చలం నెమ్మదిగా ఆమె చేయి పట్టుకుని దగ్గుతున్నట్లుగా "పద" అన్నాడు. అంతే! మరుక్షణం వాడి చెంప ఛెళ్ళు మంది.

"అరే-నువ్వు గుడ్డివానివి కాదా!" అంటూ చలం మరు క్షణంలో పరుగెత్తి పారిపోయాడు.

వాడి మాటలు గౌరిపై వెంటనే పనిచేశాయి. తను గుడ్డిదని వాడెందు కనుకున్నాడు? గతంలోనూ ఒకడిలా తన చేయి పట్టుకున్నాడు. వాడే వీడా?

తను ఎంత పొరపాటు చేసింది? ఆవేశంలో వాడిమీద చేయి చేసుకుంది. ఏ ఆధారమూ లేదే అనుకుంటున్న సమ యంలో తనను వెతుక్కుంటూ వచ్చిన ఆధారాన్ని తెలివి తక్కువగా పోగొట్టుకుంది.

ఇప్పుడేం చేయాలి?

రోడ్డుమీద జనం చాలా హడావుడిగా అటూ యిటూ తిరగేస్తున్నారు. యెవ్వరూ యెవ్వరినీ పట్టించుకోవడం లేదు.

"కాసేపు మళ్ళీ ఇక్కడే ఆగుతాను. ఎవరైనా మళ్ళీ నా కోసం రావచ్చు—" అనుకున్నదామె.

ఈసారి యెవరైనా వస్తే ఆవేశాన్నణచుకోవాలనుకున్నది గౌరి. ఆమె చేతులు చీరకొంగును తడిమాయి. పులిగోరు పతకం కరుకుగా తగిలింది.

17

చలం తిన్నగా గోపాలకృష్ణ దగ్గరకు వెళ్ళాడు.

"కొత్త పిట్ట కబురా?" అన్నాడు గోపాలకృష్ణ వుత్సా

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి. మీ నెంబరు ప్రతి నెలా వి. పి. ప్యాకెట్టు మీద వుంటుంది.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-2-'84 తేదీలోపల మాకు చేరాలి. ఫలితాలు ఫిబ్రవరి '84 నెల సంచికలో ప్రకటిస్తాము.

అక్టోబరు '83 పోటీ ఫలితాలు

(1) అక్టోబరు '83 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

కత్తెందుకు, చూడు!
మీటల పనే నేడు!!

పంపినవారు: శ్రీ వెగ్గళం చందు, బి. ఎస్‌సి, (ఫిషరీస్), 12-3-99/2, ఖాదర్‌పుర, సిద్దిపేట-502 103, (మెదక్ జిల్లా.)

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

ఎదురులేదు నాకు!
భయపడను నీకు!!

పంపినవారు: శ్రీ బి. జగపతి రాజా, 38/960, అజిత్ నగర్, విజయవాడ—520 015.

హంగా.

"లేదు బాస్—పాత పిట్ట కబురే—" అన్నాడు చలం.

"అంటే?"

"పదినెలల క్రితం మీ కోసం ఓ గుడ్డిదాన్ని తీసుకొచ్చాను. దాన్ని రోజు మళ్ళీ చూశాను. అయితే అది గుడ్డిది కాదు. ఇందులో యేదో మోసమున్నదనిపిస్తోంది. ఎందుకయినా మంచిదని — మీకు చెప్పి పోదామని వచ్చాను—"

గోపాలకృష్ణ సాలోచనగా—అది గుడ్డిదేనని నా నమ్మకం. అది నిజంగా గుడ్డిది కానిపక్షంలో మహానటి అయుండాలి. రేప్‌సీన్లో కూడా గుడ్డిదానిగా అంత గొప్పగా నటించిందంటే అది పోలీస్‌ల మనిషయుండాలి. అదంతా క్షణాలమీద తేల్చేస్తాను. ఒక్క-క్షణం ఇక్కడే వుండు—" అంటూ అతను లోపలకు వెళ్ళాడు.

లోపల మామూలుగానే వున్నదో గది. అతడు స్విచ్ బోర్డుని సమీపించాడు. ఒక స్విచ్‌ను వరుసగా మూడుసార్లు ఆన్ చేసి, ఆఫ్ చేశాడు.

వెంటనే పక్కనే వున్న గోడ రెండుగా విడిపోయింది.

ఆ గోడ మధ్య ప్రాంతాన భూమిలోపలకూ మెట్లు వున్నాయి.

గోపాలకృష్ణ ఆ మెట్లు దిగాడు. తిన్నగా ఓ గది చేరుకున్నాడు.

ఆ గదిలో చూడగానే గూండాలని తెలిసిపోయేలా వున్నవాళ్ళు సుమారు పదిమంది వున్నారు. ఆ పదిమంది

శ్రీమహాలక్ష్మి వారి వెరైటీ నవలలు

వెలువడినవి!

1. నాతిచరామి
మల్లాది వెంకటకృష్ణమూర్తి 15-00
2. ప్రేమిస్తే ఏమవుతుంది! ,, 12-00
3. కాంచన గ్రహం వాణిశ్రీ 17-00
(అపరాధ పరిశోధన సీరియల్)
4. చంద్రోదయం మాన్నం శారద 15-00
5. సంకెళ్ళు యార్లగడ్డ సరోజినీదేవి 12-00
6. పూలరథం జి. భవానీ కృష్ణమూర్తి 15-00
7. పంతులమ్మ మాదిరెడ్డి సులోచన 15-00
8. ఒక్క క్షణం శ్రీరాజ్ 15-00

కాపీలు అన్ని పుస్తకాల షాపులలోను లభించును. లేదా మాకు వ్రాయండి.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్

గవర్నరు పేట_విజయవాడ_2.

లోకి ప్రత్యేకంగా కనబడుతున్న ఓ గూండా వున్నాడు. వాడు కండలు తిరిగిన ఆజానుబాహువు.

"టైగర్!" అన్నాడు గోపాలకృష్ణ.

ఆ ఆజానుబాహువు వెంటనే — "ఎస్ బాస్!" అన్నాడు.

గోపాలకృష్ణ నెమ్మదిగా — "నేను నీకు చాలా చిన్న పని చెబుతున్నాను. నువ్వు అన్యథా భావించకూడదు—" అన్నాడు.

"చిన్న పనయితే నాకు చెప్పొద్దు బాస్!" అన్నాడు టైగర్.

"అది చిన్నపనో, పెద్దపనో ఇంకా నేను తేల్చుకోలేక పోతున్నాను. నిజంగా చిన్నపనే అనుకో—చిన్న పాము నయినా పెద్ద కర్రతో కొట్టామని తృప్తిపడొచ్చు. ఒకవేళ పెద్దపని అనుకో—నిన్ను పంపలేదని తర్వాత నేను విచారించకూడదు. అయినా అది చిన్నపనో, పెద్దపనో నువ్వు ఇట్టే తేల్చేయగలవు—" అన్నాడు గోపాలకృష్ణ టైగర్నే పరీక్షగా చూస్తూ.

"విషయమేమిటో చెప్పు బాస్!" అన్నాడు టైగర్.

గోపాలకృష్ణ అతడికి గౌరి గురించి క్లుప్తంగా చెప్పి—"దాన్ని మీకు చలం చూపిస్తాడు. పట్టుకుని నా దగ్గరకు తీసుకొచ్చే యేర్పాటు చేసే బాధ్యత నీది!" అన్నాడు.

(ఇంకావుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.